ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

ఆదివారం 13.09.2026 | సంపుటి : 13 సంచిక : 55 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# 22ఏపై ఆందోళనవద్దు

*దొరల పాలనలో పాసుపుస్తకాలు ఉండేవి కానీ, భూములు మాత్రం ఉండేవి కాదు. ధరణి చట్టం తెచ్చి తమ బంధువులు, రాజకీయ అనుచరులకు పాసుపుస్తకాలు ఇచ్చారు. భూమిలేకుండానే ఆ పాసుపుస్తకాలకు కోట్ల రూపాయల రైతుబంధు ఇచ్చారు. భూమిలేని వారికీ రైతుబంధు ఇచ్చి వేలకోట్ల ప్రజాధనం కొల్లగొట్టారు. అసలు అసెంబ్లీ ఇక్కడ నిర్వహిస్తుంటే మాక్ అసెంబ్లీ ఎందుకు? అసెంబ్లీకి రాకుండా మాక్ అసెంబ్లీ పెట్టుకుని అక్కడ డ్రామాలు ఆడుతున్నారు" - పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి*



## ప్రజల ఆస్తులకు పూర్తి రక్షణ కల్పిస్తాం

- నిషేధిత భూముల జాబితా కొత్తగా వచ్చింది కాదు, గతంలో ఉన్నదే
- 'ధరణి'ని అడ్డుపెట్టుకుని గత పాలకులు వేలాది ఎకరాలు చెరబట్టారు వ్యవసాయబావులకు మోటార్లు బిగించం
- తెలంగాణ ఉద్యమకారులను గుర్తిస్తాం
- అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** ప్రజల ఆస్తుల పరిరక్షణే రెవెన్యూ సంస్కరణల లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని గత పాలకులు లక్షలాది ఎకరాలు చెరబట్టారని ఆక్షేపించారు. ఇప్పుడు అసెంబ్లీ సాక్షిగా వాళ్ల బండారం బయటపడుతుందని తప్పించుకొని తిరుగుతున్నారని విమర్శించారు. 22ఏ నిషేధిత భూముల అంశంపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా శాసనసభలో పొంగులేటి మాట్లాడారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను గత పాలకులు స్వప్రయోజనాల కోసం వాడుకున్నారని మండిపడ్డారు. "పదేళ్లలో కేసీఆర్ కుటుంబం, వాళ్ల బంధువులు మాత్రమే బాగుపడ్డారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత రెవెన్యూ శాఖను కేసీఆర్ తనవద్దే ఉంచుకొని.. భూముల అక్రమాలకు పాల్పడ్డారు. భూములు కొల్లగొట్టేందుకే ధరణిని వాడుకున్నారు. రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాలను తమ సొంత ఆస్తిలా గత పాలకులు భావించారు. దివాళా తీసిన విదేశీ సంస్థకు ధరణి పోర్టల్ నిర్వహణను అప్పగించారు. ధరణి పోర్టల్‌ను గుప్పిట్లో పెట్టుకొని అర్ధరాత్రి వేళ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. పోర్టల్‌లో దొర్లిన తప్పులకు లక్షలాది మంది రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగారు. వందల సంఖ్యలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు" అని పొంగులేటి అన్నారు.

**వారందరికీ పట్టాలు**

"రెవెన్యూ రికార్డుల ప్రకారం 387 గ్రామాలకు నక్షలు లేవు. దాదాపు 125 సంవత్సరాల తర్వాత గ్రామాల్లో సమగ్ర భూసర్వే చేపట్టాం. ధరణి ఉన్నప్పుడు 2.49 లక్షల దరఖాస్తులు ఉండేవి. భూభారతిగా

మిగతా 2లో..

### వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

- నిమజ్జనాలు చేసే చెరువుల వద్ద ఏర్పాట్లు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం
- గణేశ్ ఉత్సవాలపై రేవంత్ రెడ్డి సమీక్ష

2లో..

### హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం: శ్రీధర్‌బాబు

### ఇప్పటివరకు 22ఏ నుంచి ఎన్ని భూములు తొలగించారు?

ప్రజలకు క్షమాపణ చెప్తారని ఆశించాం: హరీశ్‌రావు






## వ్యంగ్యాస్త్రాలతో బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ

- తెలంగాణ భవన్‌లో 'నమూనా అసెంబ్లీ' నిర్వహణ
- కొండా సురేఖ తొలగింపుపై తలసాని తీవ్ర సెటైర్లు
- సీఎం రేవంత్ రెడ్డిని లక్ష్యంగానూ వ్యంగ్యాస్త్రాలు
- 100 రోజుల హామీల అమలుపైనా చురకలు

**హైదరాబాద్(జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ పార్టీ విమర్శనాస్త్రాలు సంధించింది. తమ ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శనివారం హైదరాబద్‌లోని తెలంగాణ భవన్‌లో 'మాక్ అసెంబ్లీ' నిర్వహించారు. ఈ వేదిక ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై, ప్రభుత్వ హామీల అమలుపై బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఈ మాక్ అసెంబ్లీలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు స్పీకర్‌గా వ్యవహరించగా, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి పాత్రను పోషించి రేవంత్ రెడ్డిని అనుకరిస్తూ మాట్లాడారు. ఇటీవల మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన అంశాన్ని ప్రస్తావిస్తూ, "కొండా సురేఖ కుమార్తె నా గురించి మాట్లాడినందుకే ఢిల్లీకి వెళ్లి, మూడు రోజులు ఉండి, ఆమెను (సురేఖను) అణచివేసి వచ్చాను. బీసీ బిడ్డనైన నేను సీఎం అయ్యాక, ఆమెను కేబినెట్ నుంచి తీసేయక ఏం చేయగలను?" అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రకటించిన 100 రోజుల హామీలపైనా తలసాని చురకలంటించారు. "100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పాం కానీ, ఏ 100 రోజుల్లో అని చెప్పామా? ఢిల్లీలో మాకూ కొన్ని ఇబ్బందులు ఉంటాయి కదా" అంటూ ఎద్దేవా చేశారు. తమ పార్టీ

మిగతా 2లో..






### దసరాకు కొత్త పింఛన్ల పంపిణీ

- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- కొత్తగా 2.50 లక్షల నూతన పింఛన్లు
- ఆగస్ట్ 9 నుంచి దరఖాస్తుల స్వీకరణ



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో కొత్త పించన్ల కోసం ఎదురుచూస్తున్నవారికి శుభవార్త. కొత్త పింఛన్ల పంపిణీకి రేవంత్ సర్కార్ ముహూర్తం ఖారారు చేసింది. దసరా కానుకగా కొత్త పింఛన్లను అందించనుంది. కొత్తగా రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల నూతన పింఛన్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అర్హుల నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించింది. లక్షల మంది దరఖాస్తులు చేసుకోగా.. వీరిలో అసలైన అర్హులను ఎంపిక చేయాల్సి ఉంది. దరఖాస్తు చేసుకున్నవారి ఇంటికి అధికారులు నేరుగా వెళ్లనున్నారు. వారికి నిజంగా అర్హత ఉందా.. లేదా అనే వివరాలు పరిశీలించనున్నారు. ఈ నెలాఖరు వరకు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అనంతరం

మిగతా 2లో..




## 'బ్రిక్స్' ఎవరికీ వ్యతిరేకం కాదు

### ప్రపంచవ్యాప్తంగా పెరుగుతోన్న సంఘర్షణలకు సభ్య దేశాలు పరిష్కారం చూపించాలి

- ప్రపంచానికి నియమాలు నిర్దేశించేవిగా ఎదగాలి
- ఏఐ, సైబర్ స్పేస్, బయోటెక్నాలజీ రంగాల్లో సభ్యదేశాలు పరస్పరం సహకరించుకోవాలి
- బ్రిక్స్ వార్షిక సదస్సులో ప్రధాని మోదీ ప్రారంభోపన్యాసం
- అతిపెద్ద దేశాలుగా ఉన్న భారత్, చైనా కలిసి నడవాలి
- ఆధునిక టెక్నాలజీతో వేగంగా పురోగతి సాధించాలి
- ప్రధాని మోదీని 21 సార్లు కలిశా:చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్
- పశ్చిమాసియా యుద్ధంతో తీవ్రమని ఉద్ఘాటన
- ఐరోపా దేశాలను మేం బెదిరించట్లేదు..
- కానీ మా దేశ ప్రయోజనాలకు, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు: పుతిన్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రపంచవ్యాప్తంగా పెరుగుతోన్న సంఘర్షణలకు బ్రిక్స్ దేశాలు పరిష్కారం చూపించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. గ్లోబల్ సౌత్ దేశాలు ఇక నుంచి నిబంధనలు పాటించేవిగానే ఉండకూడదని.. ప్రపంచానికి నియమాలు నిర్దేశించేవిగా ఎదగాలని ఆకాంక్షించారు. దిల్లీలోని భారత మండపం వేదికగా జరుగుతోన్న బ్రిక్స్ వార్షిక సదస్సులో ప్రారంభోపన్యాసం చేసిన ఆయన ఏఐ, సైబర్ స్పేస్, బయోటెక్నాలజీ రంగాల్లో సభ్యదేశాలు పరస్పరం సహకరించుకోవాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలో బ్రిక్స్ ప్రత్యేక గుర్తింపు పొందిందని, అయినప్పటికీ ఇది ఏ ఒక్కరికీ వ్యతిరేకం కాదన్నారు. మోదీ చేసిన ఈ వ్యాఖ్యలు అమెరికాతోపాటు పాశ్చాత్య దేశాలకు ఓ సందేశంగా నిపుణులు భావిస్తున్నారు. "బ్రిక్స్ ఏర్పాటు చేసి రెండు దశాబ్దాలు పూర్తయ్యింది. ప్రజలకు మనం భరోసా కల్పించాలి. కష్టాల్లో ఉన్నప్పుడు ఉమ్మడి బాధ్యత

మిగతా 2లో..



### డాలర్ వద్దు.. స్థానిక కరెన్సీలోనే వాణిజ్యం

- బ్రిక్స్ సభ్యదేశాల మధ్య కుదిరిన ఏకాభిప్రాయం
- ఏకపక్ష యుద్ధాల్ని ఖండించిన సమావేశం
- ఏకపక్ష సుంకాలపై దిల్లీ డిక్లరేషన్‌కు ఆమోదం

2లో..


'బ్రిక్స్ ఏర్పాటు చేసి రెండు దశాబ్దాలు పూర్తయ్యింది. ప్రజలకు మనం భరోసా కల్పించాలి. కష్టాల్లో ఉన్నప్పుడు ఉమ్మడి బాధ్యత తీసుకుందాం. ప్రస్తుతం ప్రపంచ పాలనా నిర్మాణం ఓ పిరమిడ్‌లా కనిపిస్తోంది. అధికారం, నిర్ణయాలు తీసుకోవడం అనేది శిఖర భాగంలో కేంద్రీకృతమై ఉండగా.. దిగువన ఉన్న దేశాలు ఆ నిర్ణయాల వల్ల ప్రభావితం అవుతున్నాయి. ఆ నిర్ణయాలను రూపొందించడంలో వీటి పాత్ర పెద్దగా ఉండటం లేదు. ప్రపంచ సంక్షోభాలలో ముందువరుసలో ఉన్న గ్లోబల్ సౌత్.. నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో మాత్రం వెనకబడి ఉంది. ఇకపై ప్రతి సభ్య దేశం భాగస్వామిగా మారి.. గళం వినిపించాలి. ఇందుకోసం చేసే ప్రతి ప్రయత్నం మానవాభివృద్ధి కోసమే ఉండాలి. వచ్చే సదస్సు నాటికి కొత్త సంస్కరణలతో సిద్ధం కావాలి.

- ప్రధాని మోదీ

"ద్వైపాక్షిక సంబంధాల దీర్ఘకాలిక అభివృద్ధిని వ్యూహాత్మక కోణంలో ఇరుపక్షాలు దృష్టిలో ఉంచుకోవడంతోనే చైనా-భారత్ సంబంధాలు అభివృద్ధి చెందాయి. చైనా, భారత్‌లు భిన్నమైనవి. అయినప్పటికీ ఉమ్మడి అభివృద్ధిని సాధించడానికి ఇరు దేశాలు పరస్పరం మద్దతు ఇచ్చుకున్నాయి. సహాయం చేసుకున్నాయి. దిల్లీలో జరిగిన బ్రిక్స్ సదస్సుకు హాజరవడం, ప్రధాని మోదీని మరోసారి కలవడం నాకు చాలా ఆనందంగా ఉంది. భారత్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సు విజయవంతమైనందుకు మోదీకి నా హృదయపూర్వక అభినందనలు."

- చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్,

## ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించేందుకే..



### ఇరాన్‌తో నేటికీ పోరాడుతున్నాం

### పశ్చిమాసియా ఘర్షణలను సమర్థించుకున్న ట్రంప్



**న్యూయార్క్(జనంసాక్షి):** ఇరాన్‌పై యుద్ధాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమర్థించుకున్నారు. అల్‌ఖైదా ఉగ్రసంస్థ అమెరికాపై 2001లో నిర్వహించిన ఉగ్రదాడికి 25 ఏళ్లు నిండిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పశ్చిమాసియా ఉద్రిక్తతలను ప్రస్తావించారు. "నాడు ఉగ్రవాదంపై జరిగిన పోరులో పాల్గొన్న ప్రతి అమెరికా సైనికుడికి సెల్యూట్ చేస్తున్నాను. ఇప్పుడు ప్రపంచంలో ఉగ్రవాదానికి నంబర్ వన్ స్పాన్సరర్‌గా ఉన్న ఇరాన్‌కు ఎప్పటికీ అణ్వాయుధం దక్కకుండా మా సైనికులు కృషి చేస్తున్నారు. మేం గెలిచేందుకే పోరాడుతున్నాం. మా దగ్గర మరో అవకాశం లేదు. అందుకే నేటికీ మేం యుద్ధం చేస్తున్నాం" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

మిగతా 2లో..

### వచ్చే వారమే రష్యాపై ఆంక్షల బిల్లు..

భారత్‌కు టారిఫ్‌లు తప్పవా..?

2లో..




## 2022 నాటి ఉద్యోగాల నోటిఫికేషన్ రద్దు

### త్వరలోనే టీజీపీఎస్సీ కొత్త నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) బిగ్ అలర్ట్ ఇచ్చింది. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు (లెక్చరర్లు), ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి సంబంధించి 2022లో జారీ చేసిన బ్రీఫ్ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. మొత్తం 544 ఖాళీల భర్తీకి ఇచ్చిన ఈ నోటిఫికేషన్‌ను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు కమిషన్ వెబ్‌నోట్ ద్వారా వెల్లడించింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2022 డిసెంబర్ 31వ తేదీన కాలేజియేట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లోని

మిగతా 2లో..

## కొత్త రైళ్ల కొనుగోలుకు పచ్చజెండా



- మెట్రో ప్రయాణికులకు శుభవార్త
- రూ.600 కోట్ల వ్యయంతో కొత్త రైళ్ల కొనుగోలు
- రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వ నిర్ణయం

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. మెట్రో రైళ్లల్లో రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వం మందడుగు వేసింది. ప్రస్తుతం పీక్ సమయాల్లో మెట్రోలలో విపరీతమైన రద్దీ ఉంటుంది. కనీసం నిల్చోవడానికి కూడా స్థలం ఉండటం లేదు. ఈ సమస్యతో మెట్రో ప్రయాణికులు ఎప్పటినుంచో ఇబ్బంది పడుతుండగా.. ఇప్పుడు పరిష్కారానికి ప్రభుత్వం సిద్దమైంది. రద్దీని తగ్గించేందుకు కొత్త రైళ్లను తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం కొత్త రైళ్లను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం రెడీ అవుతోంది. ఒక్కో రైల్లో 2 వేల మంది ప్రయాణించేందుకు వీలుగా 6 కోచ్‌ల రైళ్లను ప్రవేశపెట్టనుంది.తొలి దశలో 60 కోచ్‌లను కొనుగోలు చేయనుండగా.. ఆరు కోచ్‌లతో కూడిన 10 కొత్త రైళ్లను అందుబాటులోకి తీసుకొస్తారు. ఒక్కో రైలుకు రూ.60 కోట్ల వరకు ఖర్చు కానుంది. 60 కోచ్‌ల కొనుగోలుకు రూ.600 కోట్ల వరకు వ్యయం కానుందని అంచనా వేశారు. త్వరలోనే కొత్త రైళ్ల కోసం టెండర్లను ఆహ్వానించనున్నారు. బిడ్ల కోసం నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత తుది వ్యయం ఎంత అవుతుందనేది తెలియనుంది. ప్రస్తుతం ఉన్న మెట్రో

మిగతా 2లో..

### ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతం

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి
- రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడుతో భేటీ

2లో..

### రాష్ట్రవ్యాప్తంగా వారం రోజుల పాటు వర్షాలు



## రాష్ట్రవ్యాప్తంగా వారం రోజుల పాటు వర్షాలు

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ హెచ్చరికలు జారీ చేసింది.ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. వీటితో పాటు నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్ నగరంలోనూ మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో తేమ శాతం పెరగడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ హెచ్చరించింది. ప్రధానంగా దోమలు, కలుషిత నీరు, గాలి ద్వారా వ్యాపించే అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. దోమతెరలు వాడటం, నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడటం, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరింది. ఎవరికైనా ఫ్లూ లక్షణాలు కనిపిస్తే జాప్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు స్పష్టం చేశారు.

## ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించేందుకే..

న్యూయార్క్(జనంసాక్షి):ఇరాన్‌పై యుద్ధాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమర్థించుకున్నారు. అల్‌ఖైదా ఉగ్రసంస్థ అమెరికాపై 2001లో నిర్వహించిన ఉగ్రదాడికి 25 ఏళ్లు నిండిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పశ్చిమాసియా ఉద్రిక్తతలను ప్రస్తావించారు. "నాడు ఉగ్రవాదంపై జరిగిన పోరులో పాల్గొన్న ప్రతి అమెరికా సైనికుడికి సెల్యూట్ చేస్తున్నాను. ఇప్పుడు ప్రపంచంలో ఉగ్రవాదానికి నంబర్ వన్ స్పాన్సరర్‌గా ఉన్న ఇరాన్‌కు ఎప్పటికీ అణ్వాయుధం దక్కకుండా మా సైనికులు కృషి చేస్తున్నారు. మేం గెలిచేందుకే పోరాడుతున్నాం. మా దగ్గర మరో అవకాశం లేదు. అందుకే నేటికీ మేం యుద్ధం చేస్తున్నాం" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

## వచ్చే వారమే రష్యాపై ఆంక్షల బిల్లు..

వాషింగ్టన్(జనంసాక్షి):రష్యాపై ఆంక్షలు కఠినతరం చేసే బిల్లుపై అమెరికా ప్రతినిధుల సభ సోమవారం ఓటింగ్ చేపట్టేందుకు సిద్ధమైంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై టారిఫ్‌లు విధించేలా అమెరికా ప్రత్యేక బిల్లును తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. 'లిండ్సే గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ 2026'ను అమెరికా సెనెట్ గత నెలలో భారీ మెజారిటీతో ఆమోదించింది. ఈ బిల్లును డెమోక్రాట్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇది ట్రంప్‌నకు విస్తృతమైన అధికారాలను ఇస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందితే.. రష్యా నుంచి పెద్దఎత్తున ఇంధనం కొనుగోలు చేస్తున్నందున భారత్‌పై టారిఫ్‌ల భారం పడే అవకాశం ఉంది. భారత్–అమెరికా వాణిజ్య సంబంధాలపైనా ప్రభావం పడొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

## కొత్త రైళ్ల కొనుగోలుకు పచ్చజెండా

రైళ్లల్లో మూడు కోచ్‌లు మాత్రమే అందుబాటులోకి ఉన్నాయి. దీంతో ఒకేసారి వెయ్యి మంది మాత్రమే ప్రయాణించడానికి వీలు కలుగుతుంది. అదే ఆరు కోచ్‌లు అందుబాటులోకి వస్తే ఒకేసారి 2 వేల మంది ప్రయాణించవచ్చు. ప్రయాణికుల సంఖ్య దాదాపు రెట్టింపు అవుతుంది. వీటి వల్ల ఒకేసారి ఎక్కువమంది ప్రయాణికులకు తమ గమ్యస్థానాలకు చేర్చవచ్చు.ఎక్కువ కోచ్‌లు కలిగిన రైళ్లు ఉండటం వల్ల ప్రయాణికుల రద్దీ కూడా తగ్గుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ విపరీతంగా ఉండటం వల్ల కనీసం అడుగు వేసేందుకు కూడా ఖాళీ స్థలం ఉండటం లేదు. దీని వల్ల ఇబ్బంది పడుతూ ప్రయాణం చేయాల్సి వస్తోంది. కొన్నిసార్లు తర్వాతి రైలు కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ప్రస్తుతం మెట్రోలో రోజూ 4.5 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. అయితే కొత్త మెట్రో రైళ్లు వస్తే 6 లక్షల వరకు పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. అమీర్ పేట–రాయదుర్గం మార్గంలో ఎక్కువ రద్దీ ఉంటుంది. ఉదయం ఆఫీసులకు వెళ్లే సమయంలో, సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే సమయాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల రాయదుర్గం స్టేషన్‌లో కొన్నిసార్లు ప్రయాణికులకు కొద్దిసేపు ఆపాల్సి వస్తోంది. రద్దీని నియంత్రించేందుకు అధికారులు ఈ ప్రయత్నం చేస్తున్నారు. దీంతో కొత్త రైళ్లను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇవి అందుబాటులోకి వస్తే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. సౌకర్యవంతంగా ప్రయాణం చేయవచ్చు.

## 2022 నాటి ఉద్యోగాల నోటిఫికేషన్ రద్దు

అసిస్టెంట్ ప్రొఫెసర్లు (లెక్చరర్లు), ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టుల భర్తీ కోసం బ్రీఫ్ నోటిఫికేషన్ నంబర్ 33/2022ను విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 544 ఖాళీలను భర్తీ చేయాలని నిర్ణయించారు. అయితే ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన వివిధ అంశాలపై కమిషన్ సుదీర్ఘంగా చర్చించింది. అన్ని పరిస్థితులను సమగ్రంగా పరిశీలించిన తర్వాత 33/2022 బ్రీఫ్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని నిర్ణయించినట్లు తాజాగా టీజీపీఎస్సీ ప్రకటించింది. పాత నోటిఫికేషన్ రద్దు కావడంతో ఈ పోస్టుల భర్తీకి కొత్త నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. కొత్త నోటిఫికేషన్‌ను ప్రస్తుత నిబంధనలు, రోస్టర్ పాయింట్లు, రిజర్వేషన్ విధానాలకు అనుగుణంగా రూపొందించే అవకాశం ఉంది. కమిషన్ వెబ్‌నోట్ ప్రకారం.. 2022 డిసెంబర్ 31వ తేదీన జారీ చేసిన బ్రీఫ్ నోటిఫికేషన్ నంబర్ 33/2022ను తక్షణమే రద్దు చేశారు. 544 ఖాళీలకు సంబంధించిన ఈ నోటిఫికేషన్ ఇక చెల్లుబాటు కాదని అభ్యర్థులు గుర్తించాలని కమిషన్ సూచించింది. పాత నోటిఫికేషన్ రద్దు కావడంతో గతంలో జారీ చేసిన బ్రీఫ్ నోటిఫికేషన్ ఆధారంగా నియామక ప్రక్రియ కొనసాగదని అభ్యర్థులు గమనించాలి. కొత్త నోటిఫికేషన్ విడుదలైన తర్వాత అందులో పేర్కొనే పోస్టుల సంఖ్య, అర్హతలు, వయోపరిమితి, రిజర్వేషన్లు, దరఖాస్తు తేదీలు, ఎంపిక విధానం వంటి వివరాలను అభ్యర్థులు తప్పనిసరిగా పరిశీలించాలి. కొత్త నోటిఫికేషన్‌ను త్వరలోనే విడుదల చేయనున్నట్లు టీజీపీఎస్సీ తన వెబ్‌నోట్‌లో పేర్కొంది. దీంతో డిగ్రీ కాలేజీ లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు కొత్త ప్రకటన కోసం వేచి చూడాల్సి ఉంటుంది.

# '22ఏ'పై ఆందోళన వద్దు

మారిన తర్వాత మరో 3 లక్షల దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 5 లక్షల పైచిలుకు అప్లికేషన్లను పరిష్కరించాం. పరిష్కరించలేని వాటిని ఏ కారణంతో పరిష్కరించలేదో చెప్పాం. పైలెట్ ప్రాజెక్టు కింద ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాల్లో సర్వే చేపట్టాం. ఆయా గ్రామాల్లో ఇప్పటికే భూమి మొత్తం సర్వే చేసి రైతులకు పాసుపుస్తకాలు ఇస్తున్నాం. వచ్చే ఏడాదిన్నరలోపు రాష్ట్ర వ్యాప్తంగా భూ సర్వే పూర్తి చేసి రైతులకు మేలు చేస్తాం.

**భూమి లేకుండానే పాసుపుస్తకాలా?**

దొరల పాలనలో పాసుపుస్తకాలు ఉండేవి... భూములు మాత్రం ఉండేవి కాదు. ధరణి చట్టం తెచ్చి తమ బంధువులు, రాజకీయ అనుచరులకు పాసుపుస్తకాలు ఇచ్చారు. భూమి లేకుండానే ఆ పాసుపుస్తకాలకు రూ. కోట్ల రైతుబంధు ఇచ్చారు. భూమి లేనివారికీ రైతు బంధు ఇచ్చి.. వేల కోట్ల ప్రజాధనం కొల్లగొట్టారు. ఒక్క నల్గొండ జిల్లాలోనే 14 వేల ఎకరాల్లో సర్వే చేస్తే 4 వేల ఎకరాలకు దొంగపట్టాలు ఉన్నాయి. అసలు అసెంబ్లీ ఇక్కడ నిర్వహిస్తుంటే.. మాక్ అసెంబ్లీ ఎందుకు? అసెంబ్లీకి రాకుండా మాక్ అసెంబ్లీ పెట్టుకొని అక్కడ డ్రామాలు ఆడుతున్నారు. చేసిన తప్పు ఒప్పుకొంటే ఇక్కడే ఉండేవారు కదా. ఒక్క రోజులోనే మ్యుటేషన్ చేయడం వల్ల ఎన్నో అక్రమాలు జరిగాయి. ధరణి పోర్టల్‌లో 80 మాడ్యుల్స్ పెట్టి పేద రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టారు. ఇప్పుడు భూభారతి చట్టంలో 80కి బదులు కేవలం 5 మాడ్యూల్స్ పెట్టాం.

**బీఆర్ఎస్ ఆ సమస్యను ఎందుకు పరిష్కరించలేదు?**

25 వేల ఇళ్లు నిషేధిత జాబితాలో ఉన్న మాట వాస్తవం. కొన్ని దశాబ్దాల క్రితం వారు అసైన్డ్ భూముల్లో ఇల్లు కట్టుకున్నది వాస్తవం. పేదల సొంతింటి కల నెరవేర్చుకునేందుకు ప్రభుత్వం అసైన్డ్ భూములు ఇచ్చింది. అసైన్డ్ భూముల విషయంలో ఏం చేయాలో సలహాలు ఇవ్వాలి. అసైన్డ్ భూములు ఉమ్మడి రాష్ట్రం నుంచే నిషేధిత జాబితాలో ఉన్నాయి. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ఈ సమస్యను ఎందుకు పరిష్కరించలేదు" అని పొంగులేటి ప్రశ్నించారు.

**22ఏ నుంచి తొలగించి పేదలకు ఇచ్చాం**

ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి మొత్తం 1,02,05,250 ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని వివరించారు. "22ఏలోని ప్రభుత్వ వ్యవసాయ భూములు: 96,36,777 ఎకరాలు. ప్రైవేటు వ్యవసాయ భూమి: 3,73,930 ఎకరాలు. వ్యవసా యేతర భూమి: 1,94,543 ఎకరాలు. ఇవి కాకుం డా ఎండోమెంట్ భూములు 5,12,792 ఎకరాలు. బీఆర్ఎస్ దిగిపోయేనాటికి, ఇప్పటికి నిషేధిత జాబితాలోని భూమి 47,440 ఎకరాలు తగ్గింది. 23వేల ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించి ప్రజలకు ఇచ్చాం. పాత జీవోల్లోని తప్పు లను గుర్తించి.. మరో 20వేల ఎకరాలను 22ఏ నుంచి తొలగించాం. 22ఏ నుంచి తొలగించిన మొ త్తం 47,440 ఎకరాల్లో ప్రతి ఎకరాకు లెక్కలు ఉన్నా యి. బీఆర్ఎస్ హయాంలో తొలగించిన 23వేల ఎకరాలకు లెక్కలు లేవని కమిటీ చెప్పింది. భువన గిరిలో 25 వేల ఇళ్లు 22ఏలో ఉన్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. ఆయన చెప్పినవి అసైన్డ్ భూముల్లో ఉన్న ఇళ్లు. ఇబ్రహీంపట్నం పరిధి రాందాస్‌పల్లిలో 1300 ఎకరాల గురించి హరీశ్‌రావు మాట్లాడారు. ఆ భూమి దశాబ్దాలుగా నిషేధిత జాబితాలోనే ఉంది. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అప్పుడు ఎందుకు పట్టించుకోలేదు" అని నిలదీశారు.

## వ్యంగ్యాస్త్రాలతో బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ

మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల ప్రవర్తన, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్యంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై చర్చకు పట్టుబట్టినందుకు గాను, సెప్టెంబర్ 9న కేటీఆర్ తో సహా 22 మంది ఎమ్మెల్యేలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్‌కు నిరసనగానే బీఆర్ఎస్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. కేటీఆర్‌తో పాటు ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్న ఈ వేదికపై, ప్రభుత్వం చర్చకు అనుమతించని ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు.

## ఇప్పటివరకు 22ఏ నుంచి ఎన్ని భూములు తొలగించారు?

హైదరాబాద్(జనంసాక్షి):పొంగులేటి శ్రీనివాస్ ప్రజలకు క్షమాపణ చెప్తారని ఆశించామని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు అన్నారు. అసెంబ్లీలో పొంగులేటి చెప్పినవన్నీ అబద్ధాలు, అర్ధసత్యాలని ఆయన ఆరోపించారు. ప్రజలు తమ ఆస్తులు అమ్ముకునే అవకాశం లేకుండా చేశారని, ఇప్పటివరకు 22ఏ నుంచి ఎన్ని భూములు తొలగించారో చెప్పలేదని విమర్శించారు.

## ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతం

**రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడుతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి భేటీ**

న్యూఢిల్లీ(జనంసాక్షి):

ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాజెక్టు పురోగతిపై ఈరో ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఆయన చర్చించారు. ఈ భేటీలో ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సంపూర్ణ సమ్మతి తెలిపినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్ట్ పురోగతిని వేగవంతం చేసేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వాల నుంచి వచ్చే వారంలోగా ఒక్కో నోడల్ అధికారిని నియమించాలని నిర్ణయించినట్టు తెలిపారు. డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించామని చెప్పారు. గత ఏప్రిల్ 17న అధికారుల బృందం క్షేత్రస్థాయి స్థలాన్ని పరిశీలించి 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణానికి ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఏఎఫ్) వద్ద ఉన్న 369.45 ఎకరాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించనుందని తెలిపారు. ఇక్కడ ఎయిర్‌ఫోర్స్ శిక్షణా కేంద్రాలు, హ్యాంగర్లతో పాటు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పౌర విమానాల సివిల్ టెర్మినల్, మెయింటెనెన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

## వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

హైదారాబాద్(జనంసాక్షి):వినాయక చవితి ఉత్సవాలను ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ సంఘటనకూ తావులేకుండా, వైభవంగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. పండుగ వేళ భక్తులకు, మండప నిర్వాహకులకు ఎదురయ్యే క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగారు. ఉత్సవ కమిటీలు, ప్రజాప్రతినిధులు, పోలీసు, మున్సిపల్ ఉన్నతాధికారులతో సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయిన ఆయన... పండుగ నిర్వహణపై సమగ్ర సమీక్ష జరిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన తెలంగాణలోనే గణేశ్ మండ పాలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నిర్వాహకులు అధికారులకు ముందస్తుగా దరఖాస్తు చేసుకుని ఈ ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందొచ్చని సూచించారు. "స్థానిక పోలీస్ స్టేషన్లలో మండపాల సమాచారం ఇవ్వండి. దానివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవడమే కాకుండా, మన భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేయడానికి వీలవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తూ... "మనం అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మ ఉత్సవాలకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నామో, గణేశ్ నిమజ్జనాలకు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్ద క్రేన్లు పెట్టేందుకు వీలుగా చెరువు గట్లు, పరిసరాలను సిద్ధం చేయాలి" అని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి 24 గంటలూ పర్యవేక్షణ ఉండాలని, మున్సిపల్, పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. "హైదరాబాద్ ప్రశాంతంగా, సురక్షితంగా ఉంటేనే మన రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తాయి, పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి" అని అన్నారు

## హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం: శ్రీధర్‌బాబు

**హైదరాబాద్‌హైదరాబాద్(జనంసాక్షి):** నగరాన్ని బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లును తెలంగాణ శాసనసభలో మంత్రి శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో రవాణా కోసం కాంప్రిహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ చేశామని తెలిపారు. హైదరాబాద్ విస్తరణ పెద్దఎత్తున జరుగుతోందని, రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా మరింత సమర్థంగా పాలన కోసం క్యూర్ చట్టం రూపొందించామని చెప్పారు. "మూసీ పునరుజ్జీవం తొలిదశకు రూ.7,345.12 కోట్లతో అనుమతులు ఇచ్చాం. 20 టీఎంసీల గోదావరి జలాలు తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాం. జీహెచ్ఎంసీని ట్రై కార్పొరేషన్లుగా విభజించుకున్నాం. అన్ని సంస్థలు సమన్వయంతో పనిచేసేలా చట్టబద్ధ వ్యవస్థను రూపొందించాం. సీఎం అధ్యక్షతన క్యూర్ అత్యున్నత పాలకమండలిని ఏర్పాటుచేస్తున్నాం. మహానగరపాలిక చట్టంలో సెక్షన్లు తగ్గించే ప్రణాళిక. మురుగునీటిని శుద్ధి చేసి చెట్ల పెంపకం, కాలుష్య నివారణకు వాడాలని ప్రభుత్వ యోచన. తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ రూపొందించుకుని ముందుకెళ్తున్నాం. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రపంచ నగరాలతో పోటీపడే స్థాయికి హైదరాబాద్ ఎదగాలి. పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షించే స్థాయికి మనం చేరుకోవాలి. హైదరాబాద్ గత వైభవాన్ని కాపాడుకుంటూ భవిష్యత్ అవసరాలకు సిద్ధం చేయాలి" అని మంత్రి తెలిపారు.

## దసరాకు కొత్త పింఛన్ల పంపిణీ

వచ్చే నెల తొలివారంలో అర్హులను ఎంపిక చేసి జాబితా సిద్ధం చేయనున్నారు. అర్హులైన వారికి దసరా నుంచి పింఛన్ సొమ్ము పంపిణీకి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే ఇందుకు అవసరమైన బడ్జెట్ కూడా కేటాయించారు. దీంతో అర్హులను ఎంపిక చేయడమే తరువాయి. ఈ నెలలోనే పరిశీలన పూర్తి చేసి పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వం భావించింది. అయితే క్షేత్రస్థాయి పరిశీలనలో జాప్యం, సర్టిఫికేట్ల జారీలో సమస్యలు తలెత్తడంతో ఆలస్యమైంది. ఆగస్ట్ 9 నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుండగా.. సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు పొడిగించింది. అయితే దివ్యాంగులు, డయాలసిస్, ఫైలేరియా, చేనేత, గీత కార్మికులు, వితంతువులు, ఒంటరి మహిళల అర్హతలను నిర్ధారించేందుకు పత్రాలు అవసరం. ఒంటరి మహిళలకు సంబంధించి విడాకుల డాక్యుమెంట్స్, కోర్టు ఉత్తర్వులతో పాటు ఏడాదిగా ఒంటరిగా ఉంటున్నట్లు ధ్రువీకరణ అవసరమవుతుంది. అలాగే వితంతువులు భర్త డెత్ సర్టిఫికేట్ సమర్పించాలి. అయితే భర్త చనిపోయి ఎక్కవకాలం అయితే సర్టిఫికేట్ పొందటంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.ఇక గీత, చేనేత, ఫైలిరియా, డయాలసిస్ వర్గాలకు సంబంధించి సంబంధిత శాఖల నుంచి ధృవీకరణ పత్రాలు పొందటంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో ధ్రువీకరణ పత్రాల అవసరం లేకుండానే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. అయితే ఆ తర్వాత ధృవీకరణ సమయంలో పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అప్పుడే పింఛన్లకు అర్హత సాధిస్తారు. అధికారులో క్షేత్రస్థాయిలో పర్యటించి కుటుంబ పరిస్థితి, ఆదాయం, ఇతర ఆధారాలను పరిశీలించనున్నారు. అనంతరం తుది జాబితా సిద్ధం చేయనున్నారు. ప్రస్తుతం 2.50 లక్షల పింఛన్లకు మాత్రమే ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో అంతమంది అర్హులను మాత్రమే ప్రస్తుతం ఎంపిక చేయనున్నారు. ప్రాధాన్యత వారీగా పూర్తి అర్హతలు ఉన్నవారిని ఎంపిక చేయనున్నారు.

# 'బ్రిక్స్' ఎవరికీ వ్యతిరేకం కాదు



తీసుకుందాం. ప్రస్తుతం ప్రపంచ పాలనా నిర్మాణం ఓ పిరమిడ్‌లా కనిపిస్తోంది. అధికారం, నిర్ణయాలు తీసుకోవడం అనేది శిఖర భాగంలో కేంద్రీకృతమై ఉండగా.. దిగువన ఉన్న దేశాలు ఆ నిర్ణయాల వల్ల ప్రభావితం అవుతున్నాయి. ఆ నిర్ణయాలను రూపొందించడంలో వీటి పాత్ర పెద్దగా ఉండటం లేదు. ప్రపంచ సంక్షోభాలలో ముందువరుసలో ఉన్న గ్లోబల్ సౌత్.. నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో మాత్రం వెనకబడి ఉంది. ఇకపై ప్రతి సభ్య దేశం భాగస్వామిగా మారి.. గళం వినిపించాలి. ఇందుకోసం చేసే ప్రతి ప్రయత్నం మానవాభివృద్ధి కోసమే ఉండాలి. వచ్చే సదస్సు నాటికి కొత్త సంస్కరణలతో సిద్ధం కావాలి. మరోవైపు ఐరాస భద్రతామండలిలో సంస్కరణలు చేపట్టాలి. ఆలస్యం చేయకూడదు. కాలానికి అనుగుణంగా మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. పలు దేశాలకు శాశ్వత సభ్యత్వం కల్పించాలి" అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

**భారత్, చైనా కలిసి నడవాలి:జిన్‌పింగ్**

దిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు భారత్‌కు వచ్చిన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ద్వైపాక్షిక అంశాలపై ఇరువురు చర్చలు జరిపారు. అనంతరం ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు.అతిపెద్ద దేశాలుగా ఉన్న భారత్, చైనా కలిసి నడవాలని, ఆధునిక టెక్నాలజీ సాయంతో వేగంగా పురోగతి సాధించాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పేర్కొన్నారు. ఒకరి సామర్థ్యాల నుంచి మరొకరు నేర్చుకుంటూ, పరస్పర సహకారంతో ముందుకు సాగవచ్చని అన్నారు. భారత్‌తో దీర్ఘకాలిక, వ్యూహాత్మక ఒప్పందాలు చేసుకుంటామన్నారు. సదస్సుకు సంబంధించి తన పుట్టిన రోజునే భారత్ నుంచి ఆహ్వానం అందిందని జిన్‌పింగ్ గుర్తు చేశారు. ప్రధాని మోదీని ఇప్పటివరకు 21 సార్లు కలిశానని.. ఇరు దేశాల మధ్య సంబంధాలను స్థిరమైన అభివృద్ధి పథంలోకి నడిపించామని అన్నారు.భారత్ అధ్యక్షతన జరుగుతోన్న బ్రిక్స్ సదస్సుకు చైనా అందించిన మద్దతు, సహకారానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు. ద్వైపాక్షిక సహకారంపై చర్చించేందుకు అవకాశం లభించిందన్న ఆయన.. వివిధ అంశాలపై చైనాతో చర్చించినట్లు పేర్కొన్నారు.

**పశ్చిమాసియా యుద్ధంతో తీవ్ర నష్టం**

పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం ఆ ప్రాంత ప్రజలకు తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. ఈ యుద్ధం అంతర్జాతీయ సమాజ ఉమ్మడి ప్రయోజనాలను దెబ్బతీస్తోందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న ఘర్షణలు, అంతర్జాతీయ పాలన, అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొంటున్న సమస్యలపై బ్రిక్స్ నేతలు చర్చిస్తున్న సమయంలో జిన్‌పింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా దేశాల సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించే చర్యలను బ్రిక్స్ సభ్య దేశాలు వ్యతిరేకించాలని జిన్‌పింగ్ సూచించారు. ప్రస్తుతం అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రపంచ శాంతి, సుస్థిరత కోసం ముందుండి పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా పశ్చిమాసియా, గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న సంక్షోభానికి ముగింపు పలికేందుకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పరస్పర సహకారం, స్వేచ్ఛాయుత వాణిజ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. అలాగే కృత్రిమ మేధస్సు రంగంలో సహకారాన్ని బలోపేతం చేయాలని బ్రిక్స్ దేశాలకు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. ఈ నూతన సాంకేతిక రంగంలో సభ్య దేశాల మధ్య మరింత సమన్వయం అవసరమని నొక్కి చెప్పారు.

**ఐరోపా దేశాలను మేం బెదిరించట్లేదు: పుతిన్**

బ్రిక్స్ సదస్సు 2026 సందర్భంగా రష్యా అధ్యక్షుడు పుతిన్ శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. రష్యా ఎప్పుడూ ఐరోపా ను బెదిరించలేదని.. భవిష్యత్తులోనూ బెదిరించబోదన్నారు. కానీ తమ దేశ ప్రయోజనాలకు, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటో విస్తరణ, ఐరోపా దేశాల జోక్యం వల్లే ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగుతోందంటూ వ్యాఖ్యానించారు. 'ఐరోపా దేశాలను బెదిరించాలని మేం ఎందుకు అనుకుంటాం? రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అన్ని సమస్యలు పరిష్కారమయ్యాయి. ఆ తర్వాత జరిగిందంతా రష్యన్ ఫెడరేషన్ సమ్మతితోనే జరిగింది. కానీ ఐరోపా దేశాల నేతలు ఇప్పుడు ఉక్రెయిన్‌లోకి మరింత మంది సైన్యాన్ని పంపడానికి చర్చలు జరుపుతున్నారు. అంటే వారు మాతో యుద్ధాన్ని కోరుకుంటున్నారు. వారి వల్లే యుద్ధం కొసాగుతోంది. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల్లో.. ప్రపంచ దేశాల ఇంధన, ఆహార భద్రతకు సహకరించడానికి రష్యా సిద్ధంగా ఉంది.అంతేకాకుండా పర్యాటకం, పరిశ్రమలు, వాణిజ్యం వంటి రంగాల్లో ఆసక్తికర కార్యక్రమాలకు రష్యా తలుపులు తెరిచే ఉంటాయి. బ్రిక్స్ దేశాలన్నింటికీ చైతన్యవంతమైన, శక్తిమంతమైన దేశీయ మార్కెట్లు ఉన్నాయి. బ్రిక్స్ కూటమి ఎవరికీ వ్యతిరేకం కాదు. అదే విధంగా యావత్ ప్రపంచంతో కలిసి పనిచేయడానికి మాస్కో సిద్ధంగా ఉంది. భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం' అని పుతిన్ పేర్కొన్నారు.

## డాలర్ వద్దు.. స్థానిక కరెన్సీలోనే వాణిజ్యం

న్యూఢిల్లీ(జనంసాక్షి):బ్రిక్స్ డిక్లరేషన్ కోసం సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. దేశం పేరును ప్రస్తావించకుండా.. ఏ దేశమైనా చేసే ఏకపక్ష యుద్ధాన్ని ఖండించే ఉమ్మడి ప్రకటనను వెలువరించడానికి బ్రిక్స్ దేశాల కూటమి అంగీకరించింది. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. కాగా పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఇరాన్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మధ్య నెలకొన్న విభేదాలను తొలగించడానికి సభ్య దేశాల ప్రతినిధులు కృషి చేసేలా చర్చలు జరుగుతున్నాయి. అనంతరం బ్రిక్స్ దేశాల అధినేతలు ఏకాభిప్రాయ ప్రకటనను ఆమోదించే అవకాశం ఉంది. బ్రిక్స్ అధినేతలు దేశాల మధ్య ఆర్థిక సహకారం, ఇంధనం, ఆహార భద్రత, సాంకేతికత, ప్రపంచ సంస్థల్లో సంస్కరణలు వంటి విషయాలపై చర్చలు జరిగే అవకాశం ఉంది. అమెరికా డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించి, వాణిజ్యం సహా ఇతర చెల్లింపులలో తమ సొంత కరెన్సీల వాడకాన్ని పెంచడాన్ని ప్రోత్సహించడంపైనా సభ్యదేశాలు దృష్టిపెట్టనున్నాయి. ప్రపంచ దేశాలపై అమెరికా ఆధిపత్యాన్ని తగ్గించడానికి.. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడానికి బ్రిక్స్ కీలకమైన సాధనమని చైనా, రష్యా భావిస్తున్నాయి.

**ఏకపక్ష యుద్ధాల్ని ఖండిస్తున్నాం**

బ్రిక్స్ దేశాలు ఉమ్మడి తీర్మానంపై ఏకాభిప్రాయానికి వచ్చాయి. శుక్రవారం రాత్రి నుంచి వేకువఝామున 4.00 గంటల వరకు జరిగిన చర్చల అనంతరం తీర్మానంపై ఏకాభిప్రాయం కుదిరినట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఏకపక్షంగా జరుగుతున్న యుద్ధాల్ని ఖండించాలని బ్రిక్స్ దేశాలు నిర్ణయించాయి. అయితే, ఈ తీర్మానంలో ప్రత్యేకంగా ఏ దేశాన్నీ ప్రస్తావించలేదు. ఈ తీర్మానంపై ప్రకటన ఈ రోజు సాయంత్రం వెలువడే అవకాశం ఉంది.నిజానికి ఇది క్లిష్టమైన నిర్ణయం. ఎందుకంటే ప్రస్తుతం బ్రిక్స్ కూటమిలో ఉండి, సదస్సులో పాల్గొంటున్న ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియాలు పరస్పరం దాడులు చేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఇలాంటి యుద్ధ వాతావరణంలో ఆయా దేశాల మధ్య ఒక తీర్మానంపై ఏకాభిప్రాయం కుదర్చడం సాధ్యం కాదు. కానీ, భారత దౌత్యనీతి, దేశం అనుసరిస్తున్న ప్రమాణాల ద్వారా ఏకాభిప్రాయం కుదిరింది. ఆయా దేశాల మధ్య ఉన్న బేధాభిప్రాయాలను పక్కనబెట్టి.. ఒప్పందం కుదిరేలా ఇండియా వ్యవహరించింది. ఈ తీర్మానంపై చివరగా సభ్య దేశాధినేతలు ఆమోదం తెలపాల్సి ఉంటుంది.అనంతరం దీనిపై ఉమ్మడిగా ప్రకటన చేస్తారు. ఈ సందర్భంగా దేశాధినేతలు కూడా పాల్గొంటారు.

# మాల్యాను వదిలేదిలేదు

## బకాయిలు చెల్లించినా కేసులు కొనసాగుతాయ్: ఈడీ

హైదరాబాద్(జనంసాక్షి):

దేశం నుంచి పరారై విదేశాల్లో తలదాచుకుంటున్న విజయ్‌మాల్యా బకాయిలు చెల్లించినా కూడా, ఆయనపై కేసులు కొనసాగుతాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తెలిపింది. మనదేశంలో న్యాయ ప్రక్రియను ఇప్పటికీ తప్పించుకుంటున్నందున.. బ్యాంకులు ఆయన ఆస్తుల నుంచి రుణాలు తిరిగి రాబట్టినంత మాత్రాన, ఆయనపై ఉన్న మనీలాండరింగ్ ఆరోపణలు రద్దు కావని బాంబే హైకోర్టుకు ఈడీ స్పష్టం చేసింది. 2020లో మాల్యా దాఖలు చేసిన పిటిషన్‌కు ప్రతిస్పందనగా ఈడీ ఈనెల 8న ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేసింది. బ్యాంకులతో తన వివాదం పరిష్కారమై, రుణాలు తిరిగి చెల్లించినందున, తనపై నమోదైన క్రిమినల్ కేసులను మూసివేయాలని మాల్యా కోరారు. రూ.14,131.6 కోట్ల విలువైన చర, స్థిర ఆస్తులను ఎస్‌బీఐ నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్షియంకు అప్పగించినా, మాల్యాపై ఉన్న మనీలాండరింగ్ ఆరోపణలు రద్దు కావని, కేసులు నిలిచిపోవని ఈడీ తెలిపింది. మాల్యా 2016 మార్చిలో భారత్‌ను విడిచిపెట్టి వెళ్లారని, దర్యాప్తు సంస్థ పలుమార్లు సమన్లు జారీ చేసినా, దర్యాప్తు అధికారుల ఎదుట హాజరు కాలేదని ఈడీ తన అఫిడవిట్‌లో పేర్కొంది. ఆయనపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్లు తెలిపింది. 2016 నవంబరులో మాల్యాను 'పరారీలో ఉన్న నేరస్థుడు'గా ప్రకటించడాన్ని గుర్తు చేసింది. మాల్యా భారత్‌కు తిరిగి వచ్చి ఇక్కడి కోర్టు పరిధిలో విచారణను ఎదుర్కొంటారా అని హైకోర్టు ప్రశ్నించినా, బదులు రాలేదని.. ఇప్పటికీ ఆయన ఆచూకీ తెలియడం లేదని ఈడీ తెలిపింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఆస్తులను స్వాధీనం చేసుకోవడం అనేది చట్టబద్ధమైన హక్కుదారులు తమకు జరిగిన నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు ఉద్దేశించిన చట్టపరమైన విధానమని ఈడీ తెలిపింది. మూతపడిన విమానయాన సంస్థ కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌కు బ్యాంకులు మంజూరు చేసిన సుమారు రూ.9,000 కోట్ల రుణాల్లో కనీసం రూ.3,500 కోట్లను మనీలాండరింగ్ చేసి, దుర్వినియోగం చేశారనే ఆరోపణలు మాల్యాపై ఉన్నాయి.

## స్త్రీనిధి రుణాల్లో రూ.30 లక్షల అవకతవకలు



- సంగారెడ్డి జిల్లాలో వెలుగులోకి ఘరానా మోసం
- అవకతవకలపై సంఘ సభ్యుల ఆగ్రహం

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** సంగారెడ్డి జిల్లా కంది మండలం పాతకంది గ్రామ సంఘంలో మహిళా సంఘాలకు మంజూరైన స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ రుణాల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు తేలింది. వివిధ మహిళా సంఘాల పేర్లపై మంజూరైన రుణాల్లో సుమారు రూ.30 లక్షల మేర నిధులను మాజీ వీవోఏ వినియోగించినట్లు విచారణ నివేదికలో వెల్లడైనట్లు సమాచారం. రుణాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న మహిళలకు ఈ వ్యవహారం తీవ్ర ఆగ్రహాన్ని కలిగించింది. దీంతో సదురు మహిళా సభ్యులు మంగళవారం కందిలో నిర్వహించిన డ్వాక్రా మహిళా సంఘాల సమావేశంలో అధికారులను నిలదీశారు. వీవోఏ మార్పు.. వెబ్‌సైట్‌లో నమోదు కాలేదంటూ నివేదిక గత ఏడాది జనవరిలో గ్రామ సంఘం వీవోఏను తొలగించి కుమ్మరి పుష్పలతను కొత్త వీవోఏగా ఎన్నుకున్నట్లు విచారణ నివేదికలో పేర్కొన్నారు. అయితే ఇప్పటి వరకు ఆమె పేరు సెర్ప్ ఐబీ వెబ్‌సైట్‌లో నమోదు కాలేదని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. అయినప్పటికీ రూ.50 వేల గౌరవ వేతనం డ్రా చేసి ఆమెకు చెల్లించినట్లు నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. గ్రామ సంఘ సమావేశాలకు మండల సమాఖ్య నుంచి కమ్యూనిటీ కోఆర్డినేటర్ క్రమం తప్పకుండా హాజరు కాకపోవడం, ఏపీఎం స్థాయిలో సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ అవకతవకలకు అవకాశం ఏర్పడినట్లు విచారణ నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. విచారణలో సుమారు రూ.30 లక్షల మేర అవకతవకలు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు గుర్తించినప్పటికీ.. ఇప్పటి వరకు మాజీ వీవోఏపై కఠిన చర్యలు తీసుకోలేదని మహిళా సంఘాల సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సంబంధిత మహిళా సంఘాలకు కొత్త రుణాల మంజూరు కూడా నిలిచిపోయింది. తమకు రావాల్సిన రుణాలను వెంటనే మంజూరు చేయడంతో పాటు, నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. తమ ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ రుణాలపై ఆధారపడుతున్న తమకు ఈ పరిణామం తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని వారు పేర్కొంటున్నారు. బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

## గణేష్ పాటకు కవితక్క ప్రశంసలు



- 'గల్లీ దోస్తులు గణేష్ పండుగ' పాటకు విశేష స్పందన

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** గణేష్ పండుగ సందడిని, యువత ఉత్సాహాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన 'గల్లీ దోస్తులు గణేష్ పండుగ' పాటకు విశేష స్పందన లభిస్తోంది. పాట పూర్తి విడుదల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాటను వీక్షించి చిత్రబృందాన్ని అభినందించారు. పాటలోని మాస్ ఉత్సాహం, సంగీతం, సాహిత్యం, చిత్రీకరణ ఆకట్టుకున్నాయని ప్రశంసించారు. "పాట చాలా బాగుంది.. బృందంలోని అందరూ చాలా చక్కగా చేశారు" అంటూ కితాబిచ్చారు. మరిన్ని మంచి పాటలను రూపొందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చిత్రబృందానికి కవితక్క ప్రశంసలు మరింత ఉత్సాహాన్ని అందించాయి. కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర యువజన అధ్యక్షుడు కంచర్ల శివారెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల సహాయ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మల్లూరి అనిల్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కాయితీ జానకిరెడ్డి, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఉడుత గంగాధర్ గుప్త, చిత్ర దర్శకుడు సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

## కన్నతల్లి మరణవార్త తట్టుకోలేక కొడుకు ఆత్మహత్య

- మెదక్ జిల్లా పెద్దశంకరంపేట విషాద ఘటన

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** అమ్మంటే ప్రేమ.. అమ్మంటే ప్రాణం.. కానీ ఆ కన్నతల్లే లేదనే నిజాన్ని ఆ 19 ఏళ్ల కుమారుడు తట్టుకోలేకపోయాడు. తల్లి లేని లోకంలో తాను ఉండలేనంటూ.. అమ్మ వెళ్లిన దారినే తాను ఎంచుకున్నాడు! మెదక్ జిల్లాలో ఒకే కుటుంబంలో గంటల వ్యవధిలో జరిగిన ఈ జంట ఆత్మహత్యలు స్థానికులను కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండల పరిధిలోని మక్తా లక్ష్మపూర్ గ్రామానికి చెందిన బేతమ్మ (45), ఆమె భర్త బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. అక్కడే నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా, ఇటీవల హైదరాబాద్‌లోని వారి నివాసంలో భార్యాభర్తల మధ్య స్వల్ప గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన బేతమ్మ, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. హైదరాబాద్‌లో తల్లి బేతమ్మ ఆత్మహత్య చేసుకున్న విషయం సొంత ఊరిలో ఉన్న ఆమె కుమారుడు ప్రవీణ్ (19)కు తెలిసింది. ప్రాణంగా ప్రేమించే కన్నతల్లి ఇకలేదనే విషయాన్ని ఆ యువకుడు తట్టుకోలేక పోయాడు. తీవ్రమైన మానసిక వేదనకు లోనైన ప్రవీణ్, క్షణికావేశంలో తీవ్ర నిర్ణయం తీసుకున్నాడు. వెంటనే కొలపల్లి గ్రామ శివారులోకి వెళ్లి, అక్కడ ఉన్న ఒక చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఒకే కుటుంబంలో తల్లి, కొడుకు ఇద్దరూ గంటల వ్యవధిలోనే ఆత్మహత్యలకు పాల్పడటంతో మక్తా లక్ష్మపూర్ మరియు కొలపల్లి గ్రామాల్లో తీవ్ర శోకసంద్రం అలుముకుంది. మరణంలోనూ వీడని ఆ తల్లీకొడుకుల బంధం గురించి తలచుకుని గ్రామస్థులు కన్నీరుమున్నీ రవుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతున్నారు.

## నా డ్యాన్స్‌తో ఉన్న ఏఐ వీడియో చూసి ఆశ్చర్యపోయా

- మోహన్‌లాల్, విజయ్ కంటే నేనే మంచి డ్యాన్సర్
- కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ సరదా వ్యాఖ్య

**తిరువనంతపురం (జనంసాక్షి) :** కేఎస్ఈబీ ఉద్యోగులతో కలిసి తాను నృత్యం చేస్తున్నట్లుగా ఉన్న ఒక కృత్రిమ మేధ (ఏఐ) వీడియోను చూసి దిగ్భ్రాంతికి గురయ్యానని కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ అన్నారు. అయితే, ఆ టెక్నాలజీ పుణ్యమా అని తాను ప్రముఖ నటులు మోహన్‌లాల్, సీఎం విజయ్ కంటే మెరుగ్గా డ్యాన్స్ చేశానని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. శనివారం కేరళ జ్యుడీషియల్ అకాడమీ, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్ సంయుక్తంగా నిర్వహించిన సెమినార్‌లో సతీశన్ ప్రసంగించారు. సినిమా, సంగీత రంగాల్లో కాపీరైట్ హక్కుల పరిరక్షణ, డిజిటల్ టెక్నాలజీ సవాళ్లు అనే అంశంపై ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తన అనుభవాన్నే ఉదాహరణగా చూపుతూ, "ఆ వీడియో చూసి నేను షాక్ అయ్యాను. అందులో నేను మోహన్‌లాల్, విజయ్ కంటే బాగా డ్యాన్స్ చేస్తున్నట్లు అనిపించింది" అని సాంకేతిక పరిజ్ఞాన వేగానికి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కేరళ తీవ్ర విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కొంటూ, ప్రభుత్వంపై విమర్శలు వస్తున్న సమయంలో ఈ ఏఐ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇటీవల విడుదలైన 'జైలర్ 2' చిత్రంలోని 'అల బొలెలో' పాటకు సతీశన్, కేఎస్ఈబీ ఉద్యోగులు డ్యాన్స్ చేస్తున్నట్లు ఈ వీడియోను రూపొందించారు. కేవలం వినోదం కోసమే దీనిని రూపొందించామని, ఎవరినీ అవమానించే ఉద్దేశం లేదని క్రియేటర్లు స్పష్టం చేశారు. పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే ఈ వీడియోను కోటి మందికి పైగా వీక్షించడం విశేషం. ఈ వీడియోపై నెటిజన్లు స్పందిస్తూ విద్యుత్ కోతలపై ప్రభుత్వంపై, కేఎస్ఈబీపై విమర్శలు గుప్పిస్తున్నారు. రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభానికి అతీంద్రియ శక్తులేమీ కారణం కాదని, రాత్రిపూట వినియోగం పెరగడమే ప్రధాన కారణమని మంత్రి సన్నీ జోసెఫ్ పేర్కొన్న తరుణంలో సతీశన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# సుద్దాలకు 'తెలంగాణ తెలుగు తేజం' పురస్కారం

- సుద్దాల అశోక్ తేజకు మరో ప్రతిష్ఠాత్మక గౌరవం
- ఈనెల 22న కరీంనగర్‌లో పురస్కారం ప్రదానం



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** తెలుగు సాహిత్య రంగంలో ప్రముఖ కవి, జాతీయ స్థాయి సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజకు మరో ప్రతిష్ఠాత్మక గౌరవం దక్కింది. బుర్ర నర్సమ్మ-లింగారెడ్డి స్మారక తెలంగాణ తెలుగు తేజం సాహిత్య పురస్కారం-2026కు ఆయనను ఎంపిక చేశారు. తెలుగు భాషా సంరక్షణ సంఘం-తెలంగాణ సాహితీ సంస్థ ఏటా ప్రదానం చేస్తున్న ఈ రాష్ట్ర స్థాయి పురస్కారానికి ఈసారి సుద్దాల అశోక్ తేజను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. పురస్కార కమిటీ ఛైర్మన్, అవార్డు వ్యవస్థాపకుడు కెప్టెన్ డా. బుర్ర మధుసూదన్‌రెడ్డి, తెలుగు భాషా సంరక్షణ సంఘం-తెలంగాణ సాహితీ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం సేనాధిపతి శుక్రవారం ఈ విషయాన్ని ప్రకటించారు. తెలుగు భాష, సాహిత్యానికి విశేష సేవలు అందిస్తున్న వారిని గుర్తించి గౌరవించాలనే ఉద్దేశంతో తెలంగాణ తెలుగు తేజం పురస్కారాన్ని ఏటా అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కవిగా, సినీ గేయ రచయితగా సుద్దాల అశోక్ తేజ తెలుగు భాషకు విశిష్టమైన సేవలు అందిస్తున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. ముఖ్యంగా తెలంగాణ భాష, యాస, సంస్కృతి, సామాజిక జీవనాన్ని ప్రతిబింబించే సాహిత్య, సినీ రచనలతో ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభించింది. తెలంగాణ తెలుగు తేజం సాహిత్య పురస్కార ప్రదానోత్సవాన్ని ఈ నెల 22వ తేదీన కరీంనగర్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సుద్దాల అశోక్ తేజకు పురస్కారాన్ని అందజేయనున్నారు. తెలుగు భాషకు తెలంగాణ మట్టిబిడ్డలు అందించిన అమూల్యమైన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందిస్తున్నట్లు పురస్కార కమిటీ ప్రతినిధులు తెలిపారు. భాషా పరిరక్షణ, సాహిత్య అభివృద్ధికి కృషి చేస్తున్న రచయితలు, కవులు, సాహితీవేత్తలను ప్రోత్సహించడంలో భాగంగా ఈ పురస్కారాన్ని కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. సుద్దాల అశోక్ తేజ తెలుగు సాహిత్యంతో పాటు సినీ గేయ రచయితగా కూడా తనదైన ముద్ర వేశారు. సామాజిక అంశాలు, తెలంగాణ జీవన విధానం, ప్రజల భావోద్వేగాలను ప్రతిబింబించే అనేక రచనలకు ఆయన కలం అందించారు. ఆయన సాహిత్య, సినీ ప్రస్థానాన్ని గుర్తిస్తూ తెలంగాణ తెలుగు తేజం పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కరీంనగర్‌లో ఈ నెల 22వ తేదీన జరగనున్న పురస్కార ప్రదానోత్సవంతో సుద్దాల అశోక్ తేజకు ఈ గౌరవం అధికారికంగా అందనుంది. ఈ కార్యక్రమానికి సాహితీవేత్తలు, భాషాభిమానులు, సాంస్కృతిక రంగానికి చెందిన ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉంది.

## బీసీల హక్కులను కాలరాయాలనుకుంటే సహించం

- రెడ్డి జాగృతి పై సమగ్ర విచారణ జరపి సంస్థను రద్దు చేయాలి
- రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా
- రెడ్డి జాగృతిపై టిఆర్పీ ఫిర్యాదు




**కరీంనగర్ (జనంసాక్షి) :** తెలంగాణలో బీసీల హక్కులు, ఆత్మగౌరవం, రాజకీయ-సామాజిక అవకాశాలకు భంగం కలిగించేలా ఏ సంస్థ వ్యవహరించినా తెలంగాణ రాజ్యాధికార పార్టీ చూస్తూ ఊరుకోదని పార్టీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా స్పష్టం చేశారు. రాష్ట్ర పార్టీ కార్యాలయం ఇచ్చిన పిలుపు మేరకు కరీంనగర్ జిల్లాలో ఉన్న టిఆర్పీ నాయకత్వంతో కలిసి 'రెడ్డి జాగృతి' సంస్థ కార్యకలాపాలపై కరీంనగర్ టౌన్ ఏసీపీ గారికి ఫిర్యాదు చేసి, అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల్ పాషా మాట్లాడుతూ, కుల సంఘాల పేరుతో సమాజంలో విభజనలకు దారితీసే విధంగా, బీసీల హక్కులకు మరియు సామాజిక న్యాయానికి విఘాతం కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం సమగ్రంగా పరిశీలించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక వర్గం ప్రయోజనాల కోసం ఇతర బహుజన వర్గాల హక్కులను, అవకాశాలను ప్రశ్నించే పరిస్థితి రావడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు సహా అన్ని అణగారిన వర్గాలు సమాన హక్కులు, సమాన అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం కోసం పోరాడుతున్నాయని తెలిపారు. సామాజిక న్యాయం కోసం జరుగుతున్న ఈ పోరాటాన్ని బలహీనపరిచే ఏ ప్రయత్నాన్నైనా తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రజాస్వామ్య పద్ధతుల్లో తీవ్రంగా ప్రతిఘటిస్తుందని హెచ్చరించారు. అగ్రవర్ణాల ప్రభుత్వంలో బీసీ, ఎస్సి, ఎస్టీ, మైనారిటి వర్గాల ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అన్ని ప్రభుత్వ శాఖలలో అగ్రవర్ణ ఉద్యోగులకే ల్యాండ్ ఆర్డర్ పోస్టింగ్లు ఇస్తూ వారికి పెద్ద పీట వేస్తున్నారని అన్నారు. బీసీ ఉద్యోగులను అనగదొక్కుతున్నారని, ఇదే గనక కొనసాగితే బీసీ ఉద్యోగుల పట్ల కూడా తెలంగాణ రాజ్యాధికార పార్టీ పోరాడుతదని స్పష్టం చేశారు. 'రెడ్డి జాగృతి' సంస్థకు సంబంధించి బీసీల హక్కులకు విఘాతం కలిగించేలా లేదా సమాజంలో విద్వేషాలు, అలజడులకు దారితీసేలా ఏవైనా కార్యకలాపాలు జరుగుతున్నాయా అనే అంశంపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని అఖిల్ పాషా కోరారు. చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు ఉన్నట్లు విచారణలో తేలితే సంబంధిత సంస్థపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, జిల్లా మహిళా అధ్యక్షురాలు రాచురి అరుణ, కార్యదర్శి ఇశ్రత్ శావాలి, రాష్ట్ర యూత్ సహాయ కార్యదర్శి మహబూబ్ అలీ, యూత్ జిల్లా అధ్యక్షుడు రాకేష్, జిల్లా మైనారిటీ ప్రధాన కార్యదర్శి అంకుష్ శావాలి, నాయకులు గుండోజు సాధనందం, కోరేపు గంగ, ధర్మారపు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఢీ-10' డ్యాన్స్ షో విన్నర్ రాజు అరెస్ట్

- లైంగికంగా వేధించాడని ఓ యువతి ఫిర్యాదు



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన 'ఢీ-10' డ్యాన్స్ షో విజేత రాజును హైదరాబాద్ మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా సినిమా అవకాశాలు ఇప్పిస్తానని చెప్పి మోసం చేశాడని ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించింది. వివరాల్లోకి వెళితే.. ఓ యువతి ఈ నెల 9న మియాపూర్ పోలీసులకు రాజుపై ఫిర్యాదు చేసింది. తనను లైంగికంగా వేధించాడని, సినీ రంగంలో అవకాశాల పేరుతో వంచించాడని ఫిర్యాదులో పేర్కొంది. దీని ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆరోపణలకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు లభించడంతో రాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, రాజు అరెస్ట్ విషయాన్ని పోలీసులు ఇన్ని రోజులు గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ వార్త బయటకు రావడంతో చర్చనీయాంశంగా మారింది. యువతి చేసిన ఆరోపణలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు ముగిసిన తర్వాత వెల్లడయ్యే అవకాశం ఉంది.

## శిల్ప ఆర్ట్ క్రియేషన్స్ కృషి అభినందనీయం

- అవార్డుల వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల శ్రీనివాస్ గుప్త





**హైదరాబాద్ (జనంసాక్షి) :** శిల్ప ఆర్ట్ క్రియేషన్స్ కృషి అభినందనీయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో నిర్వహించిన ప్రత్యేక అవార్డుల వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన "అన్నమయ్య స్వరార్చన" కార్యక్రమంలో కళాకారులు అన్నమయ్య కీర్తనలను ఆలపిస్తూ భక్తి, సంగీత సౌరభాన్ని పంచుకున్నారు. తెలుగు సాహిత్యం, సంగీతం, సంస్కృతిని ప్రోత్సహించే ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో అవసరమని ఉప్పల శ్రీనివాస్ గుప్త పేర్కొన్నారు. అనంతరం వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులను అందజేసి ఘనంగా సత్కరించారు. ముఖ్యంగా మహిళలు పారిశ్రామిక రంగంలో సాధిస్తున్న విజయాలను గుర్తిస్తూ శ్రీ కర్తూరి అరుణ కుమారికి వుమెన్ ఎంట్రప్రెన్యూర్ అవార్డ్ అందజేశారు. అలాగే కుటుంబ విలువలను కాపాడుకుంటూ ఆదర్శ దంపతులుగా నిలుస్తున్న పలువురికి బెస్ట్ కపుల్ అవార్డ్స్ ప్రదానం చేశారు. అవార్డులు అందుకున్న వారిని ఉప్పల శ్రీనివాస్ గుప్త అభినందిస్తూ, వారి సేవలు, విజయాలు మరెందరికో స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ.. మహిళలు నేడు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తూ తమ ప్రతిభను చాటుకుంటున్నారని, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ద్వారా మరింత మంది మహిళలు స్వయం ఉపాధి, వ్యాపార రంగాల్లో ముందుకు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. సమాజంలో ప్రతిభను గుర్తించి గౌరవించడం ద్వారా యువతలో స్ఫూర్తి, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా అన్నమయ్య కీర్తనలు, తెలుగు సంగీతం, సాంస్కృతిక సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు శిల్ప ఆర్ట్ క్రియేషన్స్ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. కళాకారులను, ప్రతిభావంతులను ప్రోత్సహిస్తూ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమ నిర్వాహకులు శిల్ప ఆర్ట్ క్రియేషన్స్ కపర్తి ప్రకాష్ ఆధ్వర్యంలో కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో అవార్డు గ్రహీతలు, కళాకారులు, మహిళా పారిశ్రామికవేత్తలు, దంపతులు, కుటుంబ సభ్యులు, సాంస్కృతిక రంగానికి చెందిన ప్రముఖులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారంలో ఉంటే సెక్రెటేరియట్‌కు రారు..

- ప్రతిపక్షంలో ఉంటే అసెంబ్లీకి రారు : మంత్రి సీతక్క



**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీఆర్ఎస్ నాయకులు అధికారంలో ఉంటే సచివాలయానికి రారు.. ప్రతిపక్షంలో ఉంటే అసెంబ్లీకి రారని మంత్రి సీతక్క ఎద్దేవా చేశారు. అసెంబ్లీ లాబీలో శనివారం చిట్‌చాట్ సందర్భంగా సీతక్క బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. ఎర్రవల్లిలో ఎల్పీ మీటింగ్ నిర్వహించి, పార్టీ ఆఫీస్‌లో మాక్ అసెంబ్లీని ఎందుకు నిర్వహించారని ప్రశ్నించారు. ఫాంహౌస్ ముందు దళిత సంఘాలు నిరసన తెలిపితే పసుపు నీళ్లతో శుద్ధి చేశారని, ఇంకా ఆ మైల పోలేదనే ఆధిపత్య దురహంకారంతో ఫాంహౌస్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించలేదా? అని ప్రశ్నించారు. అసెంబ్లీకి రాని కేసీఆర్, మాక్ అసెంబ్లీకి కూడా రాలేదంటే ఆయనకు చట్టసభల పట్ల, సొంత పార్టీ కార్యక్రమం పట్ల ఎంత గౌరవం ఉందో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఫాంహౌస్‌ను సచివాలయంగా, పార్టీ కార్యాలయాన్ని అసెంబ్లీగా భావించే పార్టీ బీఆర్ఎస్ మినహా దేశంలో మరొకటి లేదని ఎద్దేవా చేశారు. ఫాంహౌస్‌లో ఎల్పీ మీటింగ్, పార్టీ ఆఫీస్‌లో అసెంబ్లీ మీటింగ్ అంటే ఉన్న దగ్గరకే అన్ని రావాలనుకోవడం దొరల అహంకారాని నిదర్శనమన్నారు. చింత చచ్చినా పులుపు చావలేదన్నట్లు.. అధికారం పోయినా అహంకారం ఇంకా పోలేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. స్పీకర్‌ను, చట్టసభలను అవమానిస్తున్న బీఆర్ఎస్‌ను ప్రజలు శిక్షించడం ఖాయమని జోస్యం చెప్పారు.

## పాలిటెక్నిక్ వ్యవస్థను నాశనం చేస్తున్నారు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని, జీవో 97తో పాలిటెక్నిక్ వ్యవస్థను నాశనం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిల విడుదలపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను ఎమ్మెల్సీగా ఉన్నప్పుడే ఫీజు రియంబర్స్‌మెంట్, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, విద్యావ్యవస్థ దుస్థితిపై గళమెత్తానని గుర్తుచేశారు. విద్యార్థుల ఖాతాల్లోకే నేరుగా నగదు జమ చేసే డీబీటీ విధానానికి బీజేపీ ఏనాడూ వ్యతిరేకం కాదని, మేనేజ్‌మెంట్లతో తమకు సంబంధం లేదని, విద్యార్థుల ఖాతాల్లో ఆ సొమ్మును ఎప్పుడు జమ చేస్తారో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో అక్రమాలు జరిగినా, కాంగ్రెస్ హయాంలో జరిగినా సమగ్ర విచారణ జరపాలని, కానీ విజిలెన్స్ దాడుల పేరుతో కాలేజీలను వేధించడం సరికాదని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని, ఒకరి తప్పులను మరొకరు కప్పిపుచ్చుకుంటున్నారని ఆరోపించారు. బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక.. ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలన్నింటినీ పూర్తిగా విడుదల చేస్తుందని పేర్కొన్నారు.

సంపాదకీయం

# డాలర్‌పై బ్రిక్స్ పరోక్ష యుద్ధం

## పెద్దన్నతో ప్రత్యక్ష యుద్ధం తట్టుకోగలరా?

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో డాలర్ పాత్ర గత ఎనిమిది దశాబ్దాలుగా అప్రతిహతంగా కొనసాగుతోంది. అంతర్జాతీయ వాణిజ్యంలో సింహభాగం, విదేశీ మారక నిల్వల్లో అత్యధిక వాటా, చమురు వ్యాపారం వంటివన్నీ డాలర్ చుట్టే తిరుగుతున్నాయి. ఈ ఆధిపత్యాన్ని సవాలు చేసేందుకు బ్రిక్స్ దేశాలు స్థానిక కరెన్సీల్లో వాణిజ్య చెల్లింపులకు మొగ్గు చూపుతున్నాయి. దీన్ని నేరుగా డాలర్‌పై యుద్ధం అని పిలవలేకపోయినా, ఇది ఖచ్చితంగా ఒక పరోక్ష వ్యూహంగానే కనిపిస్తోంది. కానీ ఈ వ్యూహం ఎంతవరకు ఆచరణ సాధ్యం, అమెరికాతో ప్రత్యక్ష ఘర్షణకు దారితీస్తే బ్రిక్స్ కూటమి దాన్ని తట్టుకోగలదా అన్నది కీలకమైన ప్రశ్న.**

న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ సదస్సులో సభ్య దేశాలు తీసుకున్న వైఖరి చూస్తే, ఇది తొందరపాటు నిర్ణయం కాదని స్పష్టమవుతుంది. కొత్త ఉమ్మడి కరెన్సీ ఆలోచనను భారత్ కొట్టిపారేసి, స్థానిక కరెన్సీల్లో ద్వైపాక్షిక వాణిజ్యానికే మొగ్గు చూపింది. ఇది ఒక వ్యూహాత్మక జాగ్రత్త. ఎందుకంటే డాలర్‌ను పూర్తిగా తిరస్కరించడం ప్రస్తుతానికి ఏ దేశానికీ ఆర్థికంగా సాధ్యం కాదు. భారత్ వంటి దేశాలు తమ విదేశీ మారక అవసరాలు, పెట్టుబడులు, రుణాలు అన్నీ డాలర్ ఆధారిత వ్యవస్థతో ముడిపడి ఉన్నాయి. కాబట్టి ఇది డాలర్‌పై యుద్ధం కంటే, డాలర్‌పై అతిగా ఆధారపడటాన్ని తగ్గించుకునే ఒక జాగ్రత్తగా చూడాలి.

ఈ వ్యూహానికి బలమైన కారణాలు లేకపోలేదు. అమెరికా తన కరెన్సీని ఆంక్షల ఆయుధంగా వాడుతున్న తీరు అనేక దేశాలను అప్రమత్తం చేసింది. రష్యాపై విధించిన ఆంక్షలు, డాలర్ లావాదేవీలను స్తంభింపజేయగల సామర్థ్యం చూశాక, తమ ఆర్థిక భద్రతకు ప్రత్యామ్నాయాలు వెతుక్కోవడం ఏ దేశానికైనా సహజమైన స్పందనే. యూపీఐ వంటి డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలను అనుసంధానించడం, స్థానిక కరెన్సీల్లో వాణిజ్యాన్ని ప్రోత్సహించడం లాంటివి దీర్ఘకాలిక ఆర్థిక స్వావలంబన దిశగా వేసే అడుగులుగా చూడొచ్చు.

అయితే వాస్తవాలను విస్మరించలేం. బ్రిక్స్ కూటమిలో ఐక్యత కంటే విభేదాలే ఎక్కువగా కనిపిస్తాయి. భారత్-చైనా మధ్య సరిహద్దు వివాదాలు, తీవ్రమైన వాణిజ్య అసమతుల్యత, రష్యాతో పాశ్చాత్య దేశాల ఆంక్షల ప్రభావం - వీటన్నింటి మధ్య ఒక ఉమ్మడి ఆర్థిక వ్యూహాన్ని సమర్థంగా అమలు చేయడం అంత తేలికైన పని కాదు. పైగా డాలర్‌కు ప్రత్యామ్నాయంగా నిలబడగల స్థాయి ద్రవ్యత, విశ్వసనీయత, మార్కెట్ లోతు ఏ బ్రిక్స్ కరెన్సీకీ ప్రస్తుతం లేదు. యువాన్‌పై చైనా నియంత్రణ, రూబెల్‌పై ఆంక్షల ప్రభావం, రూపాయి పరిమిత అంతర్జాతీయ వినియోగం - ఇవన్నీ ఈ ప్రయత్నానికి అవరోధాలుగా నిలుస్తున్నాయి.

ఇక అమెరికాతో ప్రత్యక్ష ఘర్షణ అంశానికి వస్తే, పరిస్థితి మరింత సున్నితమైనది. అమెరికా కేవలం ఆర్థిక శక్తి మాత్రమే కాదు, సైనిక, సాంకేతిక, దౌత్యపరమైన ప్రభావం కూడా అపారంగా కలిగిన దేశం. టారిఫ్‌లు, ఆంక్షలు, సాంకేతిక పరిజ్ఞాన నియంత్రణల వంటి ఆయుధాలను అది ఇప్పటికే ఉపయోగిస్తోంది. బ్రిక్స్ దేశాలు ఏకపక్షంగా, పూర్తి బలంతో అమెరికాతో ముఖాముఖి తలపడే స్థితిలో లేవు. భారత్ వంటి దేశాలు అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగిస్తూనే, తమ ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకునే సమతుల్య విధానాన్నే అనుసరిస్తున్నాయి. ఇది "యుద్ధం" అనే పదానికి సరిపోయే చర్య కాదు, మార్కెట్ వైవిధ్యీకరణ ప్రయత్నంగానే చూడాలి.

మొత్తంగా చూస్తే, డి-డాలరైజేషన్ ఒక దీర్ఘకాలిక, క్రమేపీ సాగే ప్రక్రియ. ఇది ఒక్కరోజులో డాలర్ ఆధిపత్యాన్ని కూలదోసే యుద్ధం కాదు, దశాబ్దాల పాటు సాగే నిర్మాణాత్మక మార్పు. బ్రిక్స్ దేశాలు తమ ఆర్థిక సార్వభౌమత్వాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తున్నా, అమెరికాతో ప్రత్యక్ష ఘర్షణకు దిగే సాహసం చేసే పరిస్థితి ప్రస్తుతానికి లేదు. బదులుగా, జాగ్రత్తగా, దశలవారీగా ప్రత్యామ్నాయ మార్గాలను నిర్మించుకుంటూ, అదే సమయంలో అమెరికాతో సంబంధాలను చెడగొట్టుకోకుండా నడుచుకోవడమే వాస్తవిక వ్యూహంగా కనిపిస్తోంది.

## పారా హుషార్

### వంచన

హమారా ప్రసాదును
అడ్డం పెట్టుకొని
ఆటలాడుతున్నారు
ఆర్ఎస్ఎస్ బిజెపి వాళ్లు!
వారి ఏకైక లక్ష్యం
హిందు రాష్ట్ర నిర్మాణం!
దాన్ని సాధించేందుకు
వాళ్ళకడ్డం 'భారత రాజ్యాంగం!'
అందుకనే మొదటి దాడి
అంబేడ్కర్ పై చేస్తున్నారు!
రాజ్యాంగం స్థానంలో!
మనస్మృతిని తెస్తారు!
ఇక మౌనంగా ఉంటే మనకు
భవిత లేదు బతుకు లేదు!
మనుధర్మ బానిసత్వమే
మళ్ళీ మనకు ప్రారంభం!
పారా హుషార్ ప్రజలారా!
పారా హుషార్!!

ముద్దగౌని సుభాష్
dhikkaraswaram@gmail.com

# ప్రజాస్వామ్య ముసుగులో సాగుతున్న ఆధునిక బానిసత్వం!

ఈ దేశంలో పుట్టిన ప్రతి పౌరుడూ గుండె మీద చేయి వేసుకుని అడగాల్సిన అసలు సిసలైన ప్రశ్న ఒకటే నేను జీవిస్తున్నానా లేదా కేవలం బతుకుతున్నానా? పైకి చూడటానికి ఈ రెండూ ఒకేలా అనిపించినా, వీటి మధ్య ఉన్న తేడా అగాధమంత. జీవించడం అంటే కేవలం శ్వాసించడం మాత్రమే కాదు. అదొక సమున్నత భావన, గౌరవంగా, స్వేచ్ఛగా, సామాజిక న్యాయాన్ని ఆస్వాదిస్తూ జీవించడం. కానీ బతకడం అంటే? కుళ్ళిన వ్యవస్థ విసిరేసే ఎంగిలి మెతుకుల కోసం, రాజకీయ పెద్దలు గీసిన లక్ష్మణ రేఖల మధ్య, వారి స్వార్థ సామ్రాజ్యానికి ఊడిగం చేసే ఒక సజీవ సాధనంగా మగ్గిపోవడం. దురదృష్టవశాత్తూ, నేడు ఈ దేశంలో కోట్లాది మంది కేవలం కాలం వెళ్లదీస్తున్నారు, అంటే బతుకుతున్నారు తప్ప స్వేచ్ఛగా జీవించడం లేదు. ఈ చేదు నిజాన్ని అంగీకరించడానికి మనకు ఇంకా ఎన్ని దశాబ్దాలు కావాలి?

మన రాజకీయ వ్యవస్థ ఏ ఆకాశం నుండో ఊడిపడలేదు, అది కచ్చితంగా మన సామాజిక నేల నుంచే మొలిచింది. కానీ ఇక్కడే ఒక విషాదకరమైన ట్విస్ట్ ఉంది. సామాజిక, సాంస్కృతిక పునాదులపైనే ఏ రాజకీయ నిర్మాణమైనా నిలబడుతుంది. కులం, మతం, భాష, ప్రాంతం ఒకప్పుడు సమాజంలో ఐక్యతకు మూలాధారాలుగా ఉండేవి. కానీ నేటి రాజకీయ నాయకులు వీటన్నింటినీ పదునైన ఆయుధాలుగా మార్చేశారు. ప్రజలను ఏకం చేయడానికి కాదు, వారి మధ్య శాశ్వతమైన గోడలు నిర్మించడానికి! సమస్యలను పరిష్కరించడానికి కాకుండా, వాటిని మరింత జటిలం చేసి పబ్బం గడుపుకోవడానికి. ఓట్ల పంట పండించుకోవడానికి, అధికారాన్ని తమ వారసత్వ ఆస్తిగా మార్చుకోవడానికి, ప్రజాధనంతో జేబులు నింపుకోవడానికి ఈ భావోద్వేగాలను వారు ముడిసరుకుగా వాడుకుంటున్నారు. ఎన్నికలు రాగానే కులం పేరుతో ఓట్లు అడుగుతారు కానీ, క్షేత్రస్థాయిలోకి వెళ్తే అన్ని కులాల్లోనూ పేదరికం తాండవిస్తూనే ఉంటుంది. మతం పేరుతో చిచ్చు పెట్టి భావోద్వేగాల గ్రాఫ్ పెంచుతారు కానీ, ఏ మతానికి చెందిన పేద బిడ్డకూ నాణ్యమైన చదువు అందడం లేదు. ప్రాంతాల పేరుతో సెంటిమెంట్లు రగిల్చి అభివృద్ధి వాగ్దానాల వర్షం కురిపిస్తారు కానీ, ఏ ప్రాంతమైనా సమగ్రంగా వికసించిందా అంటే సమాధానం శూన్యం. ఇది కాకతాళీయం కాదు, ప్రజలు అసలు సమస్యను చూడకుండా ప్రశ్నించే గొంతులను నొక్కేసే ఒక వ్యవస్థీకృత మాయాజాలం.చాలా మంది అవినీతిని సమాజానికి పట్టిన ఒక తాత్కాలిక వ్యాధిగా భావిస్తారు. కానీ అది తప్పు, ఈ దేశంలో అదొక తిరుగులేని పరిపాలనా వ్యవస్థగా రూపాంతరం చెందింది. ఒకసారి మన కళ్ళు తెరిచి చూస్తే, ఈ దేశంలో అవినీతి



ఊబిలో కూరుకుపోని రంగం ఏదైనా ఉందా? విద్యారంగంలో స్కూళ్ల నిర్మాణాల కాంట్రాక్టులు, టీచర్ల పోస్టుల భర్తీలో లక్షల లావాదేవీలు, పేద పిల్లల మిడ్-డే మీల్స్ నిధుల దోపిడీ నిత్యకృత్యమయ్యాయి. విద్య అనేది నేడు పవిత్రమైన జ్ఞాన మార్గం కాదు, అదొక కార్పొరేట్ బిజినెస్ డీల్. వైద్యరంగంలో ప్రభుత్వ ఆస్పత్రులకు రావాల్సిన ఉచిత మందులు బ్లాక్‌లో మాయమవుతాయి, నియామకాల్లో అక్రమాలు రాజ్యమేలుతాయి, పర్యవసానంగా పేదవాడు ప్రాణాలు నిలబెట్టుకోవడానికి అప్పులపాలు కావాల్సిందే. వ్యవసాయ రంగంలో విత్తనాల సబ్సిడీలు నిజమైన రైతుకు చేరవు, సాగునీటి ప్రాజెక్టులు అసంపూర్ణ గాథలే, రైతు బీమా సొమ్ము దళారుల జేబుల్లో మురుగుతోంది. న్యాయస్థానాల్లో సామాన్యుడు న్యాయం కోసం కోర్టు మెట్లు ఎక్కితే, తీర్పు వచ్చేసరికి అతని జీవితకాలం సరిపోవడం లేదు. ఇక ప్రజల పక్షాన నిలబడాల్సిన మీడియా సంస్థలు రాజకీయ పార్టీల ఊడిగంలో, కార్పొరేట్ ప్రకటనల ఒత్తిళ్లలో కూరుకుపోయాయి. జర్నలిజం అనే సామాజిక బాధ్యత పత్రికా-ఛానెళ్ల వ్యాపార వ్యూహాల్లో కనుమరుగైపోయింది. ఇవన్నీ అవినీతి రాజకీయ వ్యవస్థ అనే విషవృక్షం నుండి పుట్టుకొచ్చిన కొమ్మలు మాత్రమే. ఈ వ్యవస్థ సామాన్యులను మనుషులుగా చూడటం లేదు, కేవలం వనరులుగా మాత్రమే పరిగణిస్తోంది. ఎన్నికల సమయంలో ఓటు అనే వనరు, పన్నులు వసూలు చేసేటప్పుడు ఆదాయ వనరు, ప్రభుత్వ పథకాలు డబ్బా కొట్టుకునేటప్పుడు ప్రచారార్థ వనరుగా భావిస్తోంది. ఐదేళ్లలో కేవలం ఒకే ఒక్క రోజు మీరు రాజులు, ఆ రోజే ఓటు వేసే రోజు. మిగిలిన 1,824 రోజులూ మీరు కేవలం సేవకులు, యాచకులు. దీనిని ప్రజాస్వామ్యం అందామా? ఇది ఓటు అనే ముసుగులో సాగుతున్న ఆధునిక బానిసత్వం. రాజకీయ నాయకులు కులాల మధ్య కృత్రిమ పోరాటాలు సృష్టించి ఇరువైపులా ఓట్లు కొల్లగొడతారు, మతాల మధ్య చిచ్చుపెట్టి తామే రక్షకులుగా అవతారమెత్తుతారు. నేడు ప్రజలు చదువుకుంటున్నారు, చేతిలో గ్లోబల్ స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి, ప్రపంచాన్ని చూస్తున్నారు; కానీ పాలకుల పొలిటికల్ నెరేటివ్స్ అందించే భావోద్వేగ మత్తులో జోగుతున్నారు. ఇది పాలకుల స్క్రిప్ట్ ప్రకారం సాగుతున్న ప్రణాళికాబద్ధమైన అజ్ఞానం.మరోవైపు 'అభివృద్ధి' అనే పదం అత్యంత దారుణంగా దుర్వినియోగమవుతోంది. నాలుగు లేన్ల రోడ్లు వేస్తే అభివృద్ధే, కానీ ఆ రోడ్లు ఎవరి ఫామ్‌హౌస్‌లకు వెళ్తున్నాయి? విమానాశ్రయాలు కడితే అభివృద్ధే, కానీ అందులో ఎంతమంది సామాన్యులు ప్రయాణించగలరు? గణాంకాలలో జీడీపీ పెరుగుతోంది, కార్పొరేట్ గ్రాఫ్‌లు దూసుకుపోతున్నాయి, కానీ కేవలం పది శాతం మంది చేతుల్లో దేశంలోని తొంభై శాతం సంపద కేంద్రీకృతమైంది. మిగిలిన తొంభై కోట్ల మంది కేవలం పది శాతం వనరుల కోసం కొట్టుకుంటున్నారు. ఇది అభివృద్ధి కాదు, వ్యవస్థాగత ఆశీస్సులతో సాగుతున్న లీగల్ దోపిడీ. బడ్జెట్ నుంచి క్షేత్రస్థాయికి వచ్చేసరికి నిధులు కరిగిపోతాయి, లబ్ధిదారుడి చేతికి చేరేది కేవలం పది శాతమే అని ఆడిట్ నివేదికలు చెబుతున్న సత్యం. కేవలం రాజకీయ పార్టీని మారిస్తే ఈ రోగానికి ముక్తి దొరకదు, ఎందుకంటే ఇక్కడ ముఖాలు మారుతున్నాయి తప్ప వ్యవస్థ మారడం లేదు. అందుకే పరిష్కారం నాయకులను మార్చడంలో లేదు, మనం బతుకుతున్న వ్యవస్థను ప్రక్షాళన చేయడంలో ఉంది.ఈ దుస్థితి మారాలంటే ప్రజల్లో స్పృహ రావాలి. మన సమస్యలకు అసలు కారణం కులం, మతం కాదు, వాటిని ఓట్ల మార్కెట్‌గా మార్చే పొలిటికల్ సిస్టమ్ అని గ్రహించాలి. ప్రజాప్రతినిధి అనేవాడు మన సేవకుడే తప్ప పాలకుడు కాదు, మన పన్నుల సొమ్ము ఎలా ఖర్చు పెట్టారో నిలదీసే తత్వం అలవాటు కావాలి. ఒంటరిగా ప్రశ్నించే గొంతును ఈ వ్యవస్థ నొక్కేస్తుంది, కానీ లక్షలాది గొంతులు ఒకేసారి న్యాయం కోసం గర్జిస్తే ఏ నిరంకుశ వ్యవస్థా తట్టుకోలేదు. ఈ దేశంలో మార్పు అసాధ్యమేమీ కాదు, కానీ ఆ మార్పు ఎక్కడి నుంచో కార్పొరేట్ సూట్లలో రాదు, అది ప్రజల గుండెల నుంచే ఉప్పెనలా రావాలి. మిమ్మల్ని కేవలం ఓట్ల యంత్రాలుగా వాడుకుంటున్న వారి ముసుగులను తొలగించండి, సంకుచిత కళ్లద్దాలను పగలకొట్టండి . వ్యవస్థ మిమ్మల్ని ఎప్పటికీ నిద్రపుచ్చాలనే చూస్తుంది, కానీ మీరు మేల్కొని చరిత్రను తిరగరాయాలని కాలం కోరుకుంటోంది. ఈ చారిత్రక ఎంపిక మీది కేవలం బతుకుతారా, లేదా గౌరవంగా జీవిస్తారా?


డా .సూర్యదేవర రామకృష్ణ
jaikisan999@gmail.com


# తెలంగాణ సాయుధ పోరాటయోధుడు రావి నారాయణరెడ్డి

నిజాం నిరంకుశత్వానికి, దొరల దాష్టీకాలకు మరియు భూస్వాముల ఆగడాలను వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం 1946 నుండి 1951 వరకు కొనసాగిన 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం' ప్రపంచ చరిత్రలోనే ప్రముఖ స్థానాన్ని సముపార్జించుకుని నిత్యనూతన చైతన్య స్రవంతిగా వెలుగొందుతూనే ఉంది. తెలంగాణ సాయుధ పోరాటంలో 'దున్నేవాడిదే భూమి' అనే నినాదం మార్మోగిపోయింది. 'బాంచెన్ దొరా ... నీ కాళ్లు మొక్కుతా' అన్న పీడిత ప్రజానీకం ఆయుధాలు చేబూని దొరల, భూస్వాముల, పెత్తందారుల అరాచకాలను అంతమొందించారు. ఈ తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగు వేల మంది అమరుల త్యాగాలతో వేలాది గ్రామాలు వెట్టి చాకిరి నుండి విముక్తి పొందడమే కాకుండా పది లక్షల ఎకరాల భూములు పేద ప్రజలకు పంపిణీ చేయబడ్డాయి.

ప్రస్తుత యాదాద్రి భువనగిరి జిల్లాలోని బొల్లేపల్లి గ్రామంలోని ఒక సంపన్న భూస్వామ్య కుటుంబంలో గోపాల్ రెడ్డి, వెంకట రామమ్మ దంపతులకు 1908 జూన్ 5 నాడు జన్మించిన రావి నారాయణ రెడ్డి అనునిత్యం అనేక ప్రజా పోరాటాల్లో నడుం బిగించి పేదల అభ్యున్నతి కోసం అహర్నిశలు ఉద్యమించారు. ఆయన భూస్వామ్య కుటుంబంలో జన్మించిననూ తాను విశ్వసించిన ఆదర్శాల కోసం తన స్వంత కుటుంబంతోనే ఘర్షణ పడి వందల ఎకరాల స్వంత భూమిని పేదలకు పంపిణీ చేసి ఎందరికో ఆదర్శంగా నిలిచారు. అలాగే భూస్వాముల నుంచి స్వాధీనం చేసుకున్న లక్షలాది ఎకరాల భూమిని నిరుపేద రైతాంగానికి పంపిణీ చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆ రకంగా తెలంగాణ సాయుధ పోరాటంలో 'దున్నేవాడిదే భూమి' అంటూ నినదించి వందల ఎకరాల స్వంత భూమిని పేద ప్రజలకు పంచిన నిస్వార్థ త్యాగశీలి రావి నారాయణ రెడ్డి.

ఆంధ్ర జన సంఘం 1930 నాటికి 'ఆంధ్ర మహాసభ'గా రూపుదిద్దుకుంది. ఈ ఆంధ్ర మహాసభ తెలంగాణలో రాజకీయ చైతన్యాన్ని ప్రజ్వలింపజేసింది. 1944 లో భువనగిరిలో జరిగిన పదకొండవ ఆంధ్ర మహాసభ మహాసభకు రావి నారాయణ రెడ్డి గారు అధ్యక్షత వహించారు. సాంస్కృతిక మరియు భాషా చైతన్యం కోసం మాత్రమే పనిచేసిన ఆ ఆంధ్ర మహాసభను రావి నారాయణ రెడ్డి తన నాయకత్వంలో రాజకీయ సమరశీల సంస్థగా తీర్చిదిద్దడంలో విశేష కృషి చేశారు. ఆంధ్ర మహాసభ కార్యక్రమాలు నిజాం కొనసాగిస్తున్న దురాగతాలకు వ్యతిరేకంగా ప్రజా చైతన్యాన్ని ప్రజ్వలింపజేసి తెలంగాణ సాయుధ పోరాటానికి





బాటలు పరిచాయి.

ఏడో నిజాం ఉస్మాన్ అలీ ఖాన్ ఏలుబడిలో కొనసాగిస్తున్న దురాగతాలకు వ్యతిరేకంగా రావి నారాయణ రెడ్డి రైతాంగాన్ని సమీకరించి ఉద్యమ ఊపిరి అందించి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని ముందుండి నడిపించారు. కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించిన సమయంలో ఆయన అజ్ఞాతంలోకి వెళ్ళి గెరిల్లా దళాలను స్వయంగా ఏర్పాటు చేశారు. గ్రామాల్లోనూ రక్షణ దళాలను నిర్మించి సాయుధ శిక్షణను అందించడంలోనూ, శత్రువులపై మెరుపు దాడులు చేయడంలోనూ మరియు ఆయుధాలు పోగు చేసుకోవడమే కాకుండా శత్రువుల నుండి ఆయుధాలను చేజిక్కించుకోవడంలోనూ ఆయన అనేక వ్యూహాలను అనుసరించారు.

సాయుధ పోరాట ఉధృతి పెరగడంతో కొన్ని జిల్లాల్లో ఏకంగా నిజాం పాలన నిలిచిపోయింది. ఒక దశలో భూస్వాములు, దేశ్ముఖ్లు తెలంగాణ నుండి పలాయనం చిత్తగించారు. ఈ ఘటనలు సాయుధ పోరాట విజయానికి సంకేతంగా నిలిచాయి. రావి నారాయణ రెడ్డి నేతృత్వంలో వేలాది గ్రామాలలో 'గ్రామ స్వరాజ్యాలు' ఏర్పడ్డాయి. పది లక్షల ఎకరాల భూములు పేదలకు పంపిణీ చేయబడ్డాయి.

భారత ప్రభుత్వం 1948 సెప్టెంబర్ నెలలో చేపట్టిన 'పోలీస్ చర్య' ద్వారా నిజాం లొంగుబాటుతో హైదరాబాద్ రాష్ట్రం భారతదేశంలో విలీనం కాబడింది. ఆ సమయంలో కమ్యూనిస్టు పార్టీలోని ఒక వర్గం భారత సైన్యానికి వ్యతిరేకంగా కూడా సాయుధ పోరాటాన్ని కొనసాగించాలి అని తీర్మానించింది. 'నిజాం లొంగుబాటు తర్వాత ప్రజాస్వామ్య భారతదేశంలో సొంత సైన్యంతో తలపడటం సరైనది కాదు' అని రావి నారాయణ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ తెలంగాణ సాయుధ పోరాటానికి సంబంధించి రావి నారాయణ రెడ్డి తన పోరాట అనుభవాలను 'వీర తెలంగాణ నా అనుభవాలు - జ్ఞాపకాలు' అనే పుస్తకం ద్వారా వెలుగులోకి తీసుకువచ్చారు.

భారతదేశంలో 1952 లో మెట్టమొదటిసారిగా సార్వత్రిక ఎన్నికలు నిర్వహించగా కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉన్న కారణంగా 'పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్' (పి.డి.ఎఫ్) అనే పేరుతో నల్లగొండ పార్లమెంట్ స్థానం నుండి అప్పటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూపై బరిలో నిలిచిన రావి నారాయణ రెడ్డి దేశంలోనే అత్యధిక ఓట్ల మెజారిటీతో విజయం సాధించి సరికొత్త చరిత్రని సృష్టించారు. అలాగే స్వతంత్ర భారత పార్లమెంట్లో అడుగుపెట్టిన తొలి వ్యక్తిగా కూడా రావి నారాయణ రెడ్డి సరికొత్త చరిత్ర సృష్టించారు. పార్టీ ఆశయాల కోసం ఆఖరిక్షణం వరకు అంకితభావంతో పనిచేసి అతి సామాన్య మరియు అతి నిరాడంబర జీవితాన్ని గడిపిన రావి నారాయణ రెడ్డి 1991 సెప్టెంబర్ 7 నాడు మరణించిననూ భారత కమ్యూనిస్టు ఉద్యమంలోనూ మరియు తెలంగాణ సాయుధ పోరాటంలోనూ వేగుచుక్కగా వెలుగొందుతూనే ఉన్నారు. అంతిమంగా ఆయన జీవితం నుండి భావితరాలు ముఖ్యంగా కమ్యూనిస్ట్ సమాజ స్వాప్నికులు నేర్చుకొని ఆచరించాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయి.

( తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా )



జె.జె.సి.పి.బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690

# రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టుల నాయకత్వం

నిన్నటి సంచిక తరువాయి

సెప్టెంబర్ 17 చుట్టూ జరిగే రాజకీయ చర్చలో అసలు ప్రశ్నలుగా వీటిని చేర్చాలి.

నిజాం వెళ్లిపోయిన తర్వాత భూమి ఎవరి చేతుల్లోకి వెళ్లింది? రైతు అప్పుల నుంచి విముక్తి పొందాడా? కూలీకి పూర్తి వేతనం లభించిందా? దళితుడు కుల అవమానాల నుంచి విముక్తి పొందాడా? మహిళకు ఆస్తి, విద్య, ఉపాధి, రాజకీయ నిర్ణయాల్లో సమాన హక్కు వచ్చిందా? ఆదివాసీ తన అడవి, భూమి, జీవనాధారాన్ని కాపాడుకోగలిగాడా? ప్రజలకు సంపూర్ణ ప్రజాస్వామిక హక్కులు లభించాయా? ఈ ప్రశ్నలు నేటికీ మన ముందున్నాయి. నిజాం కాలంలోని భూస్వామ్య దోపిడీ రూపాలు మారిపోయి ఉండవచ్చు. కానీ భూమి, వనరులు, ఉత్పత్తి సాధనాలు కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కావడం అనే సమస్య కొత్త రూపాల్లో కొనసాగుతోంది. అప్పట్లో దొర భూమి కోసం పేద రైతును అణచివేశాడు. నేడు కార్పొరేట్ శక్తులు భూమి, నీరు, అడవులు, ఖనిజాలు, ప్రజా వనరులపై ఆధిపత్యం సాధించేందుకు ప్రయత్నిస్తున్నాయి. అప్పట్లో వెట్టి ఉండేది. నేడు కాంట్రాక్ట్ కార్మిక వ్యవస్థ, అసురక్షిత ఉపాధి, వేతన దోపిడీ వంటి కొత్త రూపాల్లో శ్రమ దోపిడీ కొనసాగుతోంది.

తెలంగాణ రైతాంగ పోరాట చరిత్ర ఒక గత అధ్యాయం మాత్రమే కాదు. అది వర్తమానాన్ని ప్రశ్నించే చరిత్ర. భూమి కోసం పోరాడిన రైతు, వెట్టికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన కూలీ, దొరల పెత్తనాన్ని ఎదిరించిన మహిళ, కుల అవమానాన్ని తిరస్కరించిన దళితుడు, అడవి భూమి కోసం నిలబడిన ఆదివాసీ.. వీరి పోరాటాలన్నీ నేటి సామాజిక న్యాయ పోరాటాలతో అనుసంధానమై ఉన్నాయి. చాకలి ఐలమ్మ భూమి కోసం నిలబడినప్పుడు ఆమె పోరాటం వ్యక్తిగత భూమి కోసం మాత్రమే కాదు. దొరల అధికారం ముందు పేద మహిళ తలవంచాల్సిన అవసరం లేదని ఆమె చూపించింది. దొడ్డి కొమురయ్య రక్తం నేలపై పడినప్పుడు అది ఒక వ్యక్తి మరణం మాత్రమే కాదు. గ్రామీణ తెలంగాణలో భయానికి ముగింపు పలికిన మలుపు. జాటోత్



ఠానూ నాయక్ వంటి యోధుల త్యాగాలు కూడా ఇదే ప్రజా ప్రతిఘటనలో భాగం. షోయబుల్లా ఖాన్ కలం మతతత్వం, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా నిలిచింది. మఖ్దూం మొహియుద్దీన్ కవిత్వం, రాజకీయ చైతన్యం ప్రజల పోరాటంతో ముడిపడ్డాయి. ఈ విభిన్న ధారలను విడదీసి ఒకే మతపు చరిత్రగా మార్చడం తెలంగాణ ప్రజల ఉమ్మడి పోరాట వారసత్వాన్ని అవమానించడమే.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగింది అనే వాస్తవాన్ని కూడా స్పష్టంగా చెప్పాలి. ఇది ఏ వ్యక్తిని కీర్తించడానికి చెప్పే విషయం కాదు. చరిత్రలో నాయకత్వం ఎవరిదో గుర్తించడం చారిత్రక నిజాయితీ. ఆంధ్ర మహాసభ ద్వారా గ్రామీణ ప్రజల్లో చైతన్యం పెరిగింది. కమ్యూనిస్టు కార్యకర్తలు ప్రజల మధ్య పనిచేశారు. భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలను నిర్మించారు. గ్రామాల్లో ప్రజా కమిటీలను ఏర్పాటు చేశారు. భూమి పంపిణీ, వెట్టి నిర్మూలన, సామాజిక సమానత్వం వంటి అంశాలను పోరాట కార్యాచరణలోకి తీసుకువచ్చారు. ఈ చరిత్రను మతతత్వ రాజకీయాలకు అప్పగిస్తే నష్టపోయేది కేవలం గతం కాదు. భవిష్యత్తు కూడా. ఎందుకంటే మతం పేరుతో ప్రజలను విభజించినప్పుడు వర్గ దోపిడీ కనిపించదు. హిందువు - ముస్లిం అనే విభజన ముందుకు వస్తే రైతు - భూస్వామి, కార్మికుడు - పెట్టుబడిదారు, పేద - ధనిక అనే వాస్తవ విభజనలు వెనక్కి వెళ్లిపోతాయి. దోపిడీదారుడు కనిపించకుండా పోయి, పక్కింటి పేద మనిషే శత్రువుగా కనిపించే పరిస్థితి ఏర్పడుతుంది. ఇదే మతతత్వ రాజకీయాల ప్రమాదం.

తెలంగాణ చరిత్రలో హిందూ - ముస్లిం ఐక్యతకు కూడా బలమైన ప్రజా వారసత్వం ఉంది. నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ముస్లిం ప్రజాస్వామికవాదులు, హిందూ రైతులు, దళిత కూలీలు, ఆదివాసీ ప్రజలు, మహిళలు కలిసి పోరాడారు. అందువల్ల సెప్టెంబర్ 17ను ఒక మతం మరో మతంపై సాధించిన విజయంగా కాకుండా నిరంకుశత్వం, భూస్వామ్య దోపిడీ, వెట్టి, సామాజిక అవమానాలకు వ్యతిరేకంగా ప్రజలు సాగించిన దీర్ఘ పోరాటంలో ఒక కీలక మలుపుగా చూడాలి. చరిత్రను మరచిపోవడం ఎంత ప్రమాదకరమో, చరిత్రను వక్రీకరించడం అంతకంటే ప్రమాదకరం. నిజాం నిరంకుశత్వాన్ని, రజాకార్ల హింసను, సైనిక చర్య తర్వాత ముస్లిం ప్రజలపై జరిగిన హింసను దాచడం తప్పు. అదే సమయంలో.. కమ్యూనిస్టుల నాయకత్వంలోని రైతాంగ పోరాటాన్ని, వేలాది మంది ప్రజల త్యాగాలను, భూమి కోసం జరిగిన పోరాటాన్ని చరిత్ర నుంచి తొలగించడం కూడా అంతే తప్పు. సెప్టెంబర్ 17ను ఎవరి రాజకీయ నినాదానికి అప్పగించాలనే ప్రశ్న కాదు ఇది. తెలంగాణ ప్రజల చరిత్రను ఎవరు ఎలా అర్థం చేసుకోవాలనే ప్రశ్న. ఒకవైపు "విలీనం" అనే ఒక్క పదంతో ప్రజల పోరాటాన్ని కుదించే ప్రయత్నం ఉండకూడదు. మరోవైపు "విమోచనం" అనే మతతత్వ పదంతో దాన్ని హిందూ - ముస్లిం ఘర్షణగా మార్చే ప్రయత్నాన్నీ తిరస్కరించాలి.

సెప్టెంబర్ 17 ఒక తేదీ కాదు. ఒక చారిత్రక ప్రక్రియలో కీలక ఘట్టం. నిజాం పాలన ముగింపు అందులో ఉంది. హైదరాబాద్ భారత యూనియన్‌లో చేరడం అందులో ఉంది. అంతకుముందు సాగిన రైతాంగ తిరుగుబాటు అందులో ఉంది. కమ్యూనిస్టుల నాయకత్వం అందులో ఉంది. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి విముక్తి కోసం ప్రజలు చేసిన పోరాటం అందులో ఉంది. మహిళల ప్రతిఘటన ఉంది. దళితులు, ఆదివాసీలు, కూలీలు, పేద రైతుల త్యాగాలు ఉన్నాయి. సైనిక చర్య తర్వాత జరిగిన హింసకు సంబంధించిన చీకటి అధ్యాయాలు కూడా ఉన్నాయి. ఇవన్నీ కలిపినప్పుడే సెప్టెంబర్ 17 చరిత్ర సంపూర్ణంగా కనిపిస్తుంది.

చరిత్రను పాలకులు తమ అవసరాలకు అనుగుణంగా మార్చుకోవచ్చు. కానీ ప్రజల జ్ఞాపకాలను పూర్తిగా చెరిపేయలేరు. తెలంగాణ నేలపై భూమి కోసం రక్తం చిందించిన రైతుల జ్ఞాపకం, వెట్టికి వ్యతిరేకంగా నిలిచిన కూలీల జ్ఞాపకం, దొరల గడీలను ఎదిరించిన మహిళల జ్ఞాపకం, ప్రజాస్వామ్యం కోసం ప్రాణాలు అర్పించిన యోధుల జ్ఞాపకం ఈ నేలలోనే ఉంది. కాబట్టి సెప్టెంబర్ 17ను మతతత్వ రాజకీయాలకు అప్పగించకూడదు. అదే సమయంలో అధికారిక ఉత్సవాల పరిధిలో బంధించకూడదు. ప్రజల పోరాట చరిత్రగా తిరిగి ప్రజల మధ్యకు తీసుకెళ్లాలి. భూమి, భుక్తి, సమానత్వం, సామాజిక న్యాయం, మహిళా విముక్తి, కుల నిర్మూలన, శ్రమ గౌరవం, ప్రజాస్వామిక హక్కులు అనే తెలంగాణ రైతాంగ పోరాట లక్ష్యాలను నేటి తరానికి అనుసంధానించాలి.

సెప్టెంబర్ 17 విలీనం మాత్రమే కాదు. విమోచనం అనే మతతత్వ నినాదం మాత్రమే కాదు. అది ప్రజల తిరుగుబాటు, రైతాంగ సాయుధ పోరాటం, నిజాం పాలన ముగింపు, హైదరాబాద్ భారత యూనియన్‌లో చేరడం, అనంతర దమనకాండ, సామాజిక - రాజకీయ పరిణామాలు అన్నింటినీ కలిపిన చరిత్ర. సెప్టెంబర్ 17 పాలకుల కథ కాదు. ప్రజల పోరాట చరిత్ర. విలీనం అనే ఒక్క మాటలో బంధించలేని చరిత్ర. విమోచనం అనే మతతత్వ నినాదంలో కుదించలేని చరిత్ర. ప్రజల రక్తంతో రాసిన చరిత్ర. ఆ చరిత్రను ప్రజలే కాపాడాలి.



- మామిండ్ల రమేష్ రాజా
రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ (ఎంఎల్)
లిబరేషన్ తెలంగాణ




# సీతారాముల చెంతకు అరకు ఎంపీ, మాజీ ఎమ్మెల్యే.

**భక్తిశ్రద్ధలతో స్వామివారి దర్శనం.. నేత్రపర్వంగా నిత్యకల్యాణం**

**భద్రాచలం, సెప్టెంబరు 12 (జనంసాక్షి)** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారిని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అరకు ఎంపీ గుమ్మ తనూజారాణి, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న వారికి దేవస్థానం అధికారులు, అర్చకులు, వేద పండితులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎంపీ, మాజీ ఎమ్మెల్యే దంపతులు? (మాజీ ఎమ్మెల్యే) సీతారాముల ఆశీస్సులు పొందారు. ఆలయ వేద పండితులు వారికి తీర్థప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం పలికారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు భద్రాచలం క్షేత్ర విశిష్టత, స్వామివారి సేవలు, ఆలయ సంప్రదాయాలను వివరించారు.

అనంతరం స్వామివారి నిత్యకల్యాణ వేడుకలు శాస్త్రోక్తంగా, వైభవంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణ ఘట్టాన్ని ఎంపీ తనూజారాణి, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి భక్తిశ్రద్ధలతో వీక్షించారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల నడుమ సాగిన నిత్యకల్యాణం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

# పాడి రైతులకు ఎలాంటి బకాయిలు లేవు

- నాణ్యమైన పాల ఉత్పత్తులు, మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి
- డిమాండ్‌కు సప్లైకు మధ్య ఉన్న వ్యత్యాసం తగ్గిస్తాము
- శాసనమండలిలో మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** విజయ డెయిరీని మరింత బలోపేతం చేసి పాడి రైతులకు అండగా నిలిచేందుకు ప్రజా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య శాఖల మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. శాసనమండలిలో విజయ డెయిరీ పాల సేకరణకు సంబంధించిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. విజయ డెయిరీలో పాల సేకరణలో తాత్కాలికంగా స్వల్ప తగ్గుదల నమోదైందని మంత్రి తెలిపారు. దీర్ఘకాలంగా కొనసాగిన లీన్ సీజన్ కారణంగానే ఈ తగ్గుదల ఏర్పడిందని వివరించారు. గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో విజయ డెయిరీ రోజువారీ సగటు పాల సేకరణ వివరాలను మంత్రి వెల్లడించారు. ఏప్రిల్ 2023-మార్చి 2024: రోజుకు 3.60 లక్షల లీటర్లు, ఏప్రిల్ 2024 - మార్చి 2025: రోజుకు 4.00 లక్షల లీటర్లు, ఏప్రిల్ 2025 -మార్చి 2026: రోజుకు 3.36 లక్షల లీటర్లు అని తెలిపారు. పాడి రైతుల సంక్షేమం, విజయ డెయిరీ బలోపేతం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి వివరించారు. పాడి రంగంలో రైతులకు మరింత భరోసా కల్పించడంతో పాటు విజయ డెయిరీని ఆధునికరించడం, పాల ఉత్పత్తుల మార్కెటింగ్‌ను పెంచడం, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించడం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. పాడి రైతులకు చెల్లించాల్సిన పాల సేకరణ బకాయిలు ఏవీ లేవని మంత్రి స్పష్టం చేశారు. రైతుల నుంచి సేకరించిన పాలకు సంబంధించి ప్రభుత్వం, విజయ డెయిరీ చెల్లింపుల విషయంలో బకాయిలు లేవని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని పాడి రైతులకు దేశంలోనే అత్యధిక ధర చెల్లిస్తున్నామని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వం కృత్రిమ పన్నీరును నిషేదించిందని,విజయ డైరీ కేవలం పాలతో తయారు చేసే పన్నీరును విక్రయిస్తోందని తెలిపారు. విజయ డైరీకి ఆదాయం పెంచే విధంగా ఆయా స్థలాల్లో పెట్రోల్ బంక్ లు , షాపింగ్ కాంప్లెక్స్ లు నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. పశు వైద్య శాఖ లో 110 మంది డాక్టర్ లను 304 కాంపౌండర్లను నియమించామని తెలిపారు. రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి పాడి గేదెలను పంపిణీ చేసి పాల ఉత్పత్తులను పెంచేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.డిమాండ్ కు సప్లై కి మధ్య వ్యత్యాసం తగ్గిస్తామని మంత్రి స్పష్టం చేశారు. పాడి రైతుల ప్రయోజనాలే ప్రజా ప్రభుత్వానికి ప్రాధాన్యత అని, విజయ డెయిరీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం కొనసాగిస్తుందని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.







# బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ.. డెమోక్రసీని మాక్ చేయడమే

**మంత్రి సీతక్క**

**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీఆర్ఎస్ నిర్వహించిన మాక్ అసెంబ్లీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఉందని రాష్ట్ర మంత్రి సీతక్క విమర్శించారు. చట్టసభల పట్ల, ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల బీఆర్ఎస్‌కు ఏ మాత్రం గౌరవం లేదనేది వారి చర్యలతో మరోసారి స్పష్టమైందని అన్నారు. శనివారం నాడు అసెంబ్లీ లాబీలో మంత్రి సీతక్క చిట్ చాట్ చేశారు. ఎర్రవల్లిలో ఎల్పీ సమావేశం నిర్వహించిన బీఆర్ఎస్ నేతలు, పార్టీ కార్యాలయంలో మాక్ అసెంబ్లీ నిర్వహించాల్సిన అవసరం ఏమొచ్చిందని మంత్రి ప్రశ్నించారు. అసెంబ్లీకి రావాల్సిన నేతలు పార్టీ కార్యాలయంలో కూర్చొని అసెంబ్లీని అనుకరించడం ప్రజాస్వామ్యాన్ని గౌరవించడమా? అని నిలదీశారు. గతంలో ఫామ్‌హౌస్ ముందు దళిత సంఘాలు నిరసన తెలిపినప్పుడు పసుపు నీళ్లతో ఆ ప్రాంతాన్ని శుద్ధి చేసిన ఘటనను మంత్రి సీతక్క గుర్తు చేశారు. "ఇంకా ఆ మైల పోలేదనే ఆధిపత్య దురహంకారంతోనే ఫామ్‌హౌస్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించలేదా?" అని ప్రశ్నించారు. అసెంబ్లీకి ఎలాగూ రాని కేసీఆర్, బీఆర్ఎస్ నిర్వహించిన మాక్ అసెంబ్లీకి కూడా రాకపోవడం చూస్తుంటే ఆయనకు చట్టసభల పట్ల, సొంత పార్టీ కార్యక్రమాల పట్ల ఎంత గౌరవం ఉందో అర్థమవుతోందని సీతక్క అన్నారు.

# గురుకుల టెండర్లపై కలెక్టర్ ప్రత్యేక చొరవ అవసరం

**నాలుగు నెలలుగా కొనసాగుతున్న జాప్యం..**

**టెండర్ల ఖరారుపై పెరుగుతున్న అనుమానాలు..**

**అధిక ధరలకు ఖరారు చేస్తారా..?**

**అనుభవజ్ఞులకు అవకాశం దక్కుతుందా..?**

**విద్యార్థుల ఆహార నాణ్యతపై పర్యవేక్షణ ఏది?**

**కొత్తగూడెం జిల్లా క్రైమ్, సెప్టెంబర్ 12(జనం సాక్షి):** జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకులాల టెండర్ల వ్యవహారం నాలుగు నెలలు గడిచినా కొలిక్కి రాకపోవడంతో కాంట్రాక్టర్లలోనే కాకుండా విద్యార్థులలో తల్లిదండ్రుల్లోనూ ఆందోళన వ్యక్తమవుతోంది. టెండర్ల ఖరారు విషయంలో జాప్యం కొనసాగుతుండటం, నిబంధనల అమలుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతుండటంతో జిల్లా యంత్రాంగం ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కొంతమంది కాంట్రాక్టర్లు తమ స్వలాభం కోసం టెండర్లను తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇవి ఆరోపణలేనని, వాస్తవ పరిస్థితి అధికారిక విచారణలోనే తేలాల్సి ఉందని స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా అనుభవం ఉన్న సరఫరాదారులను పక్కనపెట్టి కొత్తగా వ్యాపార రంగంలోకి వచ్చే వారికి అవకాశం కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న అభ్యంతరాలు కూడా వినిపిస్తున్నాయి.

టెండర్లను అధిక ధరలకు ఖరారు చేస్తే ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడే అవకాశం ఉందని, అదే సమయంలో టెండర్లలో సరైన పోటీ లేకపోతే విద్యార్థులకు అందించే నిత్యావసరాలు, కూరగాయలు, చికెన్, మటన్ తదితర ఆహార పదార్థాల ధర, నాణ్యతపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని కాంట్రాక్టర్ లు పేర్కొంటున్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే గురుకుల విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందడం ముఖ్యమని వారు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే నాలుగు నెలలు గడుస్తున్న నేపథ్యంలో టెండర్లను ఎప్పుడు ఖరారు చేస్తారు? ఏ ధరలను ప్రాతిపదికగా తీసుకుంటారు? గత అనుభవం, అర్హతలకు ఎంత ప్రాధాన్యం ఇస్తారు? కొత్తగా వచ్చే వారికి ఏ ప్రాతిపదికన అవకాశం కల్పిస్తారు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.




**కలెక్టర్ గారూ.. ప్రత్యేక చొరవ చూపాలి**

ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా చొరవ తీసుకుని టెండర్ ప్రక్రియ మొత్తాన్ని ఒకసారి సమీక్షించాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు. టెండర్ పత్రాల పరిశీలన, అర్హతల నిర్ధారణ, ధరల నిర్ణయం, పోటీ పరిస్థితి తదితర అంశాలను పారదర్శకంగా పరిశీలించి, ఎవరికీ అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. విచారణ పూర్తయ్యే వరకు తొందరపడి టెండర్లను ఖరారు చేయకుండా, అవసరమైతే సంబంధిత రికార్డులు, సీసీటీవీ/వీడియో ఆధారాలు, టెండర్ పత్రాలను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని కోరుతున్నారు. ప్రభుత్వానికి తక్కువ వ్యయం, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, అర్హులైన కాంట్రాక్టర్లకు సమాన అవకాశం---ఈ మూడు అంశాలకు ప్రాధాన్యం ఇచ్చేలా కలెక్టర్ ప్రత్యేక పర్యవేక్షణలో టెండర్ ప్రక్రియను పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. నాలుగు నెలల జాప్యానికి తెరపడుతుందా? టెండర్లు పారదర్శకంగా ఖరారవుతాయా? లేక మళ్లీ వివాదాలకు దారితీస్తాయా? అన్నది జిల్లా యంత్రాంగం తీసుకునే నిర్ణయంపైనే ఆధారపడి ఉంది.

# భారీ వర్షంతో భద్రాచలం రోడ్లు జలమయం

**కాలువలు పొంగి రోడ్లపై వరద.. రాజీవ్‌నగర్‌లో నరకప్రాయం**

**భద్రాచలం సెప్టెంబరు 12 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- భద్రాచలంలో కురిసిన భారీ వర్షం పట్టణంలోని డ్రైనేజీ వ్యవస్థ డొల్లతనాన్ని మరోసారి బయటపెట్టింది. వర్షపు నీటితో కాలువలు పొంగిపొర్లడంతో పలు ప్రాంతాల్లో రోడ్లపై వరదనీరు పారింది. ముఖ్యంగా ఐటీడీఏ రోడ్డులోని రాజీవ్‌నగర్ కాలనీలో పరిస్థితి దారుణంగా మారింది. రూపా స్కూల్ వెనుక ఉన్న డ్రైనేజీ ఓవర్‌ఫ్లో కావడంతో మురుగునీరు రోడ్డుపైకి చేరి స్థానికులకు తీవ్ర ఇబ్బందులు సృష్టించింది. పలు ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు, మురుగునీటిని ఒకే డ్రైనేజీకి అనుసంధానం చేయడంతో కొద్దిసేపు భారీ వర్షం కురిసినా కాలువ సామర్థ్యానికి మించి నీరు చేరుతోంది. దీంతో కాలువ నిండిపోయి రోడ్డుపైకి ప్రవహిస్తోంది. కాలేజీ గ్రౌండ్ ప్రాంతం నుంచి వచ్చే అదనపు వర్షపు నీరు కూడా ఇదే కాలువలోకి చేరడంతో సమస్య మరింత తీవ్రమవుతోంది. వర్షం తగ్గిన తర్వాత కూడా రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, ఉద్యోగులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రూపా స్కూల్‌కు వెళ్లే చిన్నారులు మురుగునీటిని దాటుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొనడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



**శాశ్వత పరిష్కారం కావాలి**

కాలువల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు కాలేజీ గ్రౌండ్ ప్రాంతం నుంచి వచ్చే అదనపు నీటికి ప్రత్యేక మార్గం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. పలు డ్రైనేజీలను ఒకే కాలువకు అనుసంధానం చేయడం వల్ల ఏర్పడుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, వర్షపు నీరు--మురుగునీరు రోడ్లపైకి రాకుండా సమగ్ర డ్రైనేజీ ప్రణాళిక రూపొందించాలని రాజీవ్‌నగర్ కాలనీ వాసులు అధికారులను కోరుతున్నారు.

# చోరీ కేసుల్లో నిందితులకు రిమాండ్

**ఐదు తులాల బంగారం ఒక ఆటో చరవాణిలను స్వాధీనం**

**దేవరకొండ డిఎస్పి శ్రీనివాస్ రావు**

**కొండమల్లేపల్లి, సెప్టెంబర్ 12 (జనంసాక్షి):**

కొండమల్లేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనాల కేసులను ఛేధించినట్లు డీఎస్పీ శ్రీనివాస్ రావు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పి శ్రీనివాస్ రావు కేసు వివరాలను వెల్లడించారు. కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండ్ లో ఈ ఏడాది మార్చి నుంచి జులై వరకు జరిగిన మూడు దొంగతనాలకు పాల్పడిన అంతరాష్ట్ర దొంగల ముఠాను శనివారం పట్టణ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. అనంతరం సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ శ్రీనివాస్ రావు వివరించారు. నెల్లూరు జిల్లా జొన్నవాడకు చెందిన సిందె తిరుపతమ్మ, వనరచి కేశవ, వనరచి జ్యోతి అనే వ్యక్తులు ఓ ముఠాగా ఏర్పడి బస్టాండ్ తదితర రద్దీ ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. అదే క్రమంలో సదరు ముఠా సభ్యులు శనివారం కొండమల్లేపల్లి బస్టాండ్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న క్రమంలో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారని అంతేకాకుండా సదరు నిందితులపై తిరుపతి, కావలి, కర్నూల్ జిల్లాలో మూడు కేసులు నమోదైనట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి ఐదు తులాల బంగారం, ఒక ఆటో, చరవాణిలను స్వాధీనం చేసుకుని దేవరకొండ కోర్టులో హాజరుపరిచినట్లు డిఎస్పి తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ నవీన్ కుమార్, ఎస్ఐ అజ్మీర రమేష్, సిబ్బంది కరుణాకర్, హేమునాయక్, భాస్కర్, శేఖర్ రెడ్డి, రాంబాబు, నాగ సంధ్యలను డీఎస్పీ అభినందించారు.



# ముదిగొండలో యువకుడి ఆత్మహత్య

**ఇటీవలే పోక్సో కేసులో జైలుకు.. బెయిల్‌పై వచ్చాక వేధింపులు**

**రూ 25 లక్షలు ఇస్తే రాజీ చేయిస్తామన్న మధ్యవర్తులు**

**మాట్లాడుదామని పిలిచి దాడికి పాల్పడిన వైనం**

**అవమానం భరించలేక బలవన్మరణం**

**సూసైడ్ నోట్ తో అసలు విషయం వెలుగులోకి..**

**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 12(జనం సాక్షి)**

'తనపై నమోదైన కేసు.. జైలు జీవితం.. బయటకు వచ్చాక కొందరి వేధింపులు.. కుటుంబం రోడ్డున పడుతోందనే ఆవేదన.. వెరసి ఖమ్మం జిల్లా ముదిగొండ మండల కేంద్రంలో ఓ యువకుడి బలవన్మరణం తీవ్ర కలకలం రేపింది.. తన చావుతోనైనా నిజాలు వెలుగులోకి రావాలని.. అడ్డదిడ్డంగా సెటిల్మెంట్స్ చేస్తున్న వ్యక్తులు కటకటాల వెనక్కి వెళ్లాలని సదరు యువకుడు తనకు తానే రాసుకున్న మరణ శాసనం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది... సూసైడ్ నోట్ తో పాటు మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..

ఖమ్మం జిల్లా ముదిగొండ మండల కేంద్రంలో మెట్టెల వినయ్ (25) అనే యువకుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మెడకు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇటీవలే ఒక మైనర్ బాలిక అంశంలో ఫోక్సో కేసులో అరెస్టై జైలుకు వెళ్ళొచ్చాడు. అతనిని కొందరు వ్యక్తులు దుర్భాషలాడటం, బెదిరించడం, రకరకాల వేధింపులకు గురి చేస్తున్న నేపథ్యంలో తీవ్ర మనస్థాపానికి గురై ఉసురు తీసుకున్నాడు. బయటకు వెళ్లి వచ్చిన తల్లిదండ్రులకు తమ బిడ్డ వేలాడుతూ కనిపించడంతో ఒక్కసారిగా ఖంగుతిన్నారు. మెడకు బిగుసుకున్న ఉరిని తప్పించి హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అతడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లు నిర్ధారించడంతో గుండెలు పగిలేలా రోదించారు. కాగా..! మృతుడు వినయ్ రాసుకున్న సూసైడ్ నోట్ అనేక విస్తుగొలిపే విషయాలను బహిర్గతం చేయడం గమనార్హం.



**రూ. 25 లక్షలు డిమాండ్**

పోక్సో కేసులో అరెస్టై ఇటీవలే బెయిల్ పై వచ్చిన వినయ్ ని కొందరు టార్గెట్ చేసినట్టుగా అతని సూసైడ్ నోట్ తెలియజేస్తున్నది. ముదిగొండ మండల కేంద్రానికే చెందిన ఇద్దరు వ్యక్తులు, బాలిక బంధువులు కలిసి రాజీ మాట్లాడదామని పిలిచారు. అంత డబ్బు తాను ఇచ్చుకోలేనని చెప్పడంతో మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న వ్యక్తులు యువకుడిపై చేయి చేసుకున్నారు. తాము అడిగింది ఇవ్వకుంటే చంపేస్తామని కూడా బెదిరించినట్లు నోట్ లో పేర్కొన్నాడు. అంతటితో ఆగకుండా భవిష్యత్తులో మరిన్ని పోలీసు కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని, కుటుంబం పరువు బజారున పడేస్తామని హెచ్చరించినట్లు తెలిసింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన వినయ్ ఇంట్లో ఎవరూ లేని సందర్భంలో బలవన్మరణానికి పాల్పడడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

**సూసైడ్ నోట్‌లో హృదయ విదారక అంశాలు**

ముదిగొండ మండల కేంద్రంలో యువకుడి బలవన్మరణం తీవ్ర కలకలం రేపింది. తాను చనిపోతున్న క్రమంలో రాసుకున్న సూసైడ్ నోట్ అనేక హృదయ విదారక అంశాలను వెలుగులోకి తెచ్చింది. తొలుత తన చావుకు కారకులైన వ్యక్తుల పేర్లను బహిర్గత పరిచాడు. వారు తనను డబ్బులు కావాలని బెదిరించిన తీరును, తనపై చేసిన భౌతిక దాడిని కళ్ళకు కట్టినట్లు వివరించాడు. అలాంటి వ్యక్తులు సభ్య సమాజంలో ఉంటే తనలాంటివారు ఎందరో బాధితులుగా మారతారని భావిస్తున్నట్లు పేర్కొన్నాడు. తన చావుతోనైనా వాళ్లను జైలుకు పంపాలని, చట్టపరంగా శిక్షించాలని తాను భావిస్తున్నట్లు వెల్లడించాడు. అదేవిధంగా ఇంతకాలం తనను కని పెంచిన తల్లిదండ్రులను, తోడబుట్టిన ఆడబిడ్డలను క్షమించమని కోరుతూ.. జాగ్రత్తగా ఉండాలని.. ఊరు విడిచి వెళ్లవద్దని.. తనపై కేసు పెట్టిన అమ్మాయి తనకు చెల్లెలు లాంటిదని.. తాను బతికుంటే కుటుంబం పరువు పోతుందనే ఆందోళనతోనే చనిపోతున్నట్లు సూసైడ్ నోట్ లో క్షుణ్ణంగా వివరించడం విశేషం. పాతికేళ్ల యువకుడైన వినయ్ తనకు తానే రాసుకున్న మరణ శాసనం బహిర్గతం కావడంతో, దానిని చదివిన ప్రతి ఒక్కరు కన్నీరు మున్నీరు గా విలపించారు.

**యువకుడి కుటుంబ సభ్యుల ఆందోళన**

పోక్సో కేసు పెట్టడంతోపాటు, బెయిల్ పై ఇంటికి వచ్చిన యువకుడిని డబ్బుల కోసం వేధించడం.. మధ్యవర్తులు బెదిరించడం, భౌతిక దాడులకు పాల్పడడం.. తద్వారా వినయ్ ఆత్మహత్య చేసుకోవడం ముదిగొండ మండల ప్రజలకు తీవ్ర ఆగ్రహావేశాలని తెప్పించింది. తమ కన్న కొడుకు చావుకు కారణమైన వారందరినీ తక్షణమే శిక్షించాలని కోరుతూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానిక గ్రామస్తులు ముదిగొండ మండల కేంద్రంలో ఆందోళనకు దిగారు. ప్రధానంగా మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న ఇద్దరిలో ఒకరు గతంలో కూడా ఇలాంటి దారుణాలకు పాల్పడినట్లు ఆరోపిస్తూ వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో బాలిక కుటుంబ సభ్యులతో పాటు, మధ్యవర్తుల మీద స్థానిక పోలీసులు కేసులు నమోదు చేశారు. దీంతో శాంతించిన వినయ్ తరఫు వాళ్ళు ఆందోళన విరమించారు.

# పినపాకకు రూ.186 కోట్ల హెచ్ఏఎం నిధులు

**ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు కాంగ్రెస్ నేతల కృతజ్ఞతలు**

**అశ్వాపురం సెప్టెంబర్ 12 (జనంసాక్షి):**



పినపాక నియోజకవర్గంలో రహదారులు, వంతెనల అభివృద్ధికి రూ. 186 కోట్ల హెచ్ఏఎం నిధులు మంజూరు కావడం పట్ల అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ భారీ నిధులు మంజూరు చేయించడంలో కృషి చేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్‌బాబు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని రహదారులు, వంతెనల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. భారీ నిధులతో మండలంలో పలు రహదారులు, వంతెనల నిర్మాణం జరగనుండటంతో అశ్వాపురం మండలానికి మహర్దశ పట్టనుందని అన్నారు. దసరాలోపే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవడం, హెచ్ఏఎం విధానంలో 15 ఏళ్లపాటు నిర్వహణ బాధ్యత కూడా ఉండేలా చూడటం వల్ల నిర్మించిన రహదారులు ప్రజలకు దీర్ఘకాలం ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించి, ప్రజల ప్రయాణాన్ని సుఖవంతం చేయాలన్న ఎమ్మెల్యే పాయం ప్రత్యేక చొరవకు కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం, ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అధికారులకు కూడా కాంగ్రెస్ పార్టీ తరపున రమేష్‌బాబు ధన్యవాదాలు తెలిపారు.

# ప్రభుత్వం వెంటనే రైస్ మిల్లింగ్ రంగాన్ని ఆదుకోవాలి

**రబీ ధాన్యానికి బాయిల్డ్ రైస్ లక్ష్యం కేటాయించాలి**

**25 శాతం పెనాల్టీ, 12 శాతం వడ్డీ మాఫీ చేయాలి**

**పార్ బాయిల్డ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సముద్రాల వెంకటేశ్వర్లు**

**కొండమల్లేపల్లి, సెప్టెంబర్ 12 (జనంసాక్షి):**

ఖరీఫ్, రబీ ధాన్యం మిల్లింగ్, సీఎంఆర్ డెలివరీలో ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని దేవరకొండ కొండమల్లేపల్లి పార్ బాయిల్డ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సముద్రాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రైస్ మిల్లుల బంద్ కు అయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. రైతులు, ప్రభుత్వం, మిల్లర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారం చూపాలని కోరారు. రబీ 2025-26లో వచ్చిన ధాన్యంలో అధిక భాగం బాయిల్డ్ రైస్ కు అనుకూలంగా ఉందని దానిని రా రైస్ మిల్లింగ్ చేస్తే వైట్ చాకీ, బ్రోకెన్ రైస్ శాతం అధికంగా వస్తోందన్నారు. దీంతో ప్రభుత్వం నిర్దేశించిన రికవరీ, నాణ్యత ప్రమాణాలను సాధించడం మిల్లర్లకు ఆచరణాత్మకంగా సాధ్యం కావడం లేదని వివరించారు. అందువల్ల రబీ ధాన్యానికి తగిన బాయిల్డ్ రైస్ లక్ష్యాన్ని కేటాయించి వాస్తవ మిల్లింగ్ రికవరీ ఆధారంగా ఓటీఆర్ నిర్ణయించాలని డిమాండ్ చేశారు. హై బ్రోకెన్స్, తేమ నష్టం, సహజ నాణ్యత క్షీణత, సార్టెక్స్ నష్టాలను పరిగణనలోకి తీసుకుని ఓటీఆర్ ను శాస్త్రీయంగా నిర్ణయించాలన్నారు. సీఎఫ్ఎఆర్ఎస్ఐ, మైసూర్ టెస్ట్ మిల్లింగ్, వాస్తవ మిల్లింగ్ రికవరీ ఆధారంగా ఫిజికల్ వెరిఫికేషన్ నిర్వహించాలని కోరారు. 67 శాతం ఓటీఆర్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రా రైస్ మిల్లర్లను మానవతా దృక్పథంతో పరిగణించి వన్ టైమ్ సెటిల్మెంట్ అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఎఫ్.సి.ఐ గోదాముల్లో తగినంత నిల్వ స్థలం కల్పించి సిద్ధంగా ఉన్న బాయిల్డ్ రైస్, సీఎంఆర్ ను సకాలంలో లిఫ్టింగ్ చేయాలని డిమాండ్ చేశారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న ధాన్యం మిల్లింగ్, సీఎంఆర్ డెలివరీకి అదనపు సమయం అవసరమవుతున్నందున నవంబర్ వరకు అవసరమైతే డిసెంబర్ వరకు గడువు పొడిగించాలని కోరారు. గడువు ఇస్తే తమ వద్ద ఉన్న ధాన్యానికి ప్రతి గింజకు బాధ్యత వహించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన ధాన్యం, సీఎంఆర్ ను పూర్తిగా అందజేస్తామని వారు స్పష్టం చేశారు. మిల్లింగ్ చార్జీలు, డ్రయేజ్ చార్జీలు, కస్టోడియన్ చార్జీలు, రవాణా చార్జీలను సకాలంలో చెల్లించాలని కోరారు. అదేవిధంగా మిల్లర్లపై విధించిన 25 శాతం పెనాల్టీ, 12 శాతం వడ్డీని మాఫీ చేసి రైస్ మిల్లింగ్ పరిశ్రమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతుల ప్రయోజనాలు, ప్రభుత్వ ధాన్యం సేకరణ, సీఎంఆర్ వ్యవస్థ సజావుగా కొనసాగేందుకు రైస్ మిల్లర్లు ఎల్లప్పుడూ సహకరిస్తారని తెలిపారు. జిల్లా అధికారులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించి తక్షణ పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేశారు.

# విచ్చలవిడిగా పీవోపీ విగ్రహాల తయారీ

- పర్యావరణానికి పెనుముప్పు పీవోపీ విగ్రహాలు
- నిబంధనలు పాటించని తయారీదారులపై చర్యలు ఏవి?
- మట్టి విగ్రహాలను వినియోగించాలంటున్న పర్యావరణ ప్రేమికులు

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 12(జనం సాక్షి)**
వినాయకచవితి పర్వదినం సమీపిస్తున్న వేళ సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా అలాగే పరిసర గ్రామీణ ప్రాంతాల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) వినాయక విగ్రహాల తయారీ విచ్చలవిడిగా జరుగుతోంది. అధికారుల తనిఖీ ఊసే లేకపోవడంతో తయారీదారులు నిబంధనలు పాటించకుండా పర్యావరణానికి తీవ్ర ముప్పు తెచ్చేలా విగ్రహాలను తయారు చేస్తున్నారు. అనుమతులు పొందే సమయంలో పర్యావరణహితంగా విగ్రహాలు తయారు చేస్తామంటూ చెబుతున్న తయారీదారులు తర్వాత వాటిని పెడచెవిన పెడుతున్నారు. ఏటా విచ్చలవిడిగా పిఓపి విగ్రహాల తయారీ, నిమజ్జనంతో పర్యావరణానికి తీరని నష్టం జరుగుతోంది. మట్టి విగ్రహాల వినియోగం ఉపయోగాలు, పర్యావరణ హితం పై అవగాహన కల్పిస్తూ, పిఓపి విగ్రహాల తయారీపై తనిఖీలు చేపట్టి. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి, ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. పీఓపీ విగ్రహాల తయారీ, వినియోగం, నిమజ్జనం వల్ల పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉన్నందున తయారీ దశ నుంచే అధికారులు నిఘా ఉంచాలంటున్నారు.





**అధికారుల నిఘా ఎక్కడ?**
వినాయక చవితి సందర్భంగా విగ్రహాలకు డిమాండ్ పెరగడంతో సంగారెడ్డి పరిసర ప్రాంతాల్లో తయారీ, విక్రయాలు పెద్దఎత్తున జరుగుతాయి. ఈ రంగంపై ఆధారపడి అనేక కుటుంబాలు జీవిస్తున్నందున వారి ఉపాధికి ఇబ్బందికలగకుండా, పర్యావరణ నిబంధనలు పాటించేలా అధికారులు అవగాహన కల్పించాలి. కొన్ని ప్రాంతాల్లో అవసరమైన అనుమతులు లేకుండా లేదా పర్యావరణ మార్గదర్శకాలను పాటించకుండా పీఓపీ విగ్రహాల తయారీ జరుగుతోందనే సమాచారం వస్తున్న నేపథ్యంలో అధికారిక తనిఖీల ద్వారా వాస్తవాలను తేల్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**పీఓపీతో పర్యావరణానికి ముప్పు**
పీఓపీతో తయారు చేసిన విగ్రహాలు నీటిలో సులభంగా కరగకపోవడం, నిమజ్జనం అనంతరం అవశేషాలు నీటి వనరుల్లో పేరుకుపోవడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. దీనికి తోడు విగ్రహాలపై ఉపయోగించే రంగులు, ఇతర అలంకరణ సామగ్రి నీటి వనరులపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో ముందస్తు పర్యవేక్షణ కచ్చితంగా ఉండాలి.

**మట్టి విగ్రహాలకే ప్రాధాన్యం**
సహజ మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను వినియోగించడం పర్యావరణ పరిరక్షణకు మేలు చేయడంతో పాటు స్థానిక కుమ్మరి కళాకారులకు ఉపాధి కల్పిస్తుందని ప్రజలు పేర్కొంటున్నారు. పర్యావరణహిత మట్టి విగ్రహాల తయారీదారులకు అధికారులు ప్రోత్సాహం, అవగాహన, మార్కెట్ అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు.

# నడిగడ్డలో ఎండిపోతున్న ఖరీఫ్ పంటలు


## వర్షాభావం, తెగుళ్లతో అన్నదాత విలవిల



**గద్వాల, సెప్టెంబర్ 12 (జనంసాక్షి)** జోగులాంబ గద్వాల జిల్లా లో వర్షాధారంగా సాగు చేసిన ఖరీఫ్ పంటల పరిస్థితి ప్రస్తుతం అత్యంత దయనీయంగా మారింది. సీజన్ ప్రారంభం నుండి ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో జిల్లాలో లోటు వర్షపాతం నమోదైంది. గత మూడు నెలలుగా వర్షాలు లేక పొలాలు బీడు వారుతుండటంతో పత్తి, వేరుశనగ, మిరప వంటి ప్రధాన పంటలు ఎదుగుదల లేక గిడసబారిపోతున్నాయి. దీనికి తోడు వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల పంటలకు తీవ్రమైన తెగుళ్లు సోకడం గమనార్హం. ఈ తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో పెట్టుబడులు కూడా దక్కవనే ఆందోళనలో రైతాంగం కొట్టుమిట్టాడుతోంది. ఇప్పటికే ఎకరాకు వేల రూపాయలు ఖర్చు చేసి విత్తనాలు, ఎరువులు వేసినప్పటికీ, నీరు లేక పంట కళ్ల ముందే ఎండిపోతుండటాన్ని అన్నదాతలు తట్టుకోలేకపోతున్నారు. ముఖ్యంగా నల్లరేగడి, చల్కా భూముల్లో సాగు చేసిన పత్తి పంటలో గులాబీ రంగు రబ్బరు పురుగు, మిరపలో ముడత తెగులు విజృంభించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ తెగుళ్ల నివారణకు మార్కెట్‌లో దొరికే ఖరీదైన పురుగుమందులను అప్పులు చేసి మరీ పిచికారీ చేస్తున్నా ఎలాంటి ఫలితం కనిపించడం లేదు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు తగిన సాంకేతిక సలహాలు, సూచనలు అందించాలని రైతులు కోరుతున్నారు. వర్షాలు లేక బోరుబావుల్లో సైతం భూగర్భ జలమట్టాలు పడిపోవడంతో పంటలను కాపాడుకోవడం అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం వెంటనే స్పందించి జిల్లాలో కరువు పరిస్థితులపై సర్వే నిర్వహించాలని, నష్టపోయిన ఖరీఫ్ రైతులకు ఎకరాకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని నడిగడ్డ రైతాంగం గట్టిగా డిమాండ్ చేస్తోంది.

# వెల్టూరులో 11.75 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు

## ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక కృషికి ఫలితం
## జీవో నంబర్ 164 జారీ చేసిన ప్రభుత్వం



**వనపర్తి బ్యూరో సెప్టెంబర్ 12 జనంసాక్షి :** వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవ, కృషికి ఫలితం దక్కింది. పెద్దమందడి మండలం వెల్టూరులో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు జీవో నంబర్ 164ను జారీ చేస్తూ రూ.11.75 కోట్ల నిధులను మంజూరు చేసింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మానసపుత్రికగా భావిస్తున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను వెల్టూరులో ఏర్పాటు చేయడం ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన, నాణ్యమైన విద్యా అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ పాఠశాల ఏర్పాటుకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వ స్థాయిలో నిరంతరం కృషి చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరికి, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారి విద్యాభివృద్ధికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు కీలక ముందడుగుగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో పరిశ్రమలో కార్మికుడి అనుమానాస్పద మృతి

## యాజమాన్యం తీరుపై బంధువుల ఆగ్రహం
## న్యాయం చేయాలని పరిశ్రమ ఎదుట నిరసన



**సదాశివపేట, సెప్టెంబర్ 12 (జనంసాక్షి)** సదాశివపేట మండలం నందికంది వద్ద ఉన్న బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో పరిశ్రమలో శనివారం కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడిని నందికంది గ్రామానికి చెందిన ప్రకాష్ (42)గా గుర్తించారు. కార్మికుడు పరిశ్రమలోనే మృతి చెందినప్పటికీ, యాజమాన్యం ఆ సమాచారాన్ని కుటుంబ సభ్యులకు వెంటనే తెలియజేయకపోవడం వివాదాస్పదమైంది. మృతదేహాన్ని రహస్యంగా సదాశివపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్నారు. అప్పటికే ప్రకాష్ ప్రాణాలు కోల్పోవడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి.

యాజమాన్యం నిర్లక్ష్యంపై మండిపాటు

ప్రకాష్ మరణాన్ని కప్పిపుచ్చేందుకు యాజమాన్యం ప్రయత్నించిందని బంధువులు ఆరోపించారు. పరిశ్రమలో కార్మికులకు కనీస భద్రత లేకపోవడమే కాకుండా, గతంలోనూ ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నాయని వారు గుర్తుచేశారు. కార్మికులపై తీవ్ర ఒత్తిడి తెస్తూ బానిసల్లా పని చేయించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతికి బాధ్యత వహిస్తూ బాధిత కుటుంబానికి రూ.లక్షల్లో నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సదాశివపేట సీఐ వెంకటేష్ తెలిపారు.

## 25 ఏళ్ల సమస్యకు పరిష్కారం..

# తెల్లాపూర్ ఆర్‌యూబీకి రూ.21 కోట్లు

- అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎంపీ రఘునందన్‌రావు
- కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలని అధికారులకు సూచన



**రామచంద్రపురం, సెప్టెంబర్ 12(జనంసాక్షి)** పటాన్‌చెరు నియోజకవర్గం తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని తెల్లాపూర్--విద్యుత్‌నగర్ మార్గంలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించనుంది. ఇరుకైన అండర్ బ్రిడ్జి కారణంగా సుమారు 25 ఏళ్లుగా స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు రూ.21 కోట్ల నిధులు మంజూరయ్యాయి.

స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఈ అంశాన్ని కేంద్ర రైల్వే శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను వివరించి అండర్ బ్రిడ్జి అభివృద్ధి, విస్తరణకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎంపీ చొరవతో రూ.21 కోట్ల నిధులు మంజూరు కావడంతో ఈ ప్రాంత ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. నిధులు మంజూరైన నేపథ్యంలో రైల్వే అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఎంపీ రఘునందన్‌రావు అండర్ బ్రిడ్జి ప్రాంతాన్ని శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుత రహదారి పరిస్థితి, అండర్ బ్రిడ్జి వెడల్పు, రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులు, భవిష్యత్‌లో పెరగనున్న ట్రాఫిక్‌ను అధికారులు, ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. అండర్ బ్రిడ్జి నిర్మాణ పనుల సందర్భంగా ఇరువైపులా ఉన్న కాలనీల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీ అధికారులకు సూచించారు. ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని, నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు. అలాగే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత సమయంలో నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. భవిష్యత్‌లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన సాంకేతిక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులకు తెలిపారు. 25 ఏళ్లుగా ఎదురుచూస్తున్న సమస్యకు రూ.21 కోట్ల నిధులు మంజూరు కావడంతో తెల్లాపూర్, విద్యుత్‌నగర్ పరిసర ప్రాంతాల ప్రజలకు రాకపోకల కష్టాలు తొలగనున్నాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# గద్వాల లోక్ అదాలత్‌లో రికార్డు విజయం

## ఒకేరోజు 8,486 కేసుల పరిష్కారం



**గద్వాల, సెప్టెంబర్ 12 (జనంసాక్షి)** జాతీయ న్యాయ సేవా సంస్థ ఆదేశాల మేరకు గద్వాల కోర్టు ఆవరణలో శనివారం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమం విజయవంతమైంది. ఈ సందర్భంగా వివిధ విభాగాలకు చెందిన 8,486 కేసులను ఒకే రోజు సామరస్యపూర్వకంగా పరిష్కరించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కల్యాణ్ చక్రవర్తి అధికారికంగా వెల్లడించారు. ప్రజలకు సత్వర న్యాయం అందించడంతో పాటు, కోర్టుల్లో దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న కేసులను రాజీ మార్గంలో కొలిక్కి తెచ్చేందుకు ఈ లోక్ అదాలత్ ఎంతో దోహదపడిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ.. సివిల్ వివాదాలు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మోటారు వాహన ప్రమాద పరిహార క్లెయిములు, చెక్ బౌన్స్ కేసులు, మరియు కుటుంబ వివాదాలను ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించినట్లు తెలిపారు. కోర్టుల చుట్టూ ఏళ్ల తరబడి తిరగాల్సిన అవసరం లేకుండా, లోక్ అదాలత్ వేదికగా లభించే పరిష్కారాలు కక్షిదారులకు ఎంతో ఊరటనిస్తాయని స్పష్టం చేశారు. దీనివల్ల అటు ప్రజలకు సమయం, ఇటు న్యాయపరమైన ఖర్చులు మరియు ధనం భారీగా ఆదా అవుతాయని వివరించారు. లోక్ అదాలత్ ద్వారా లభించే తీర్పులకు సివిల్ కోర్టు డిగ్రీతో సమానమైన చట్టబద్ధత ఉంటుందని, ఇక్కడ ఎలాంటి అప్పీళ్లకు అవకాశం ఉండదని న్యాయమూర్తి గుర్తుచేశారు. ఫలితంగా ఇరువర్గాల మధ్య గెలుపోటముల పట్టింపులు లేకుండా, శాశ్వత ప్రాతిపదికన సయోధ్య కుదురుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే ఈ జాతీయ లోక్ అదాలత్ అవకాశాన్ని కక్షిదారులు నిరంతరం సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మెగా లోక్ అదాలత్ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు అధికారులు మరియు పెద్ద సంఖ్యలో కక్షిదారులు పాల్గొని, కేసుల సత్వర పరిష్కారానికి సహకరించారు.

## రహదారిపై రక్తపు మడుగులో..


### అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి



**పాపన్నపేట, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :**
రాత్రి వేళ రక్తపు మడుగులో అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు .. కొత్తపల్లి గ్రామానికి చెందిన గుడ్డింగారి రాజు (25) ఆటో చోదకుడిగా పని చేస్తు జీవిస్తున్నాడు. శుక్రవారం ఉదయం పని ఉందని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. శుక్రవారం రాత్రి మండల పరిధి లోని శానాయిపల్లి శివారు మెదక్ - బొడ్మట్ పల్లి ప్రధాన రహదారి రోడ్డుపై తలకు గాయాలతో పడి ఉన్నాడు. అటుగా వెళ్లిన స్థానికులు గమనించి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. రాజును ఎవరైనా హత్య చేసి ఉంటారా లేదా ఏదైనా వాహనం ఢీ కొట్టిందా అనేది తెలియాల్సి ఉందని ఎస్ఐ శ్రీనివాస్ వివరించారు. మృతుడి తండ్రి సిద్ధిరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

# భూనీడు అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి భారీ వరాలు

## రూ.11 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా భూనీడు హైస్కూల్ అప్‌గ్రేడ్
## రూ.59.30 కోట్లతో మద్దూరు భూనీడు డబుల్ రోడ్డుకు మంజూరు



**కొత్తపల్లి సెప్టెంబర్ 12 (జనం సాక్షి) :** కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. కొత్తపల్లి మండలంలోని భూనీడు హైస్కూల్‌ను రూ.11 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు, మద్దూరు నుంచి భూనీడు వరకు రూ.59.30 కోట్లతో డబుల్ రోడ్డుకు నిధులు మంజూరు చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు.

భూనీడు అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ పుష్ప శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు, గ్రామ యువకులు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. భూనీడు హైస్కూల్‌ను రూ.11 కోట్ల భారీ వ్యయంతో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా స్థానిక విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు అందుబాటులోకి రానున్నాయని నాయకులు అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. మద్దూరు నుంచి భూనీడు వరకు రూ.59.30 కోట్లతో డబుల్ రోడ్డుకు నిధులు మంజూరు కావడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ రహదారి పూర్తయితే మండల ప్రజలకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడటంతో పాటు, గ్రామాల మధ్య ప్రయాణం సులభతరం అవుతుందని నాయకులు తెలిపారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కొడంగల్ ప్రాంత అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, విద్య, రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని అన్నారు. భూనీడు ప్రాంతానికి రెండు కీలక అభివృద్ధి పనులు మంజూరు కావడం ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దుప్పటిగట్టు సర్పంచ్ వెంకటయ్య, కిషన్ నగర్ సర్పంచ్ ఆంజనేయులు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరేష్ యాదవ్, స్థానిక ఉపసర్పంచ్ వెంకట్ రెడ్డి, కిషన్ నగర్ ఉపసర్పంచ్ అక్షయ్, వార్డు సభ్యులు లాలూ అహ్మద్, నరహరి, జ్యోతి, ప్రశాంత్, గ్రామ అధ్యక్షులు అంజిరెడ్డి, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.
అలాగే గ్రామ యువకులు బాలు, కొండప్ప, నవీన్, శ్రీనివాస్ గౌడ్, భీమప్ప, బాబుతో పాటు మైనార్టీ సోదరులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# అర్హులందరికీ ఓటు ఉండాలి

## మెదక్ అదనపు కలెక్టర్ నగేష్



**పాపన్నపేట, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :**
పొరపాట్లకు తావు లేకుండా అర్హులందరూ ఓటు హక్కు పొందేలా చర్యలు తీసుకోవాలని మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్ సిబ్బందికీ సూచించారు. ప్రత్యేక క్యాంపెన్ డే కార్యక్రమంలో భాగంగా శనివారం లక్ష్మీనగర్ గ్రామపంచాయతీ కార్యాలయం,పోలింగ్ స్టేషన్ లోని రికార్డులు,ఫారాలు క్షుణ్ణంగా పరిశీలించారు. ఓటర్ల తొలగింపు,చేర్పుల ప్రక్రియకు సంబంధిత ఫారం 6,7,8 ల వివరాలను పరిశీలించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల కనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఏ ఒక్కరికీ అన్యాయం జరుగవద్దన్నారు. ఈసందర్భంగా తహశీల్దార్ సతీష్ కుమార్,ఆర్ఐ శరత్ తదితరులు ఉన్నారు.

# నల్గొండ జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ విజయవంతం

## 12,283 కేసులు పరిష్కారం




**నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 12,(జనం సాక్షి):**
రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, నల్గొండ ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కోర్టు ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా నిర్వహించారు. ప్రజల సౌకర్యార్థం జిల్లా వ్యాప్తంగా 14 లోక్ అదాలత్ బెంచిలను ఏర్పాటు చేశారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 12,283 పెండింగ్, ప్రీ-లిటిగేషన్ కేసులకు పరిష్కారం లభించింది. ఇందులో 33 సివిల్ కేసులు, 2,813 క్రిమినల్ కేసులు, 68 మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, 9,281 ట్రాఫిక్ చలాన్ కేసులు, 77 బ్యాంకు రికవరీ కేసులు, 11 సైబర్ క్రైమ్ కేసులు పరిష్కరించినట్లు అధికారులు తెలిపారు. మోటార్ వాహన ప్రమాద బీమా కేసుల్లో బాధితులకు రూ.7,62,44,348 నష్టపరిహారం ఇప్పించారు. బ్యాంకు రికవరీ కేసుల్లో రూ.62,17,000, ట్రాఫిక్ చలాన్ కేసుల్లో రూ.31,32,180, సైబర్ క్రైమ్ కేసుల్లో రూ.1,17,262 రికవరీ చేయించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ శ్రీ పి. వసంత్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి హిమబిందు గొల్ల, ఇతర న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ. సతీష్ కుమార్, బి. అశోక్ కుమార్, న్యాయవాదులు, బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్, ఇతర ఫైనాన్స్ సంస్థల అధికారులు, కక్షిదారులు, సిబ్బంది పాల్గొన్నారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఒకే రోజు వేలాది కేసులకు పరిష్కారం లభించడం విశేషం.

# భద్రకాళి బండ్ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి


- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 12 (జనం సాక్షి) :** భద్రకాళి బండ్‌ను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. శనివారం భద్రకాళి బండ్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటికే పూర్తయిన బండ్ అభివృద్ధి పనుల నాణ్యతను పరిశీలించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడంపై అధికారులకు పలు సూచనలు చేశారు. భద్రకాళి బండ్ అభివృద్ధిలో భాగంగా గ్రానైట్ పనులు, పాత్‌వేలు, గ్రీనరీ, లైటింగ్, డ్రైనేజీ తదితర పనులు పూర్తయినట్లు అధికారులు జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ భద్రకాళి బండ్ కు సంబంధించిన అభివృద్ధి పనులలో మిగిలి ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భద్రకాళి బండ్ పరిసర ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్రదేశాలను గుర్తించి విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. పచ్చదనాన్ని పెంపొందిస్తూ గ్రీనరీని మరింత ఆకర్షణీయంగా అభివృద్ధి చేయాలని, సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భద్రకాళి బండ్‌ను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసే లక్ష్యానికి అనుగుణంగా చేపట్టిన అన్ని పనులను సమన్వయంతో, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్‌ఈ రాజ్ కుమార్, ఈఈ రవి కుమార్, డీఈలు, ఏఈలు, హార్టికల్చర్ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

# చేయూత అప్లికేషన్ల జాతర

- జిల్లాలో మొత్తం చేయూత అప్లికేషన్లు 4239...
- వెరిఫికేషన్ ముగియడం తోనే కొత్త చేయూత...
- పింఛన్లు 25 లోపు వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి....
- అధికారులను ఆదేశించిన ప్రభుత్వం....



**ములుగు బ్యూరో, సెప్టెంబర్12(జనం సాక్షి):** ములుగు జిల్లా వ్యాప్తంగా చేయూత పింఛన్ల ఆన్లైన్ ప్రక్రియ కొనసాగుతుంది. ఇప్పటికే ప్రభుత్వం చేయూత పింఛన్లు ఆన్లైన్ చేసుకోవడం కోసం గడువు కూడా పెంచడం జరిగింది. చేయూత కొత్త పింఛన్ల మంజూరుకు క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభించడం జరిగింది. జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా పారదర్శకంగా వెరిఫికేషన్ జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈనెల 25 లోపు వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశించింది.

**పింఛన్ల వెరిఫికేషన్ కు ప్రత్యేక అధికారుల నియామకం.....**

గ్రామీణ ప్రాంతాల్లో చేయూత పింఛన్లు వెరిఫికేషన్ కొరకు ఎంపీడీవో లు, ఎంపీఓ లు ఇతర మండల స్థాయి అధికారులు సూపర్డెంట్ స్థాయి, అంతకంటే పై స్థాయి అధికారులను ప్రభుత్వం నియమించింది. మున్సిపాలిటీలలో సూపర్డెంట్లు లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, ప్లానింగ్ అధికారులు, సీనియర్ అసిస్టెంట్ స్థాయి, పై స్థాయి అధికారులను వెరిఫికేషన్ కోసం నియమించారు.

**తుది జాబితా కు కలెక్టర్ ఆమోదం.....**

పింఛన్లకు అప్లై చేసుకున్న అభ్యర్థులు అప్లై చేసుకున్న డాక్యుమెంట్స్ తప్పనిసరిగా ఉండాలని, అప్లికేషన్ పూర్తి అయిన తర్వాత కూడా ప్రతి ఒరిజినల్ డాక్యుమెంట్ ను అధికారులు వెరిఫికేషన్ చేయడం జరుగుతుందనీ, కింద స్థాయి అధికారులు వెరిఫికేషన్ పూర్తయిన తర్వాతనే జిల్లా కలెక్టర్ ఆమోదం తో కొత్త పింఛన్లు మంజూరు కు ఉత్తర్వులు ఇవ్వడం జరుగుతుంది.

జిల్లాలో మొత్తం వితంతుల అప్లికేషన్లు 2704, ఒంటరి మహిళ 491, వికలాంగులు 888, నేత కార్మికులు 49, గీత కార్మికులు 107 మొత్తం జిల్లా చేయూత అప్లికేషన్లు 4239 దరఖాస్తులకు ఆన్లైన్ చేయడం జరిగిందనీ జిల్లా అధికారులు తెలిపారు.

**ములుగు జిల్లా లో చేయూత వివరాలు....**

| క్ర.సం. | మండలం | వితంతువులు | ఒంటరి మహిళలు | వికలాంగులు | నేత కార్మికులు | గీత కార్మికులు | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|
| 1 | ఏటూరు నాగారం | 293 | 54 | 87 | 1 | 23 | 458 |
| 2 | గోవిందరావుపేట | 340 | 52 | 111 | 20 | 9 | 532 |
| 3 | కన్నాయిగూడెం | 45 | 8 | 22 | 0 | 0 | 75 |
| 4 | మల్లంపల్లి | 141 | 17 | 65 | 9 | 6 | 238 |
| 5 | మంగపేట | 43 | 81 | 154 | 0 | 0 | 668 |
| 6 | ములుగు | 255 | 21 | 100 | 10 | 6 | 392 |
| 7 | ములుగు మున్సిపాల్టీ | 121 | 33 | 67 | 7 | 4 | 232 |
| 8 | తాడ్వాయి | 207 | 29 | 53 | 0 | 12 | 301 |
| 9 | వెంకటాపూర్ | 256 | 23 | 82 | 2 | 46 | 409 |
| 10 | నూగూరు వెంకటాపురం | 301 | 96 | 87 | 0 | 1 | 485 |
| 11 | వాజేడు | 312 | 77 | 60 | 0 | 0 | 449 |

# జాతీయ లోక్ అదాలత్ ప్రారంభించిన న్యాయమూర్తులు



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 12 (జనం సాక్షి) :** జాతీయ వ్యాప్తంగా నిర్వహించతలపెట్టిన మూడవ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని, వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ- వరంగల్ చైర్ పర్సన్స్ బి.వి.నిర్మలా గీతాంబ, యం.రామకృష్ణ సునీత శనివారం న్యాయ సేవా సదనం భవనములో "జాతీయ లోక్ అదాలత్" ను ప్రారంభించారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో వరంగల్, హన్మకొండ జిల్లాల న్యాయమూర్తులు, వరంగల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎన్.శ్వేత, వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ - కార్యదర్శి కందుకూరి.పూజ, హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంచార్జి కార్యదర్శి రామలింగం, ఇతర న్యాయమూర్తులు, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయవాదుల సంఘం అధ్యక్షులు సి.హెచ్. ఉపేందర్, సి.హెచ్.రామక్రిష్ణ మరియు డి.సి.పి. ధార కవిత, ఉభయ జిల్లాల రెవెన్యూ అధికారులు, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయవాదుల సంఘం అధ్యక్షులు చకిలం.ఉపేందర్, చొల్లేటి.రామకృష్ణ, ఇతర న్యాయవాదులు, లోక్ అదాలత్ బెంచ్ మెంబర్లు, వివిధ బ్యాంకు, ఇన్సూరెన్స్ అధికారులు మరియు కక్షిదారులు పాల్గొన్నారు.

# రామప్పను సందర్శించిన గ్రూప్ 2 శిక్షణ అధికారులు





**వెంకటాపూర్ (రామప్ప), సెప్టెంబర్ 12(జనం సాక్షి):** వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయాన్ని హైదరాబాద్ లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న గ్రూప్ 2 అధికారులు భారత్ దర్శన్ లో భాగంగా శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ వారికి ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కాగా, వారికి అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్య కిరణ్, టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ లు ఆలయ చరిత్ర, శిల్పకళ వైభవం గురించి వివరించారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి చెరువు లో బోటింగ్ చేశారు. వారి వెంట ఈవో ఇమ్మడి భాస్కర్, ఎంసిహెచ్ఆర్డి అధికారులు, టూరిస్ట్ పోలీసులు అరుణ్, శ్రీకాంత్, రెవెన్యూ, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.

**రామప్ప దేవాలయంను సందర్శించిన నాగపూర్ రైల్వే ఏస్పీ**

మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయంను శనివారం నాగపూర్ రైల్వే ఏస్పీ మంగేష్ షిండే కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరిశ్ శర్మ, ఉమాశంకర్ లు వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ మండపంలో ఆలయ కారయనిర్వహణ అధికారి ఇమ్మడి భాస్కర్ స్వామి వారి శేషావస్త్రలను అందజేశారు . ఆలయ చరిత్ర, శిల్పకళ ప్రాముఖ్యత గురించి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ వారికి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ రామప్ప శిల్పకళ అద్భుతం అని అన్నారు. అనంతరం రామప్ప చెరువు సందర్శించి బోటింగ్ చేశారు. వారి వెంట ఎస్స చల్ల రాజు, టూరిస్ట్ పోలిసులు అరుణ్, శ్రీకాంత్, దేవాదాయ, పురావస్తు, టూరిజం శాఖల సిబ్బంది ఉన్నారు.



# మాజీ ఓఎస్డి సుమంత్ తండ్రికి కొండ సురేఖ పరామర్శ

**వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 12 (జనం సాక్షి) :** మాజీ మంత్రి కొండా సురేఖ మాజీ ఓ ఎస్ డి సుమంత్ తండ్రి నార్ల సుబ్రహ్మణ్యం ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కొండా సురేఖ శనివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితుల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చికిత్స అందించాలని కోరారు. అలాగే కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని చెప్పారు.

# డిజిటల్ సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 12 ( జనం సాక్షి) :** ఖిలా వరంగల్‌లోని స్తంభంపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న డిజిటల్ సర్వే పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా డిజిటల్ సర్వేలో భాగంగా చేపడుతున్న భూముల వివరాల నమోదు, మ్యాప్‌లోని వివరాలకు, క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న డిజిటల్ సర్వేకు మధ్య ఉన్న వ్యత్యాసాలను కలెక్టర్ పరిశీలించారు. సర్వే ప్రక్రియలో వినియోగిస్తున్న సాంకేతికత, భూముల హద్దులు, వివరాల నమోదు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ సర్వే పనులను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహిస్తూ, భూముల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మ్యాప్ వివరాలు, క్షేత్రస్థాయి పరిస్థితులకు మధ్య వ్యత్యాసాలు ఉన్నట్లయితే వాటిని నిశితంగా పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్వే ప్రక్రియను సమన్వయంతో, పారదర్శకంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో వరంగల్ ఆర్డీవో సుమ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ రావు, ఖిలా వరంగల్ తహసిల్దార్ ఇక్బాల్, స్తంభంపల్లి గ్రామ రైతులు తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# గ్యాస్ ఏజెన్సీని జిల్లాకేంద్రానికి తరలించొద్దు

- రోడ్డుపై టిఆర్ఎస్ శ్రేణుల ధర్నా



**మహదేవపూర్, సెప్టెంబర్ 12 (జనంసాక్షి):** మహదేవపూర్ మండల కేంద్రంలో ఉన్న గ్యాస్ ఏజెన్సీని భూపాల్ పల్లి జిల్లా కేంద్రానికి తరలించే ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో శనివారం మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళ నాయకురాలు భారీ నినాదాలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీపతి బాబు. నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కేదారి గీత మాట్లాడుతూ. మహదేవపూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న గ్యాస్ ఏజెన్సీని జిల్లా కేంద్రానికి తరలించవద్దని. మారుమూల ప్రాంతంలో నివసించే గ్రామీణ ప్రజలు గ్యాస్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని గ్యాస్ గోదాంను యధావిధిగా మహదేవపూర్ లో కొనసాగించాలని ప్రజల ఇబ్బందిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే స్పందించి గ్యాస్ ఏజెన్సీని తరలింపు ప్రతిపాదనను విరమించుకోవాలని లేనిపక్షములో ప్రజలను సమీకరించి మరింత పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బిఆర్ఎస్ పార్టీ నాయకులు అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీపతి బాబు. కేదారి గీత. ఎండి హాలీంఖాన్. పోత వెంకటస్వామి. కలికోట దేవేందర్. తోట సుధాకర్. అన్నమనేనిఅరుణ. స్వప్న. కూర తోట రాకేష్. వెన్నంపల్లి మహేష్ జక్కయ్య. రాజశేఖర్. శీలం లక్ష్మన్. చిలక రమేష్. చింతకుంట్ల సతీష్. తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



**దుగ్గొండి, సెప్టెంబర్ 12 (జనం సాక్షి):** దుగ్గండి మండలం గిర్నిబావి గ్రామా నికి చెందిన గిన్నె కట్ట స్వామి (57) పండ్ల వ్యాపారి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుని భార్య సరస్వతి స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. గిర్నిబావి గ్రామానికి చెందిన కట్టస్వామి పండ్ల వ్యాపారం చేస్తూ పొట్ట పోసుకొనేవాడు. ప్రతిరోజు లాగే తన వ్యాపారం ముగించుకొని ఇంటికి వెళుతున్న క్రమంలో నర్సంపేట వరంగల్ ప్రధాన రహదారి రోడ్డు నుండి రోడ్డు దాటుతుండగా నర్సంపేట నుండి వేగంగా వచ్చిన కారు వెనక నుండి ఢీకొట్టడంతో కట్ట స్వామికి తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కట్ట స్వామి మృతి చెందినట్లు ప్రత్యక్ష సాక్షులు వివరించారు. మృతుని భార్య సరస్వతి స్థానిక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తన భర్త మృతికి కారకులపై చర్యలు చేపట్టి న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. దుగ్గొడి ఎస్ఐ రావుల రణధీర్ రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి శవపంచనామ జరిపి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

# అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



**లక్ష్మణ చందా, సెప్టెంబర్ 12 (జనం సాక్షి) :** మండలంలోని రాచాపూర్ గ్రామంలో అప్పుల బాధతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రావణి తెలిపిన వివరాల ప్రకారం రాచాపూర్ గ్రామానికి చెందిన జంబుగా చిన్న పోసులు శనివారం రోజున మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేరు సమయంలో ఉరివేసుకొని చనిపోయినట్టు తెలిపారు. అతని భార్యా గత సంవత్సరం కింద చనిపోయి ఉండటంతో అప్పటినుండి మద్యానికి బానిసై అప్పుల బాధ ఎక్కువై చనిపోయినట్టు తెలిపారు. అతని కుమార్తె రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రావణి తెలిపారు.

# మాదారంలో మందుబాబుల హల్‌చల్

- చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు, వాకర్స్



**తాండూర్, సెప్టెంబర్ 12(జనం సాక్షి) :** మండల పరిధిలోని మాదారంలో ఉన్న వాకింగ్ ట్రాక్ పరిసరాలు ఇటీవల మందుబాబులకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. చీకటి పడితే చాలు ఇక్కడ బహిరంగంగా మద్యం సేవిస్తూ స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. తాగిన అనంతరం ఖాళీ మద్యం సీసాలను వాకింగ్ ట్రాక్‌పైనే పగులగొడుతుండటంతో, ఉదయాన్నే వాకింగ్, జాగింగ్ కోసం వచ్చే సింగరేణి విశ్రాంత కార్మికులు, సీనియర్ సిటిజన్లు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పగిలిన సీసాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వాకర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే స్థానిక పోలీస్ అధికారులు స్పందించి, రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహించి, ఇక్కడ విచ్చలవిడిగా మద్యం సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, శాంతిభద్రతలను కాపాడాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఎడతెరిపి లేని వర్షం.. రైతన్న ముఖంలో చిరునవ్వు

**గోవిందరావుపేట, సెప్టెంబర్ 11( జనం సాక్షి):** నింగి చిల్లులు పడినట్లుగా గోవిందరావుపేట మండలంలో శనివారం ఏకధాటిగా రెండు గంటలపాటు వర్షం దంచికొట్టింది. ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులతో ఎండిపోతున్న వరి చేలను చూసి దిగులు చెందుతున్న రైతన్న మోములో ఈ వాన చిరునవ్వు తెప్పించింది. కొద్ది రోజులుగా ముసురు లేక పంటలు ఎండిపోతున్న తరుణంలో కురిసిన ఈ వర్షం రైతులకు వరంగా మారింది. పొలాల్లోకి వరద నీరు చేరడంతో వరి చేలకు జీవం వచ్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ వానతో కనీసం పదిహేను రోజులపాటు పంటకు ఢోకా లేదని, చేలు పచ్చగా ఉంటాయని అంటున్నారు. మండలం లో ఇలానే మరో మూడు రోజులు వర్షం కురిస్తే చెరువులు, కుంటలు నిండి భూగర్భ జలాలు పెరిగి, రెండు పంటలకు నీటి కొరత తీరుతుందని రైతులు ఆశిస్తున్నారు. వరుణుడు ఇలాగే కరుణించాలని రైతులు కోరుకుంటున్నారు.

# లోక్ అదాలత్‌లో 3500 కేసుల పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. వీరయ్య




**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** రాజీమార్గంతో ఇరు వర్గాల వారు వారి కేసుల నుంచి విముక్తి పొందడానికి రాజీమార్గమే రాజ మార్గమని, దేశ ఉన్నత న్యాయస్థానం ఆదేశానుసారం జిల్లా, తాలూకా స్థాయిలో లోక్ అదాలత్ నిర్వహించినట్లు మంచిర్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీరయ్య తెలిపారు. శనివారం నాడు మంచిర్యాల జిల్లాలోని అన్ని న్యాయస్థానాలలో జాతీయ లోక్ అదాలత్ లు నిర్వహించగా మొత్తం కేసులు 3500 పైగా పరిష్కరించామని తెలిపారు. మంచిర్యాల జిల్లా మొత్తంగా లోక్ అదాలత్ నిర్వహించామని మొత్తంగా 9 లోక్దాలత్ బెంచ్ లను ఏర్పాటు చేసినామని ఈ లోకాదాలత్ వలన కక్షిదారులు సమయం వృధా కాకుండా అప్పిల్లేకుండా, ఇరు వర్గాల వారు గెలిచినట్టుగా అంతిమ తీర్పుగా ఉంటుందని తెలిపారు. మొత్తం కేసులలో సివిల్ ధావాలు 32 క్రిమినల్ కేసులు 3300 పైగా ఇతర కేసులు, సైబర్ క్రైములు 2 లొ ఆర్ ఎస్. 17,000 . బ్యాంకు ప్రిలిటిగేషన్ కేసులు 16లో రూ 984000, ఇతర కేసులతో కలిపి మొత్తం 3500కేసులు పరిష్కరించామని తెలిపినారు ఈ కార్యక్రమంలో కార్యదర్శి జిల్లా న్యాయ సేవా సంస్థ జి.కవిత మరియు ఏ నిర్మల . సీనియర్ సివిల్ జడ్జ్ రామ్మోహన్ రెడ్డి , బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్త సత్తయ్య సభ్యులు పోలీసులు లైజన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టుగా ప్రజాసేవలో కొనసాగుతా!

- మానవ హక్కుల కమిటీ బాధ్యతలకు రాథోడ్ రమేష్ రాజీనామా



**ఆసిఫాబాద్/కెరమెరి, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా మానవ హక్కుల కమిటీ బాధ్యతలకు రాథోడ్ రమేష్ రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన గురువారం రాష్ట్ర అధ్యక్షులకు తన రాజీనామా లేఖను పంపారు. కెరమేరి మండలం బోరిలాల్ గూడ గ్రామానికి చెందిన రాథోడ్ రమేష్ గత కొంతకాలంగా జిల్లా మానవ హక్కుల కమిటీలో క్రియాశీలకంగా పనిచేస్తూ, పేదల హక్కుల కోసం పోరాడుతున్నారు. అయితే తాను జనంసాక్షి దినపత్రికలో విలేకరిగా పనిచేస్తున్న నేపథ్యంలో, జర్నలిజం నిబంధనల ప్రకారం ఒకేసారి రెండు బాధ్యతల్లో కొనసాగడం సరికాదని భావించి, మానవ హక్కుల కమిటీ బాధ్యతలకు స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాథోడ్ రమేష్ మాట్లాడుతూ... "మానవ హక్కుల కమిటీలో పనిచేసిన కాలంలో నాకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. నేను ఏ పదవిలో ఉన్నా లేకున్నా పేద ప్రజల పక్షాన నా పోరాటం ఆగదు. ఇకపై పూర్తిస్థాయిలో జర్నలిస్టుగా, నా కలం ద్వారానే ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, న్యాయం జరిగే వరకు పోరాడుతాను" అని స్పష్టం చేశారు. నిజమైన జర్నలిస్టుగా ప్రజల పక్షాన నిలబడటమే తన లక్ష్యమని, ఎలాంటి బెదిరింపులకు భయపడేది లేదని ఆయన అన్నారు. రాథోడ్ రమేష్ నిజాయితీ, ప్రజల పట్ల ఉన్న చిత్తశుద్ధిని పలువురు ప్రశంసిస్తున్నారు. ఆయన భవిష్యత్తులో జర్నలిస్టుగా మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.

జనంసాక్షి www.janamsakshi.org
ఆదివారం
13 సెప్టెంబర్ 2026

# విజిలెన్స్ అవగాహనకు సామర్థ్య నిర్మాణం

### ప్రభుత్వ సేకరణ, ఒప్పందాల నిర్వహణ, సైబర్ భద్రతపై అధికారులకు అవగాహన

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (జనంసాక్షి):** విజిలెన్స్ అవగాహన ప్రచారంలో భాగంగా కేంద్ర విజిలెన్స్ కమిషన్ మార్గదర్శకత్వంలో గుర్తించిన కీలక అంశాలపై ఎన్ఎండీసీ విజిలెన్స్ విభాగం రెండు రోజుల సామర్థ్య నిర్మాణ కార్యక్రమాన్ని నిర్వహించింది. సెప్టెంబర్ 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్ఎండీసీకి చెందిన వివిధ ప్రాజెక్టులు, ప్రధాన కార్యాలయం నుంచి సుమారు 55 మంది అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ సేకరణ, ఒప్పందాల నిర్వహణ, సైబర్ భద్రత తదితర అంశాలపై ప్రముఖ నిపుణులు విశ్లేషణాత్మక, పరస్పర చర్చలతో కూడిన సమావేశాలను నిర్వహించారు. కార్యక్రమ ప్రారంభంలో ఎన్ఎండీసీ డైరెక్టర్ (ఉత్పత్తి) జయదీప్ దాస్ గుప్తా, ఎన్ఎండీసీ ప్రధాన విజిలెన్స్ అధికారి సి. నీలకంఠ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.



సెప్టెంబర్ 10న ప్రభుత్వ ఈ-మార్కెట్ ప్రదేశం అదనపు ముఖ్య కార్యనిర్వహణ అధికారి కన్వల్‌ప్రీత్ ప్రభుత్వ కొనుగోళ్లకు సంబంధించిన కొత్త విధానాలు, సౌకర్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఐఆర్‌కాన్ మాజీ సీఎండీ, ఏజేఎన్ఐఎఫ్ఎంలో అధ్యాపకుడు ఎం.కె. సింగ్ ప్రభుత్వ సేకరణ విధానాలపై తన అనుభవాలను, ఆచరణాత్మక అంశాలను వివరించారు. రెండో రోజు కూడా రెండు అవగాహనాత్మక, పరస్పర చర్చల సమావేశాలు జరిగాయి. ఎం.కె. సింగ్ ప్రభుత్వ సేకరణతో పాటు ఒప్పందం కుదిరిన అనంతరం దాని నిర్వహణకు సంబంధించిన అంశాలను కేసుల అధ్యయనాలతో వివరించారు. సీ-డాక్ శాస్త్రవేత్త హరీష్ ఆర్ సైబర్ భద్రత, సైబర్ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. డిజిటల్ కార్యాలయాల్లో సురక్షిత విధానాలను పాటించాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. ఎన్ఎండీసీకి చెందిన వివిధ ప్రాజెక్టులు, ప్రధాన కార్యాలయం నుంచి నామినేట్ అయిన అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పరస్పర చర్చలు, ఆచరణాత్మక కేసుల అధ్యయనాలు, అనుభవాల పంచుకోవడం ద్వారా ప్రభుత్వ సేకరణ విధానాలు, సమర్థవంతమైన ఒప్పందాల నిర్వహణ, సైబర్ భద్రతపై పాల్గొన్న వారి అవగాహన మరింత బలోపేతమైంది. సంస్థవ్యాప్తంగా అవగాహన, సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు పారదర్శకత, సమగ్రత, జవాబుదారీతనాన్ని ప్రోత్సహించేందుకు ఎన్ఎండీసీ విజిలెన్స్ విభాగం చేపడుతున్న నిరంతర కార్యక్రమాల్లో భాగంగానే ఈ సామర్థ్య నిర్మాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవం-2026 వరకు, అలాగే ప్రచార కార్యక్రమం కొనసాగుతున్నంతకాలం వివిధ అవగాహన, సామర్థ్య పెంపుదల కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.



# డిమాండ్లు పరిష్కరించే వరకు రైస్ మిల్లులు బంద్

### మిల్లులకు తాళాలు వేసి.. అధికారులకు తాళంచెవుల అప్పగింత
### ఉద్యమ మార్గదర్శి సయ్యద్ రఫీకి నమూనా తాళంచెవి అందజేసిన మిల్లర్లు

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (జనంసాక్షి):**

తెలంగాణలో రైస్ మిల్లింగ్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, సీఎంఆర్ ఏకపక్ష ఒప్పందాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ రైస్ మిల్లర్లు చేపట్టిన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేశారు. తమ న్యాయబద్ధమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు రైస్ మిల్లులను నిరవధికంగా మూసివేయాలని నిర్ణయించినట్లు రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్రం ప్రకటించింది.

ఆగస్టు 7న హైదరాబాద్‌లోని సురవరం ప్రతాప్‌రెడ్డి ఆడిటోరియంలో రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో మిల్లింగ్ రంగ సమస్యలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉద్యమ మార్గదర్శి సయ్యద్ రఫీ సూచనలు, సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో 'రైస్ మిల్లర్ భద్రతే--రైతుకు భవిష్యత్తు' అనే నినాదంతో ప్రభుత్వంపై పలు డిమాండ్లు ఉంచారు. సీఎంఆర్ ఏకపక్ష ఒప్పందాన్ని సవరించి, రైస్ మిల్లింగ్ వ్యవస్థ కుప్పకూలకుండా పరిరక్షించాలని కోరారు.

అనంతరం కూడా మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి ఆవేదనను పలుమార్లు మీడియా ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు సంఘం తెలిపింది. న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు సానుకూల స్పందన రాకపోవడంతో మిల్లర్లు నిస్సహాయ పరిస్థితికి చేరుకున్నారని పేర్కొంది. ఈ నేపథ్యంలో గతంలో ప్రకటించిన నిర్ణయం మేరకు తెలంగాణలోని అన్ని జిల్లాల రైస్ మిల్లర్లు తమ మిల్లులకు తాళాలు వేసి, తాళంచెవులను సంబంధిత కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లు, రెవెన్యూ డివిజన్ అధికారులకు ప్రతీకాత్మకంగా అప్పగించినట్లు తెలిపింది. రాష్ట్రంలోని మిల్లర్లందరి తరపున




ఉద్యమ స్ఫూర్తికి, ఐక్యతకు ప్రతీకగా ఒక నమూనా తాళంచెవిని సయ్యద్ రఫీకి అందజేసినట్లు సంఘం వెల్లడించింది. రైస్ మిల్లర్ల ఉద్యమానికి సంబంధించిన ప్రధాన 13 డిమాండ్లను ప్రత్యేకంగా అనుబంధంగా జతచేసినట్లు తెలిపింది. ఈ డిమాండ్లు కేవలం రైస్ మిల్లింగ్ పరిశ్రమ పరిరక్షణకే పరిమితం కాకుండా రైతుల ప్రయోజనాలు, వేలాది మంది కార్మికుల ఉపాధి, రాష్ట్ర ఆహార ధాన్యాల నిర్వహణ వ్యవస్థ, ఆహార భద్రతకు సంబంధించిన కీలక అంశాలతో ముడిపడి ఉన్నాయని సంఘం పేర్కొంది. ప్రభుత్వం తమ న్యాయబద్ధమైన డిమాండ్లను పూర్తిగా నెరవేర్చే వరకు తెలంగాణలోని రైస్ మిల్లులు నిరవధికంగా బంద్‌లో కొనసాగుతాయని రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్రం స్పష్టం చేసింది. ఉద్యమ లక్ష్యం నెరవేరే వరకు సయ్యద్ రఫీ అందించే సలహాలు, సూచనలు, మార్గదర్శకత్వాన్ని పాటిస్తూ ఐక్యంగా, శాంతియుతంగా పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపింది. ఉద్యమానికి ఇప్పటివరకు అందిస్తున్న సహకారం, మార్గదర్శకత్వం, నైతిక మద్దతును భవిష్యత్తులోనూ కొనసాగించాలని సయ్యద్ రఫీని సంఘం కోరింది.

# అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఇద్దరు డ్రైవర్ల పట్టువేత



**మాడ్గులపల్లి, సెప్టెంబరు 12( జనం సాక్షి):** అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని, ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నట్లు మాడ్గులపల్లి ఎస్సై సురేష్ తెలిపారు శుక్రవారం రాత్రి సుమారు 09:30 గంటల సమయంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, ఇసుక లోడుతో వస్తున్న రెండు ట్రాక్టర్లను తనిఖీ చేశారు ఈ రవాణాకు ఎటువంటి అనుమతులు లేకపోవడంతో డ్రైవర్లు దాసరి గణేశ్ (కల్వలపాలెం), వీరబోయిన గురుస్వామి (సల్కనూర్)లను పట్టుకున్నారు నిందితులపై చట్టరీత్యా తగిన చర్యల కోసం నల్గొండ మైనింగ్ శాఖ అధికారులకు నివేదిక పంపినట్లు ఎస్సై వెల్లడించారు అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు మండలంలో ఎక్కడైనా అక్రమ ఇసుక రవాణా జరిగితే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని కోరారు.

# అధిక బొగ్గు ఉత్పత్తికి సవరించిన లక్ష్యాల మేరకు ఓబీ తొలగించాలి

### రోజుకి ఆఫ్ లోడింగ్ ద్వారా 12.1 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగింపే లక్ష్యం
### అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లకు సీఎండీ డా. బుద్ధప్రకాష్ జ్యోతి దిశానిర్దేశం

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 12 (జనం సాక్షి):** రాష్ట్ర విద్యుత్ అవసరాలకు తగినంత బొగ్గును అందించాల్సి ఉన్నందున దీని కోసం సవరించిన ఓవర్ బర్డెన్ లక్ష్యాలను రోజువారీగా సాధించాలని సింగరేణి సీఎండీ డా. బుద్ధప్రకాష్ జ్యోతి అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లకు దిశానిర్దేశం చేశారు. శనివారం ఆయన సింగరేణి వ్యాప్తంగా 15 ఓపెన్ కాస్ట్ గనుల్లో ఓవర్ బర్డెన్ తవ్వి తీసే పనులు నిర్వహిస్తున్న 19 ఆఫ్ లోడింగ్ సంస్థల పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోందని, దీనికి అనుగుణంగా సింగరేణి సంస్థ తన వంతుగా తగినంత బొగ్గును థర్మల్ విద్యుత్తు కేంద్రాలకు సరఫరా చేసేందుకు ప్రణాళికలు అమలు జరుపుతోందని, దీనికి అనుగుణంగా ఓపెన్ కాస్ట్ గనుల్లో సవరించిన ఓబీ తొలగింపు లక్ష్యాలను సాధించాల్సిన అవసరం ఉందని ఆయన కోరారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుండి ఆగస్టు నెల వరకు 1,205 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ ను తొలగించే లక్ష్యాన్ని నిర్దేశించగా 101 శాతంతో 1,221 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ ను తొలగించడం జరిగిందన్నారు. అయితే మొత్తం 19 ఆఫ్ లోడింగ్ సంస్థలలో ఆగస్టు నెలాఖరు వరకు 8 ఆఫ్ లోడింగ్ సంస్థల వారు మాత్రమే 100 శాతం ఓవర్ బర్డెన్ లక్ష్యాలు సాధించారని, మిగిలిన వారు లక్ష్యాలు సాధిస్తూ సహకరించాలన్నారు. కాగా సెప్టెంబర్ నెలలో నిర్దేశిత రోజువారీ ఓబీ తొలగింపు లక్ష్యం 7.28 లక్షల క్యూబిక్ మీటర్లుగా భావించినప్పటికీ పెరుగుతున్న బొగ్గు




డిమాండ్ కు అనుగుణంగా రోజువారీ లక్ష్యాన్ని 12.1 లక్షల క్యూబిక్ మీటర్లుగా నిర్ణయించామని దీనికి అనుగుణంగా లక్ష్యాలు సాధించాలని కోరారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో ఓవర్ బర్డెన్ తొలగింపు లక్ష్యాలు ఖచ్చితంగా సాధించాలని ఆదేశించారు. జె.వి.ఆర్ ఓ.సి, మణుగూరు ఓ.సి, జి.డి.కె ఓ.సి, ఆర్.జి ఓ.సి-3, ఆర్.జి ఓ.సి-2, కె.టి.కె ఓ.సి-2, శ్రీరాంపూర్ ఓ.సీలలో ఓబి తొలగిస్తున్న కొన్ని ఆఫ్ లోడింగ్ సంస్థల వారు లక్ష్యాల సాధనలో కొంత వెనుకబడి ఉన్నారనీ, వెనుకబడిన లక్ష్యాల సాధనతో పాటు తాజాగా నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని కోరారు. ప్రతీ ఆఫ్ లోడింగ్ సంస్థ ఎన్ని షవల్స్, ఎన్ని డంపర్లు వాడుతున్నాయి? లక్ష్యాల సాధనకు ఎన్ని వాడాల్సి ఉంది.? అనే విషయాన్ని కూడా లోతుగా సమీక్షించారు, ఇంకా కొత్త ఓపెన్ కాస్ట్ గనులకు సంబంధించిన ఓబీ తొలగింపు ఆఫ్ లోడింగ్ టెండర్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను సంస్థ సీఎండీ ఆదేశించారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్య నారాయణ, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎం. తిరుమల రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్ మెంట్) బి. వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్ మరియు మార్కెటింగ్) టి. శ్రీనివాస్ మరియు అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు, కార్పొరేట్ జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

# వినాయక చందా పేర దౌర్జన్యం

### ఆసుపత్రికి వెళుతున్న వ్యక్తిపై దాడి
### ఒకరిపై కేసు నమోదు

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్12 (జనంసాక్షి):** వినాయక చందా ఇవ్వలేదన్న నేపంతో వ్యక్తి పై దాడికి ప్రయత్నించి బెదిరింపులకు పాల్పడిన ఘటన పాల్వంచ మండల పరిధిలోని రంగపురం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం పాల్వంచ పోస్ట్ ఆఫీస్ సెంటర్ కు చెందిన వ్యాపారి గాంధీ లక్ష్మారెడ్డి శుక్రవారం తన 80 ఏళ్ల వృదురాలు అయిన తల్లినీ భద్రాచలం వైపు నుండి పాల్వంచకు ఆస్పత్రికి తీసుకువస్తుండగా మార్గమధ్యలో రంగపురం సెంటర్ కు చేరుకోగానే కొందరు వ్యక్తులు కారుని అడ్డుకున్నారని. కారు వద్దకు వచ్చి ఓ వ్యక్తి వినాయక చందా ఇవ్వాలని డిమాండ్ చేయగా తన తల్లి ఆరోగ్యం బాగాలేదని అత్యవసరంగా ఆసుపత్రికి వెళ్లాలని లక్ష్మారెడ్డి తెలిపినప్పటికీ వినకుండా దౌర్జన్యానికి తెగించి చందా ఇవ్వకపోతే నీ సంగతి చూస్తామని బెదిరింపులకు గురి చేసే దాడికి ప్రయత్నించగా అక్కడ ఉన్న స్థానికులు ఆటో డ్రైవర్ లు గమనించి వెంటనే సదురు వ్యక్తిని పక్కకు తోసివేసి లక్ష్మణ్ రెడ్డిని అక్కడి నుంచి సురక్షితంగా పంపించారని. బాధితుడు దాడికి ప్రయత్నించిన వ్యక్తి రంగపురం గ్రామానికి చెందిన బానోత్ నరేష్ అని తెలుసుకొని అతనిపై శనివారం పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా ఫిర్యాదు స్వీకరించిన ఎస్సై సురేష్ దర్యాప్తు చేసి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# ప్రపంచం గర్వించదగిన మార్క్సిస్టు మేధావి సీతారాం ఏచూరి

### పార్లమెంటులోనూ ప్రజా పోరాటాల్లోనూ కార్మిక కర్షక అణగారిన వర్గాల గొంతుక ఏచూరి
### సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్12 (జనంసాక్షి):** ప్రపంచం గర్వించదగిన మార్క్సిస్టు మేధావి సీతారాం ఏచూరి అని సిపిఎం సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. స్థానిక కమ్మ కళ్యాణ మండపంలో సిపిఎం అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి అమరజీవి సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి సభ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి తమ్మినేని వీరభద్రం, బండారు రవికుమార్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం తమ్మినేని మాట్లాడుతూ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిన ప్రతిసారీ ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించిన గొంతు,లౌకికవాదంపై దాడి జరిగిన ప్రతిసారీ గట్టిగా ప్రతిఘటించిన స్వరం కార్మికులు, రైతులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన ఎర్రజెండా నాయకుడు సీతారాం ఏచూరి అని కొనియాడారు.మార్క్సిజాన్ని కేవలం అధ్యయనం చేయకుండా,ఆ సిద్ధాంతాన్ని ప్రజాజీవితంలో ఆచరణకు తీసుకువచ్చిన దార్శనికుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి అన్నారు.

ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడిగా, మార్క్సిస్టు సిద్ధాంతవేత్తగా దేశ రాజకీయా ల్లో తనదైన ముద్రవేసిన ఏచూరి గురించి తెలియని వారు లేరంటే అతిశయోక్తి కాదనీ తెలిపారు. ప్రజా సమస్యలపై పదునైన వాదన, మార్క్సిజంపై లోతైన అధ్యయనం, ప్రజా ఉద్యమాల పట్ల అచంచలమైన నిబద్ధత ఆయన రాజకీయ జీవితానికి ప్రత్యేక గుర్తింపును తెచ్చాయనీ అన్నారు. రాజకీయ సమానత్వం మరియు సామాజిక-ఆర్థిక అసమానతల మధ్య వైరుధ్యం గురించి, మార్క్సిస్టు దృక్పథం నుంచి కామ్రేడ్ ఏచూరి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన ఒక ముఖ్యమైన హెచ్చరికను తరచూ ప్రస్తావించేవారనీ అన్నారు. 'ఒక వ్యక్తి -- ఒక ఓటు' అనే రాజకీయ సమానత్వం మాత్రమే సరిపోదనీ,అది నిజమైన ప్రజాస్వామ్యంగా మారాలంటే 'ఒక వ్యక్తి -- ఒక విలువ' అనే ఆర్థిక, సామాజిక సమానత్వాన్ని కూడా సాధించాల్సి ఉంటుందనీ తెలిపారు. అంటే ప్రతి వ్యక్తికి ఓటు విలువ సమానంగా ఉండటమే కాకుండా సమాజంలో అతని జీవితం, శ్రమ, హక్కులు, అవకాశాలకు కూడా సమాన విలువ ఉండాలనీ ఏచూరి సూచించారని అన్నారు. ప్రజాస్వామ్యం కోసం జరిగే పోరాటం వర్గపోరాటంతో విడదీయ రానిదని ఏచూరి బోధించేవారన్నారు. అందువల్ల కార్మికవర్గానికి సాధికారత కల్పించడం, వ్యవసాయ కార్మికుల హక్కులను పరిరక్షించడం, యువతకు విద్య, ఉపాధి కల్పించడం, ప్రభుత్వ నిధులతో నాణ్యమైన విద్య అందించడం, ప్రజలకు అందుబాటులో ఉండే ఆరోగ్య సేవలు కల్పించడం, ఉపాధి అవకాశాలు విస్తరించడం, మహిళా సాధికారతను సాధించడం వంటి అంశాలు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి అవసరం అని తన విలువైన భావనలు ప్రత్యామ్నాయ విధానాలతో భారత రాజకీయ ముఖ చిత్రంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించాడనీ తెలిపారు.ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడం, లౌకిక ప్రజాస్వామ్య భారతదేశ పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడటం కామ్రేడ్ సీతారాం ఏచూరికి మనం అర్పించే నిజమైన నివాళి అన్నారు. ప్రజాస్వామ్య భారత దేశాన్ని,లౌకిక విలువలు కాపాడటంలో ఏచూరి కీలక పాత్ర పోషించారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చే వరకు పోరాడుతాం




**సూర్యాపేట (జనంసాక్షి):** బుల్లెట్ ట్రైన్ సౌకర్యం ఉన్న చోట విద్యా, వైద్య రంగాలతో పాటు అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయని సూర్యాపేటకు ఇచ్చిన బుల్లెట్ ట్రైన్ కాపాడుకునేందుకు ఉద్యమం కొనసాగిస్తామంటూ పూర్వ విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.శనివారం బుల్లెట్ ట్రైన్ సాధన రిలే నిరాహార దీక్షలో భాగంగా 30వ రోజు అమ్ ఆద్మీ పార్టీ నాయకులు దీక్షలో పాల్గొనగా వారికి సిటీ టాలెంట్ స్కూలు పూర్వ విద్యార్థులు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ చదువుకునేందుకు దూర ప్రాంతం వెళ్లాలంటే విద్యా కంటే ప్రయాణాలే కష్టంగా మారుతున్నాయని అన్నారు.అదే బుల్లెట్ ట్రైన్ సౌకర్యం ఉన్నట్లయితే గంటల వ్యవధిలోనే ప్రధాన నగరాలకు వెళ్లి చదువుని అభ్యసించి ఉద్యోగాలు కొనసాగించుకోవచ్చని తెలిపారు.దీక్షను ఉద్దేశించి మాజీ మార్కెట్ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి మాట్లాడుతూ బుల్లెట్ ట్రైన్ ఉద్యమంలో యువత, విద్యార్థులు భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు దీక్ష శిబిరం వరక ర్యాలీగా తరలివచ్చారు.దీక్షలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు ఇందారపు రాజమల్లయ్య, తన్నీరు వెంకన్న, అంజయ్య, శ్రీనివాస్, రుక్మంబర బాబు గౌడ్, వెలుగు వనిత, శోభారాణి, రవీందర్ నాయక్ పాల్గొన్నారు.వారికి సంఘీభావంగా ధర్మార్జున్, జర్నలిస్టు భూపతి రాములు,సిటీ టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ ప్రకాష్ రెడ్డి, ప్రిన్సిపాల్ మురళీధర్, చల్లమల్ల నరసింహ, మట్టపల్లి సైదులు, నాగయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

# వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠా అరెస్ట్

### 32 గ్రాముల బంగారం స్వాధీనం



**రామన్నపేట (జనంసాక్షి):** బస్టాండ్ లలో రద్దీని ఆసరాగా చేసుకుని ప్రయాణికులకు మత్తు జ్యూస్ తాగించి బంగారు నగలు చోరీ చేస్తున్న నలుగురు సభ్యుల ముఠాను రామన్నపేట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుండి 32.5 గ్రాముల బంగారు పుస్తెలతాడు, 4 తులాల బంగారు నగలు, ఒక కారు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బాపట్ల జిల్లా, చీరాల మండలానికి చెందిన కావడి అలివేలు (45), కర్రెద్దుల మరియమ్మ (33), కావడి మహంకాళి అలియాస్ లక్ష్మి (39), చౌట భాను ప్రసాద్ (24) లు ఒక ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నారు. ఈ నెల 4వ తేదీన ఏపీ 40 క జే ఎక్స్ 6438 నంబర్ గల స్విఫ్ట్ డిజైర్ కారులో చౌటుప్పల్ నుండి బయలుదేరి హయత్ నగర్ లో బస చేశారు.అనంతరం ఈ నెల 7న చౌటుప్పల్ ఆర్టీసీ బస్ స్టాండ్‌లో ప్రయాణికుడికి జ్యూస్‌లో మత్తుమందు కలిపి ఇచ్చి, అతని వద్ద నుండి 7.5 గ్రాముల ఉంగరం, 2.5 గ్రాముల ఉంగరం, 20 గ్రాముల గొలుసులు, రూ.45 వేల నగదు ఎత్తుకెళ్లారు. చౌటుప్పల్‌లో కేసు నమోదైంది. మరుసటి రోజు రామన్నపేట ఆర్టీసీ బస్ స్టాండ్‌లో మరో వ్యక్తి వద్ద నుండి 32.5 గ్రాముల బంగారు పుస్తెలతాడు (విలువ సుమారు రూ.75 వేలు) చోరీ చేశారు. రామన్నపేట పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులు హైదరాబాద్‌లో డబ్బులు పంచుకుని తిరిగి చౌటుప్పల్-రామన్నపేట-చిట్యాల మార్గంలో వస్తుండగా పోలీసులు వాహన తనిఖీల్లో పట్టుకున్నారు. ఈ ముఠాలో మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు సీఐ ఎం. రవి, ఎస్ఐ గోపాతి సతీష్ తెలిపారు. నిందితుల నుంచి ఆభరణాలను, నగదును స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.


# కేటీపీఎస్ ఏడో దశలో పోస్టింగుల్లో అవకతవకలు?

### ఏళ్ల తరబడి ఒకేచోట కొనసాగుతున్న అధికారులపై విచారణ జరపాలి
### బదిలీలు, పదోన్నతుల్లో నిబంధనలు పాటించడం లేదంటూ ఆరోపణలు

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 12 (జనంసాక్షి):** కేటీపీఎస్ ఏడో దశతో పాటు టీజీజెన్‌కో పరిధిలోని వివిధ విద్యుత్ కేంద్రాల ఖాతాల విభాగంలో ఏళ్ల తరబడి కొనసాగుతున్న పోస్టింగ్లు, పదోన్నతుల జాప్యం, పరిపాలనా లోపాలపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు అంబేద్కర్ సేన సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తాలూకా రాజేష్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. సంస్థలో పారదర్శకతను పునరుద్ధరించాలని కోరుతూ టీజీ జెన్‌కో సీఎండీ, మానవ వనరుల విభాగం డైరెక్టర్, ఆర్థిక విభాగం డైరెక్టర్, కేటీపీఎస్ ప్రధాన నిర్వాహకులకు వినతిపత్రం పంపినట్లు తెలిపారు.

**ఏళ్ల తరబడి ఒకేచోట పోస్టింగ్లు..**

సహాయ ఖాతాల అధికారి నుంచి సీనియర్ ఖాతాల అధికారి-1 స్థాయి అధికారులను బదిలీ నిబంధనలకు విరుద్ధంగా ఏళ్ల తరబడి ఒకేచోట కొనసాగిస్తున్నారని ఆరోపించారు. కింది



స్థాయి సిబ్బందిని మాత్రం తరచూ బదిలీ చేస్తూ ఉద్యోగుల మధ్య కుల వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సీనియర్ సహాయకుడు నుంచి సీనియర్ ఖాతాల అధికారి స్థాయి వరకు అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఉద్యోగుల సీనియారిటీ, ప్రతిభ, రిజర్వేషన్ల నిబంధనలను సక్రమంగా అమలు చేయడం లేదని విమర్శించారు.

**ప్రతినియుక్తుల కేటాయింపుపై స్పష్టత ఇవ్వాలి**

పాల్వంచలోని శిక్షణ కేంద్రంలో పోస్టింగ్ ఉన్న ఓ అధికారి కేటీపీఎస్ ఏడో దశలో కొనసాగడంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. అదనపు బాధ్యతల కేటాయింపు వెనుక ఉన్న నిబంధనలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

**సేవా సమస్యల పరిష్కారంలో జాప్యం..**

ఉద్యోగుల సెలవులకు సంబంధించిన వ్యవహారాలు, సేవా నమోదు పుస్తకాలు, ఉద్యోగ సేవా ప్రయోజనాల పరిష్కారంలో అధికారులు ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

**ప్రధాన డిమాండ్లు :** సహాయ ఖాతాల అధికారి నుంచి సీనియర్ ఖాతాల అధికారి-1 స్థాయి అధికారుల ఏళ్ల తరబడి పోస్టింగ్లపై తక్షణమే నిష్పక్షపాత విచారణ జరపాలి. బదిలీల విధానాన్ని టీజీ జెన్‌కోలోని ఉద్యోగులందరికీ సమానంగా వర్తింపజేయాలి. పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను సీనియారిటీ, ప్రతిభ, రిజర్వేషన్ల నిబంధనల ప్రకారం వెంటనే పూర్తి చేయాలి. వివాదాస్పద పోస్టింగ్లు, అదనపు బాధ్యతలు, పదోన్నతుల ఉత్తర్వుల వివరాలను బహిర్గతం చేయాలి. సేవా నమోదు పుస్తకాలు, సెలవుల సమస్యలు, ఇతర పరిపాలనా అంశాలను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలి. టీజీ జెన్‌కో పరిధిలోని అన్ని విద్యుత్ కేంద్రాల్లోని ఖాతాల విభాగాల్లో ఏకరూపమైన, పారదర్శక పాలన అమలు చేయాలి.

ఖాతాల విభాగంలో జరుగుతున్న అక్రమాలపై ఉన్నతాధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని రాజేష్ కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యోగుల హక్కుల సాధన కోసం జాతీయ అంబేద్కర్ సేన ఆధ్వర్యంలో చట్టబద్ధంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

విపణి



## బీఎండబ్ల్యూ కొత్త 7 సిరీస్ కార్ల ఆవిష్కరణ

దిల్లీ: జర్మనీ విలాసకార్ల సంస్థ బీఎండబ్ల్యూ, కొత్త 7 సిరీస్ కార్లను మన దేశంలో విడుదల చేసింది. బీఎండబ్ల్యూ ఫ్లాగ్‌షిప్ సెడాన్ పెట్రోల్, పూర్తి విద్యుత్తు మోడల్ బీఎండబ్ల్యూ ఐ7 ఎం70 కూడా అందుబాటులో ఉంటుంది. 7 సిరీస్ కార్లతో పాటు ఐ7ను కూడా గ్రూప్ చెన్నై ప్లాంట్‌లో తయారు చేస్తామని సంస్థ తెలిపింది. దీంతో జర్మనీ తర్వాత ఐ7ను స్థానికంగా తయారు చేసే దేశంగా భారత్ నిలుస్తుంది. బీఎండబ్ల్యూ ఐ7 ఎం70 మాత్రం పూర్తిగా తయారైన యూనిట్‌గా భారత్‌కు అందుబాటులోకి వస్తుందని వివరించింది. ఈ కార్లను బీఎండబ్ల్యూ ఇండియా డీలర్‌షిప్‌లలో బుక్ చేసుకోవచ్చు. డెలివరీలు 2026 అక్టోబరు నుంచి ప్రారంభం కానున్నాయి. కొత్త బీఎండబ్ల్యూ 740 ఎం స్పోర్ట్, బీఎండబ్ల్యూ ఐ7 ఇ డ్రైవ్ 50 ఎక్స్‌డ్రైవ్ ఎంస్పోర్ట్ మోడళ్ల ఎక్స్-షోరూమ్ ధర రూ.1.95 కోట్లు (ఎక్స్‌షోరూం)గా ప్రకటించింది. కొత్త బీఎండబ్ల్యూ ఐ7 ఎం70 ఎక్స్ డ్రైవ్ ధర రూ.2.65 కోట్లు.ధరలు పెంచుతాం: భారత్‌లో తన మొత్తం వాహన శ్రేణి ధరలను త్వరలో పెంచుతామని బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా ప్రెసిడెంట్, సీఈఓ హర్దీప్ సింగ్ బ్రార్ శుక్రవారం ఇక్కడ తెలిపారు. 2026లోనే మూడు దఫాల్లో కలిపి గరిష్ఠంగా 5% వరకు వాహన ధరలను పెంచినట్లు వెల్లడించారు. కమొడిటీ అధిక ధరలు, రూపాయి విలువ క్షీణత కారణంగా, లాభాలపై ఒత్తిడి ఏర్పడినందునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

# భారీ నష్టాలు తప్పించుకుని..

- ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.931 కోట్లు
- డీఐఐ కొనుగోళ్లు: రూ.1968 కోట్లు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఆరంభ బలహీనతల నుంచి కోలుకున్న సెన్సెక్స్, నిఫ్టీ.. స్వల్ప నష్టాల్లో ముగిశాయి. ముడిచమురు ధరలు కొంతమేర శాంతించడం, ఆఖర్లో ఐటీ, ప్రైవేట్ బ్యాంకుల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడం కలిసొచ్చింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 2 పైసలు తగ్గి 95.54 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడిచమురు ధర 3% తగ్గి 104 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు నష్టాల్లో ముగియగా, ఐరోపా సూచీలు మెరుగ్గా ట్రేడయ్యాయి.బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.17 లక్షల కోట్లు తగ్గి రూ.481.55 లక్షల కోట్ల (5.03 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 593.43 పాయింట్ల నష్టం (క్రితం ముగింపు 74,902.59 పాయింట్లు)తో 74,309.16 వద్ద ప్రారంభమైంది. ఆరంభ ట్రేడింగ్‌లో 742.43 పాయింట్లు కోల్పోయి 74,160.16 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ, అనంతరం కోలుకుంది. చివరకు 120.83 పాయింట్ల నష్టంతో 74,781.76 వద్ద ముగిసింది. నిఫ్టీ 79.70 పాయింట్లు తగ్గి 23,398.10 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 23,231.40- 23,448.10 పాయింట్ల మధ్య కదలాడింది. వారం ప్రాతిపదికన చూస్తే.. సెన్సెక్స్ 1,733.67 పాయింట్లు, నిఫ్టీ 499.6 పాయింట్లు చొప్పున నష్టాలు నమోదుచేశాయి.
సెన్సెక్స్ 30 షేర్లలో 19 నష్టపోయాయి. టాటా స్టీల్ 1.67%, రిలయన్స్ 1.33%, సన్‌ఫార్మా 1.18%, బజాజ్ ఫైనాన్స్ 1.13%, ఎన్‌టీపీసీ 1.10%, పవర్‌గ్రిడ్ 1.07%, ఎల్ అండ్ టీ 1.01% డీలాపడ్డాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.02%, టెక్ మహీంద్రా 1.38%, హెచ్‌సీఎల్ టెక్ 0.85%, ఎటర్నల్ 0.78% లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో.. స్థిరాస్తి 2.69%, లోహ 2.40%, కమొడిటీస్ 1.61%, ఇంధన 1.06%, యుటిలిటీస్ 1%, వాహన 0.88% తగ్గాయి. ఆర్థిక సేవలు, ఐటీ, టెలికాం, బ్యాంకింగ్ పెరిగాయి. బీఎస్ఈలో 2612 షేర్లు నష్టపోగా, 1739 స్క్రిప్‌లు లాభపడ్డాయి. 230 షేర్లలో మార్పులేదు. ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరం ఐడీఏలో ఉన్న అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ అపిటోరియా ఫార్మా ఏపీఐ తయారీ కేంద్రం (యూనిట్-4)లో ఈ నెల 7 నుంచి 11 వరకు యూఎస్ఎఫ్‌డీఏ తనిఖీలు జరిగాయి. ఎలాంటి అభ్యంతరాలూ లేవని సంస్థ వెల్లడించింది. డిజిలాజిక్ సిస్టమ్స్‌కు ప్రభుత్వ రంగంలోని రక్షణ సంస్థ నుంచి రూ.2.30 కోట్ల ఆర్డర్లు లభించాయి. హోమోడైన్, క్యూఎస్ఆర్ఎక్స్, ఈఎస్ఎస్ పరీక్షలకు అవసరమైన ఏటీఈ పరికరాల సరఫరా, ఇన్‌స్టలేషన్, కమిషనింగ్ బాధ్యతలను ఈ సంస్థ డిసెంబరు కల్లా నిర్వహించనుంది.ఎరిస్ లైఫ్‌సైన్సెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఓఓ వి.కృష్ణకుమార్ రాజీనామా చేశారు. ఈనెల 30తో ఆయన పదవీకాలం ముగియనుంది. అనంతరం హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న బయోలాజికల్ ఇ. గ్రూపు సంస్థ బయోఫార్మా సీడీఎంఓ విభాగం బీఈ బయోసోల్‌కు సీఈఓగా బాధ్యతలు చేపట్టనున్నారు.



**రెంటోమోజోకు 73 రెట్లు, కరమ్‌తారాకు 63 రెట్ల స్పందన**

దేశీయ ప్రాథమిక మార్కెట్‌లో పబ్లిక్ ఇష్యూల జోరు కొనసాగుతోంది. ఆన్‌లైన్ ఫర్నిచర్ ప్లాట్‌ఫామ్ రెంటోమోజో ఐపీఓకు 72.88 రెట్ల స్పందన లభించగా, ఇంజినీరింగ్ సంస్థ కరమ్‌తారా ఇష్యూ 62.63 రెట్ల బిడ్‌లను ఆకర్షించింది. రిటెయిల్ విభాగంలో ఈ రెండు సంస్థలు వరుసగా 15.59 రెట్లు, 13.26 రెట్లు చొప్పున స్పందన దక్కించుకున్నాయి.

## మడతబెట్టే ఫోన్..

### యాపిల్ నుంచి రూ.23 వేలు వసూలు చేస్తోన్న శాంసంగ్!

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**"మేం వదిలేసిన పదార్థాలను మీరు వేడిచేయడం పూర్తయితే మాకు చెప్పండి" అంటూ ఐఫోన్ డ్యూయో ఫోన్లను ఉద్దేశించి శాంసంగ్ కౌంటర్ ఇచ్చిన సంగతి తెలిసిందే. తాము ఫోల్డబుల్ ఫోన్లు తీసుకువచ్చిన తర్వాత యాపిల్ వీటిని ఆవిష్కరించడంతో ఈ వ్యాఖ్యలు చేసింది. అయితే.. ఈ ప్రత్యర్థులు ఇద్దరూ కలిసి పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఐఫోన్ డ్యూయో ఫోన్ల డిస్‌ప్లేకు సంబంధించి కీలక స్క్రీన్ విభాగాన్ని శాంసంగ్ అందిస్తోందని సమాచారం. అందుకోసం మూడేళ్లకు ఒప్పందం కుదుర్చుకుందని మీడియా కథనాలు వెల్లడించాయి. ఒక్కో ఇన్నర్ ఫోల్డింగ్ డిస్‌ప్లే ప్యానెల్‌కు 250 డాలర్ల (రూ.23,899) చొప్పున వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నాయి.ఇదే నిజమైతే.. ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లోకి యాపిల్ ప్రవేశించడంలో ఈ ఒప్పందం కీలకమనే చెప్పాలి. ఈ కొత్తరకం ఫోన్లలో ఇన్నర్ డిస్‌ప్లే సాంకేతికంగా ప్రధానమైంది. పదేపదే ఫోన్ మడిచినా.. రంగు ఏమాత్రం చెడకుండా, ఎక్కువకాలం మన్నేందుకు ఉపయోగపడుతుంది. యాపిల్ కు డిస్‌ప్లేలను సరఫరా చేసే కంపెనీలు ప్రస్తుత సాంకేతిక అవసరాలకు తగ్గట్టుగా ఉత్పత్తులను సిద్ధం చేయకపోవడంతో శాంసంగ్‌తో ఒప్పందం చేసుకున్నట్లు కథనాలు పేర్కొన్నాయి. అయితే ఈ వార్తలపై యాపిల్ నుంచి ఎలాంటి ధ్రువీకరణ లేదు.

**గుడ్ల ధరలు**

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| 22 క్యారెట్లు | 24 క్యారెట్లు |
|---|---|
| ₹ 1,64,446 | ₹ 1,79,396 |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,55,000

## 17 నుంచి ఎన్ఎస్ఈ ఐపీఓ

### ధరల శ్రేణి రూ.1700 1785

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) రూ.22,569 కోట్ల తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ), ఈ నెల 17న ప్రారంభమై 21న ముగియనుంది. ఒక్కో షేరుకు ధరల శ్రేణి రూ.1700- 1785 గా నిర్ణయించారు. యాంకర్ మదుపర్లు ఈనెల 16న బిడ్లు దాఖలు చేయొచ్చు. రిటెయిల్ మదుపర్లు కనీసం 8 షేర్లకు (ఒక్కో లాట్‌కు రూ.14,280) దరఖాస్తు చేసుకోవాలి. సెప్టెంబరు 24న బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ (బీఎస్ఈ)లో ఎన్ఎస్ఈ షేర్లు నమోదయ్యే అవకాశం ఉంది. ఎన్ఎస్ఈ ఐపీఓ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో వస్తోంది. ప్రస్తుత వాటాదార్లు దాదాపు 12.64 కోట్ల షేర్లు విక్రయిస్తున్నారు. అంతక్రితం ఆయా సంస్థలు విక్రయించాలనుకున్న 14.9 కోట్ల షేర్ల కంటే ఇవి 15% తక్కువ. ఇందువల్లే ఐపీఓలో సమీకరించే నిధుల మొత్తమూ తగ్గింది. ఐపీఓ గరిష్ఠ ధర ప్రకారం, మొత్తం ఇష్యూ విలువ రూ.22,569 కోట్లు. ఈ నిధులన్నీ వాటాలు విక్రయిస్తున్న సంస్థలకే దక్కుతాయి కానీ, ఎన్ఎస్ఈకి లభించవు. ఎన్ఎస్ఈ విలువ కూడా రూ.4.2 లక్షల కోట్లు అవుతుంది. ఇంతకుముందు అంచనా ప్రకారం ఇది రూ.5 లక్షల కోట్లు అవ్వాలి.ఈ ఇష్యూలో అర్హత కలిగిన సంస్థాగత మదుపర్ల (క్యూఐబీల)కు 50%, సంస్థాగతేతర మదుపర్లకు 15%, రిటెయిల్ మదుపర్లకు 35% కేటాయించారు. అర్హులైన ఉద్యోగుల కోసం రూ.70 కోట్ల విలువైన షేర్లు రిజర్వ్ చేయడంతో పాటు, వారికి ఒక్కో షేరుపై రూ.170 రాయితీ అందిస్తున్నారు. ఐపీఓ తర్వాత ఎన్ఎస్ఈ షేర్లు తమ సొంత ప్లాట్‌ఫామ్‌పై ట్రేడ్ చేసేందుకు, మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి ఎటువంటి అనుమతులు కోరలేదని సంస్థ ఎండీ, సీఈఓ ఆశిష్ కుమార్ చౌహాన్ స్పష్టం చేశారు. ప్రజల పొదుపును మూలధనంగా మార్చాలనే ఎన్ఎస్ఈ వ్యవస్థాపక లక్ష్యం పూర్తిగా నెరవేరిందన్నారు. ఎన్ఎస్ఈలో వాటాలు ఉన్న 26 నమోదిత కంపెనీలకు ఈ ఐపీఓ ద్వారా గణనీయ లబ్ధి చేకూరనుంది. ధరల శ్రేణిలో గరిష్ఠం రూ.1785 ఆధారంగా లెక్కిస్తే.. ఈ 26 కంపెనీల వద్ద ఉన్న ఎన్ఎస్ఈ వాటాల విలువ దాదాపు రూ.94,619 కోట్లు అవుతుంది. ఒక్క లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) వద్ద ఉన్న 26.53 కోట్ల ఎన్ఎస్ఈ షేర్ల (10.72% వాటా) విలువే, రూ.47,351 కోట్లు అవుతుంది. అయితే ఐపీఓలో వాటా విక్రయించకుండా, ఎన్ఎస్ఈలో దీర్ఘకాలిక పెట్టుబడులు కొనసాగించాలని ఎల్ఐసీ నిర్ణయించుకుంది.




రెండో అతిపెద్ద ఐపీఓ
హ్యుందాయ్ మోటార్ ఇండియా (రూ.27,870 కోట్లు) తర్వాత దేశంలో రెండో అతిపెద్ద ఐపీఓగా ఎన్ఎస్ఈ ఇష్యూ నిలవనుంది. 2022లో వచ్చిన ఎల్ఐసీ (రూ.21,000 కోట్లు) ఐపీఓను ఎన్ఎస్ఈ అధిగమించనుంది.

# స్థానిక కరెన్సీల్లో బ్రిక్స్ వాణిజ్యం

- చెల్లింపు వ్యవస్థలను అనుసంధానం చేయండి
- వాణిజ్య మంత్రి గోయల్ సూచన

**దిల్లీ:** బ్రిక్స్ సభ్య దేశాలు తమ చెల్లింపు వ్యవస్థలను అనుసంధానం చేయాలని వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూశ్ గోయల్ పిలుపునిచ్చారు. స్థానిక కరెన్సీల్లో వాణిజ్యానికి ప్రోత్సాహాన్నివ్వాలని, అంతర్జాతీయంగా డిజిటల్ వాణిజ్యానికి ఊతమివ్వాలని సూచించారు. 'బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ 2026' ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'భారత్‌లో డిజిటల్ చెల్లింపులకు మౌలిక వసతుల అభివృద్ధికి గణనీయ చర్యలు తీసుకున్నాం. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలు ఏటా 25,000 కోట్లకు మించి జరుగుతున్నాయి. పరిమాణం పరంగా ప్రపంచంలో సగం డిజిటల్ లావాదేవీలకు ఇవి సమానం. ప్రస్తుతం 11 దేశాల్లో యూపీఐ సేవలందుతున్నాయి. బ్రిక్స్ దేశాలు, భాగస్వామ్య దేశాలు తమ చెల్లింపు వ్యవస్థలను అనుసంధానం చేయాలి. ఒక దేశంలో మరో దేశ కరెన్సీల్లో చెల్లింపులకు వీలు కల్పించాల'ని గోయల్ విజ్ఞప్తి చేశారు. 'సభ్యదేశాలన్నీ తమ ఉత్పత్తులకు మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలి. ఇందుకు నిబంధనావళి సవరించాలి. ముడిపదార్థాలు, కీలక ఖనిజాల విషయంలోనూ ఇలా చేయాలి. అపుడే




సరఫరా వ్యవస్థ బలోపేతమవుతుంది. టారిఫేతర ఆంక్షలుంటే, టారిఫ్ చర్యల కంటే ఎక్కువగా ఎగుమతి వ్యయాలు భారమవుతాయి. వ్యవసాయ-టెక్ అంకురాలకు ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా బ్రిక్స్ దేశాల్లో ఆహార భద్రతకు ఊతమివ్వొచ్చు. వృత్తినిపుణులు సులువుగా సరిహద్దులూ దాటేలా చేయాలి. వ్యవసాయం, ఫార్మా, ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, వాహన, వాహన విడిభాగాలు, సేవల రంగాల్లో భాగస్వామ్యానికి మంచి అవకాశాలున్నాయ'ని గోయల్ అన్నారు. 2003లో బ్రిక్స్ దేశాల నుంచి ఎగుమతులు 900 బి. డాలర్లుగా ఉండగా, 2024 నాటికి 6 లక్షల కోట్ల డాలర్ల (అప్పటి మారకపు విలువ ప్రకారం సుమారు రూ.510 లక్షల కోట్ల)కు చేరాయని గోయల్ గుర్తు చేశారు. అంతర్జాతీయ ఎగుమతుల్లో ఈ దేశాల వాటా రెట్టింపై 24 శాతానికి చేరిందన్నారు.
రష్యా ఎగుమతుల్లో డాలర్లు-యూరో వాటా 11 శాతమే'మూడేళ్ల కిందట రష్యా ఎగుమతుల్లో 85% వరకు డాలర్లు, యూరోల్లో సెటిల్‌మెంట్లు జరిగేవి. ఇపుడు ఆ వాటా 11 శాతానికి పరిమితమైంది. ప్రత్యామ్నాయ అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ఇపుడు కీలకంగా మారింద'ని రష్యా ఆర్థికాభివృద్ధి మంత్రి మాక్సిమ్ రెషెత్నికోవ్ అన్నారు.

**ఐఎమ్ఎఫ్, ప్రపంచ బ్యాంకుల్లో వర్ధమాన దేశాలకు ప్రాతినిధ్యం ఉండాలి: బ్రిక్స్**

అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎమ్ఎఫ్), ప్రపంచ బ్యాంకుల్లో వర్ధమాన దేశాలకు మరింత ప్రాతినిధ్యం ఉండాలని బ్రిక్స్ ఆర్థిక మంత్రులు, కేంద్ర బ్యాంకుల గవర్నర్లు కోరారు. అసమతౌల్య టారిఫ్‌లు, వాణిజ్య చర్యలను తీవ్రంగా తప్పుపట్టారు. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల మధ్య బ్రిక్స్ దేశాల మధ్య ఆర్థిక సహకారం మరింత బలోపేతం కావాలని సంయుక్త ప్రకటనలో ఆకాంక్షించారు. ప్రపంచంలోని 11 పెద్ద ఆర్థిక వ్యవస్థలకు ప్రతిబింబమైన బ్రిక్స్, అంతర్జాతీయ వాణిజ్యంలో 26% వాటా, ప్రపంచ జీడీపీలో 40% వాటా కలిగి ఉన్నందున.. అంతర్జాతీయ ఆర్థిక సంస్థల్లో వీటికి ప్రాధాన్యం పెరగాలని వివరించారు.

## ఫాస్టాగ్ వినియోగదారులకు శుభవార్త..

### వాహనంపై ఉన్న ట్యాగ్ ఎప్పటికీ అలాగే..!





**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
ఫాస్టాగ్ వినియోగదారులకు కేంద్రం శుభవార్త చెప్పింది. ఇకపై ఫాస్టాగ్‌కు అనుసంధానమైన బ్యాంకును మార్చుకోవాలంటే.. వాహనంపై ఉన్న ట్యాగ్‌ను తొలగించి కొత్తది తీసుకోవాల్సిన అవసరం లేదని తెలిపింది. 'వన్‌ట్యాగ్' విధానాన్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ముంబయిలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026లో ప్రారంభించారు. మొబైల్ నంబర్ పోర్టబిలిటీ తరహాలో ఈ సేవ పనిచేస్తుంది. ప్రస్తుత బ్యాంకు సేవలు నచ్చకపోతే మరో బ్యాంకుకు ఫాస్టాగ్ ఖాతాను మార్చుకోవచ్చు. వాహనంపై ఉన్న ట్యాగ్ మాత్రం అలాగే ఉంటుంది. ఈ మార్పు ప్రక్రియను రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌లో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ సహా పలు సంస్థలు ఇప్పటికే ఈ విధానంలో భాగమయ్యాయి.ఫాస్టాగ్ సేవల మార్పులో వాహనదారులకు ఎదురవుతోన్న ఇబ్బందులను తగ్గించడమే వన్‌ట్యాగ్ విధానం లక్ష్యమని గడ్కరీ తెలిపారు. గతంలో బ్యాంకు మార్చాలంటే పాత ఫాస్టాగ్ ఖాతాను మూసివేసి.. కొత్త ట్యాగ్ తీసుకోవాల్సి వచ్చేదని పేర్కొన్నారు.
ప్రక్రియ ఇలా..
1.ప్లే స్టోర్ నుంచి రాజ్‌మార్గ్‌యాత్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని లాగిన్ అవ్వాలి. 2. యాప్‌లో ఫాస్టాగ్/వన్‌ట్యాగ్ సేవను ఎంచుకోవాలి. 3. ప్రస్తుతం ఉన్న ఫాస్టాగ్ వివరాలు నమోదు చేయాలి. 4. బ్యాంకు మార్చే ఆప్షన్‌ను ఎంచుకోవాలి. 5. కొత్తగా ఎంచుకున్న బ్యాంకును ఎంపిక చేసి.. అవసరమైన వివరాలు సమర్పించాలి. 6. ధ్రువీకరణ పూర్తయిన తర్వాత ఫాస్టాగ్ కొత్త బ్యాంకుకు పోర్ట్ అవుతుంది. తదనంతరం వాహనంపై ఉన్న పాత ట్యాగ్‌నే కొనసాగించవచ్చు.

## 48 గంటల్లోపు స్పందించాలి..

### నెలలోపు పరిష్కరించాలి


### వినియోగదారుల ఫిర్యాదులపై ఇ కామర్స్ సంస్థలకు కేంద్రం నిబంధన

దిల్లీ: ప్రతి ఇ-కామర్స్ సంస్థ తమ చట్టబద్ధమైన పేరు, ప్రధాన కార్యాలయం/శాఖల చిరునామా, వెబ్‌సైట్ వివరాలు, కస్టమర్‌కేర్ ఇ-మెయిల్ చిరునామా, ల్యాండ్‌లైన్, మొబైల్ నంబర్‌తో పాటు, ఫిర్యాదు అధికారి పేరును వెబ్‌సైట్‌లో స్పష్టంగా ప్రదర్శించాలని కేంద్ర వినియోగదారులు, ఆహారం, ప్రజాపంపిణీ వ్యవహారాలశాఖ ఆదేశించింది. వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులకు 48 గంటల్లోపు రశీదు (అక్నాలెడ్జ్‌మెంట్ రిసీట్) పంపడంతో పాటు, నెలరోజుల్లోపు ఆ ఫిర్యాదును పరిష్కరించాలి. ఇ-కామర్స్ సంస్థ పేరు ఎంత ఫాంట్ సైజ్‌లో ఉంటుందో, అది జారీచేసే ఇన్వాయిస్‌లో విక్రయదారు పేరునూ అంతే సైజ్‌లో పొందుపరచాలి. జనవరి 1 నుంచి ఇ-కామర్స్‌కు అమల్లోకి రానున్న నూతన నిబంధనల్లో ఈ మేరకు పేర్కొంది.



## జొమాటో మరో షాక్..

ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో మరో షాకిచ్చింది క్యాష్ ఆన్ డెలివరీలపై అదనంగా రూ.5 ఛార్జీ వసూలు చేస్తోంది. ఇప్పటికే కంపెనీ బిల్ సమ్మరీలో ఈ ఛార్జీలు కనిపిస్తున్నాయి. ఆదాయాన్ని మెరుగుపరుచుకోవడం, డిజిటల్ పేమెంట్ల వైపు వినియోగదారులను మళ్లించేందుకు కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఫుడ్ ఆర్డర్లపై ప్లాట్‌ఫాం ఫీజు, రెస్టరెంట్ ప్యాకేజింగ్ ఛార్జీలు, జీఎస్టీని జొమాటో వసూలు చేస్తుంది. దీనికి సీఓడీ ఛార్జీలు అదనపు భారం. ఆన్‌లైన్ పేమెంట్లు చేసే కస్టమర్లకు ఈ ఛార్జీలు వర్తించవు. కాగా, జొమాటో ఇటీవలే తన ప్లాట్‌ఫాం ఫీజును పెంచిన విషయం తెలిసిందే. వినియోగదారుడి ఒక్కో ఆర్డర్‌కు ఫీజును రూ.12.50 నుంచి రూ.14.90కి సవరించింది .ఫుడ్ డెలివరీ రంగంలో పోటీ తీవ్రమవుతోంది. ర్యాపిడో ఓన్లీ, ఫ్లిప్‌కార్ట్ ఈట్ ఇన్ ఫుడ్ డెలివరీ సేవలను ప్రయోగాత్మకంగా ప్రారంభించాయి. దీంతో ఈ రంగంలో ఉన్న జొమాటో, స్విగ్గీకి గట్టి పోటీ ఎదురవుతోంది. కంపెనీ లాభాల్ని పెంచుకోవడానికి జొమాటో సీఓడీ ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు సమాచారం.







## ఒరాకిల్‌లో మళ్లీ లేఆఫ్స్..

### ఇందుకు భారీగా నిధుల ఖర్చు!

ప్రముఖ టెక్ సంస్థ ఒరాకిల్ మళ్లీ ఉద్యోగాల కోతకు సిద్ధమవుతోంది ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి దాదాపు 700 మిలియన్ డాలర్లు (రూ.6,688 కోట్లు) వెచ్చించనున్నట్లు తెలుస్తోంది. ఏఐ డేటా సెంటర్ల కోసం అధిక నిధులను కేటాయించడమే ఈ కోతలకు కారణం. ఈ ఏడాదిలో ఇప్పటికే దాదాపు 20 వేలకు పైగా ఉద్యోగులను కంపెనీ తొలగించడం గమనార్హం.సంస్థ కార్యకలాపాల్లో కృత్రిమ మేధను భాగం చేయడానికి ఒరాకిల్ అధికంగా ఖర్చు చేస్తోంది. దీంతో ఆర్థిక పరమైన ఒత్తిళ్లను ఎదుర్కొంటోంది. ఈ ఏడాది కంపెనీ కర్యాకలాపాల పునర్నిర్మాణంలో భాగంగా దాదాపు 2.8 బిలియన్ డాలర్లు (రూ.26.7 వేల కోట్లు) కేటాయించింది. ఇందులో అధిక భాగం ఉద్యోగాల కోతకే నిధులు వెచ్చించింది. ఇప్పటికే 2.1 బిలియన్ డాలర్లను కేటాయించగా.. మరోసారి ఉద్యోగాల కోతకు అదనంగా 700 మిలియన్ డాలర్లను కేటాయిస్తోంది.

## 88 ఏళ్ల వృద్ధుడికి పింఛను పాలసీ..

- నిబంధనలకు విరుద్ధంగా జారీ
- కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్‌పై ఐఆర్‌డీఏఐ జరిమానా

**హైదరాబాద్:** పాలసీ నిబంధనలకు విరుద్ధంగా 88 ఏళ్ల వయోవృద్ధుడికి జీవిత బీమా పాలసీని విక్రయించిన వ్యవహారంలో కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీపై భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) ఆగ్రహం వ్యక్తం చేసింది. నిబంధనలు ఉల్లంఘించి, పాలసీని కట్టబెట్టినందుకు (మిస్ సెల్లింగ్) ఆ బీమా కంపెనీపై రూ.కోటి జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, తమ కార్పొరేట్ ఏజెంట్ అయిన కెనరా బ్యాంక్ ద్వారా 88 ఏళ్ల వ్యక్తికి 'డిఫర్డ్ యాన్యుటీ పాలసీ' విక్రయించింది. పాలసీదారుడిగా ఆ వృద్ధుడి పేరును, యాన్యుటెంట్ (పింఛను అందుకునేవారు)గా ఆయన కుమార్తె పేరును చేర్చారు. ఏటా రూ.2 లక్షల ప్రీమియం చొప్పున నాలుగేళ్లపాటు చెల్లించేలా ఈ పాలసీని రూపొందించారు.ఈ పాలసీలో చేరేందుకు 30-80 ఏళ్ల వారికి మాత్రమే అనుమతి ఉంటుంది. కానీ, వయోపరిమితి దాటినప్పటికీ వ్యక్తికి పాలసీని విక్రయించడమే కాకుండా, పాలసీదారుడి వయోభారాన్నీ, భారీ ప్రీమియాన్ని దృష్టిలో పెట్టుకుని, చేయాల్సిన ఆర్థిక స్తోమత, పాలసీ అనుకూలత విచారణలనూ కంపెనీ నిర్వహించలేదని ఐఆర్‌డీఏఐ విచారణలో తేలింది. దీంతోపాటు కొన్ని తీవ్రమైన లోపాలనూ నియంత్రణ సంస్థ గుర్తించింది.ప్లాన్ ముఖ్యాంశాలు, షరతులు పాలసీదారుడికి వెల్లడించలేదు. వెరిఫికేషన్ కాల్, ప్రతిపాదన పత్రం నిర్వహణలో తీవ్ర లోపాలు కనిపించాయి.పాలసీ ప్రయోజనాల గురించి ఇచ్చే అంచనా పత్రంపై పాలసీదారుడి నుంచి ఎలాంటి ధ్రువీకరణ లేదు.పాలసీని విక్రయించిన సమయంలో కస్టమర్ ఇన్ఫర్మేషన్ షీట్ (సీఐఎస్), దరఖాస్తు పత్రం ప్రతులను అందించలేదు.పాలసీ అధికారికంగా జారీ చేయకముందే ప్రీమియం సొమ్ము వసూలు చేశారు.పాలసీదారుడు మరణిస్తే, ఎలాంటి పరిణామాలు ఉంటాయనే విషయంపైనా స్పష్టమైన సమాచారం ఇవ్వలేదు. ఈ లోపాలన్నీ కంపెనీ అంతర్గత పర్యవేక్షణ వైఫల్యాన్ని, మోసపూరిత విక్రయాన్ని, పాలసీదారుల ప్రయోజనాలకు విఘాతం కలిగించడాన్ని స్పష్టంగా చెబుతున్నాయని ఐఆర్‌డీఏఐ పేర్కొంది. జరిమానాతో పాటు, 75 ఏళ్లు దాటిన వ్యక్తులకు కెనరా బ్యాంకు ద్వారా విక్రయించిన అన్ని పాలసీలపైనా సమగ్ర విచారణ నిర్వహించాలని ఆదేశించింది.

ప్రీమియం సొమ్ము వాపసు..
ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చి, ఐఆర్‌డీఏఐ దృష్టికి వెళ్లిన తర్వాత బీమా కంపెనీ స్పందించింది. సంస్థ ప్రతినిధులు పాలసీదారుడిని కలిసి, ఆయన కోరిక మేరకు రెండో ఏడాది ప్రీమియంతో కలిపి రూ.4.09 లక్షలను వెనక్కి ఇచ్చేశారు. విక్రయించిన ఏజెంట్‌కు ఇచ్చిన కమిషన్‌నూ రద్దు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఉల్లంఘనలు జరగకుండా ప్రచార పత్రాలు, పాలసీ పత్రాలు, సూటబిలిటీ అసెస్‌మెంట్ విధానాల్లో సవరణలు చేసినట్లు కంపెనీ తెలిపింది. పాలసీ జారీకి ముందే వీడియో ఆధారిత ధ్రువీకరణ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు వివరించింది.

ఇండస్‌ఇండ్ బ్యాంక్‌పైనా...
కార్పొరేట్ బీమా ఏజెంట్‌గా నిబంధనలు ఉల్లంఘించడమే కాకుండా, ఫిర్యాదుల వ్యవస్థపై అవాస్తవాలు సమర్పించిన ఇండస్‌ఇండ్ బ్యాంకుపైనా ఐఆర్‌డీఏఐ రూ.కోటి అపరాధ రుసు విధించింది. తనిఖీల సమయంలో పాలసీదారుల కోసం ప్రత్యేక ఫిర్యాదుల విభాగం, టోల్-ఫ్రీ ఐవీఆర్ వెసులుబాటు లేవని తేలింది. వెబ్‌సైటులో ఫిర్యాదుల పోర్టల్ అందుబాటులోకి తెచ్చామని బ్యాంకు స్క్రీన్‌షాట్లు సమర్పించినా, అధికారుల ప్రయోగాత్మక పరిశీలనలో ఎలాంటి రశీదు గానీ, ఎస్ఎంఎస్/ఇ-మెయిల్ సమాచారం గానీ వెళ్లలేదు. వ్యవస్థ పనిచేయడం లేదని నిరూపితం కావడంతో నియంత్రణ సంస్థ ఈ చర్యలు చేపట్టింది. పూర్తి వివరాలు లేకుండా ఎస్ఎంఎస్‌ల ద్వారానే పునరుద్ధరణ నోటీసులు పంపించడం, ఆర్‌బీఐ, సెబీ, ఈడీ విధించిన జరిమానాల సమాచారాన్ని నిర్ణీత 30 రోజుల్లోగా అందించకపోవడం, వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ సంఖ్య, మధ్యవర్తి హోదా స్పష్టంగా చూపకపోవడం వంటి లోపాలపైనా బ్యాంక్‌ను హెచ్చరించింది.

# రెడ్డి జాగృతిపై టీఆర్‌పీ ఫిర్యాదు

- బీసీల హక్కులకు భంగం కలిగిస్తే సహించం
- సంస్థ కార్యకలాపాలపై సమగ్ర విచారణ చేయాలి
- చట్టవిరుద్ధమైతే చర్యలు తీసుకోవాలి
- బీసీ ఉద్యోగులను అణగదొక్కుతున్నారని ఆరోపణ



**కరీంనగర్, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** బీసీల హక్కులు, సామాజిక న్యాయానికి భంగం కలిగించేలా ఏ సంస్థ వ్యవహరించినా సహించేది లేదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా అన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు కరీంనగర్‌లో టీఆర్‌పీ నాయకులతో కలిసి 'రెడ్డి జాగృతి' సంస్థ కార్యకలాపాలపై కరీంనగర్ టౌన్ ఏసీపీకి శనివారం ఫిర్యాదు చేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అఖిల్ పాషా మాట్లాడుతూ కుల సంఘాల పేరుతో సమాజం లో విభజనలకు దారితీసే, బీసీల హక్కులు, అవకాశాలకు విఘాతం కలిగించే చర్యలపై ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం సమగ్ర విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక వర్గం ప్రయోజనాల కోసం ఇతర బహుజన వర్గాల హక్కులను ప్రశ్నించే పరిస్థితి ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలకు సమాన హక్కులు, అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ శాఖల్లో అగ్రవర్ణ ఉద్యోగులకు ప్రాధాన్యం ఇస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఉద్యోగులను అణగదొక్కుతున్నారని ఆరోపించారు. ఇలాంటి విధానం కొనసాగితే బీసీ ఉద్యోగుల హక్కుల కోసం కూడా పార్టీ పోరాడుతుందని స్పష్టం చేశారు. 'రెడ్డి జాగృతి' కార్యకలాపాలు బీసీల హక్కులకు విఘాతం కలిగిస్తున్నాయా, సమాజంలో విద్వేషాలు లేదా అలజడులకు దారితీసే చర్యలు ఉన్నాయా అనే అంశాలపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలు ఉన్నట్లు తేలితే సంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఆర్‌పీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, జిల్లా మహిళా అధ్యక్షురాలు రాచురి అరుణ, కార్యదర్శి ఇశ్రత్ శావాలి, రాష్ట్ర యువజన సహాయ కార్యదర్శి మహబూబ్ అలీ, జిల్లా యువజన అధ్యక్షుడు రాకేష్, మైనారిటీ ప్రధాన కార్యదర్శి అంకుష్ శావాలి పాల్గొన్నారు.





# అప్రకటిత విద్యుత్ కోతలపై రైతుల ధర్నా

- పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన.. నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్

**వనపర్తి రూరల్, సెప్టెంబర్ 12, జనం సాక్షి :** వనపర్తి మండలం నాచహళ్లి, కృష్ణగిరి, పెద్దగూడెం తండా, సవాయిగూడెం గ్రామాలకు చెందిన రైతులు అప్రకటిత విద్యుత్ కోతలను నిరసిస్తూ శనివారం సబ్‌స్టేషన్ సమీపంలో ధర్నా చేపట్టారు. వనపర్తి–పెబ్బేరు ప్రధాన రహదారిపై బైఠాయించి విద్యుత్ శాఖకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న ఏఈ చంద్రశేఖర్ అక్కడికి చేరుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డీఈతో మాట్లాడించాలని రైతులు పట్టుబట్టడంతో ఏఈ ఫోన్‌లో డీఈతో మాట్లాడించారు.

ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రభుత్వం 13 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అప్రకటిత కోతలతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లాగ్‌బుక్‌లో సరఫరా చేసిన సమయం కంటే ఎక్కువగా నమోదు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు అంతరాయం లేని విద్యుత్ అందించా లని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కే. మాణిక్యం, సింగిల్ విండో అధ్యక్షుడు రఘువరన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ధర్మనాయక్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ దేగ మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## యాలాల మండలంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

**రైతులు అడ్డుకుంటే పోలీసుల బెదిరింపులా?: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి**



**యాలాల సెప్టెంబర్ 12 ( జనంసాక్షి ) :** యాలాల మండల తహశీల్దార్ కార్యాలయం ముందు ఇసుక అక్రమ రవాణాపై బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి పార్టీ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇసుక అక్రమ రవాణా మళ్లీ యథేచ్ఛగా కొనసాగుతోందని ఆరోపించారు. ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్ కు మొరపెట్టుకున్నా ఫలితం దక్కలేదని ఎమ్మార్వో దృష్టికి తీసుకెళ్తే నాకు ఎలాంటి సంబంధం లేదని తప్పించుకుంటున్నారని అన్నారు. చలాన్ల పేరుతో ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోందని, జేసీబీలతో, టిప్పర్ల సహాయంతో జీపీఆర్ లేకుండా ఇసుకను కోడంగల్ కు తరలిస్తున్నారు. దీన్ని గ్రామస్తులు అడ్డుకుంటే పోలీసులతో బెదిరిస్తున్నారని రవీందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. యాలాల్ మండలంలోని కొంతమంది ప్రముఖ నాయకులకు ముడుపులు చెల్లిస్తూ ఇసుక అక్రమ రవాణాకు సహకారం అందిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇసుక రవాణాకు ఉపయోగిస్తున్న వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. కాగ్న వేణి నది నుంచి ఇసుక అక్రమ రవాణాను వెంటనే అరికట్టాలని, సంబంధిత అధికారులు ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకునే వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఇసుక మాఫియాపై వెంటనే చర్యలు తీసుకొని అక్రమ రవాణాను అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

## నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లో ప్రమాదం.. కార్మికుడు మృతి



**హయత్‌నగర్, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :** నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లో ప్రమాదం చోటు చేసుకుని ఓ యువ కార్మికుడు మృతి చెందిన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆర్టీసీ సూపర్వైజర్స్ కాలనీలో శివశ్రీ ఇన్‌ఫ్రా ఆధ్వర్యంలో నిర్మాణ పనులు జరుగుతున్న అపార్ట్‌మెంట్‌లో ఈ ప్రమాదం జరిగింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దేవ్‌కట్ట ప్రాంతానికి చెందిన దీపక్ యాదవ్ (24) తన తల్లితో కలిసి నెల రోజుల క్రితం హైదరాబాద్‌కు వచ్చాడు. ఆర్టీసీ సూపర్వైజర్స్ కాలనీలో జరుగుతున్న నిర్మాణ పనుల్లో కార్మికుడిగా చేరి అక్కడే నివాసం ఉంటున్నాడు. శనివారం ఉదయం ఐదో అంతస్తు కారిడార్‌లో ప్లాస్టరింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద ఉన్న కాంక్రీట్ పిల్లర్ స్లాబ్‌పై పడిపోయాడు. ఈ ప్రమాదంలో దీపక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ముక్కు, నోటి నుంచి రక్తస్రావం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. తోటి కార్మికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది దీపక్‌ను పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.
మృతుడి తల్లి బిందియాభాయ్ యాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిర్మాణ ప్రదేశంలో తగిన భద్రతా చర్యలు కల్పించడంలో శివశ్రీ ఇన్‌ఫ్రా యజమాని జానకిరామ్ రెడ్డి, కాంట్రాక్టర్ చిన్నారావు, సైట్ సూపర్వైజర్ కోటేష్ విఫలమైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలకు దర్యాప్తు కొనసాగిస్తున్నామని హయత్ నగర్ ఎస్హెచ్ఓ శంకర్ తెలిపారు.

## బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న అమృతకు ఆపన్నహస్తం కావాలి

- అయ్యా.. మా బిడ్డ ప్రాణాలు నిలబెట్టండి!
- పదిహేనేళ్ల బాలిక చికిత్సకు రూ.30 లక్షలు అవసరం



**ముషీరాబాద్, సెప్టెంబర్ 12 (జనం సాక్షి):**
బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న తమ 15 ఏళ్ల కుమార్తెకు మెరుగైన వైద్యం అందించి ప్రాణాలు కాపాడాలని తల్లిదండ్రులు దాతలను వేడుకుంటు న్నారు. తుకారాంగేట్ సమీపంలోని గౌతమ్‌నగర్‌కు చెందిన అనిల్, అంజలి దంపతుల కుమార్తె అమృత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. తల్లిదండ్రుల వివరాల ప్రకారం.. సుమారు నాలుగు నెలల క్రితం అమృతకు తరచూ తీవ్రమైన తలనొప్పి రావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆమె మెదడులో కణతి (బ్రెయిన్ ట్యూమర్) ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ప్రస్తుతం అమృతకు శస్త్రచికిత్స అత్యవసరమని, చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స చేయించాల్సి ఉంటుందని వైద్యులు సూచించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. శస్త్రచికిత్స, తదుపరి వైద్య చికిత్సకు సుమారు రూ.30 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. భవన నిర్మాణ మేస్త్రీగా పనిచేస్తున్న తండ్రి అనిల్‌కు ఇంత భారీ మొత్తాన్ని భరించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే అమృతకు ప్రతి నెలా మందులు, ఇతర వైద్య ఖర్చుల కోసం పెద్ద మొత్తంలో డబ్బు వెచ్చిస్తున్నామని తల్లిదండ్రులు తెలిపారు. తమ కుమార్తెకు అత్యవసరంగా శస్త్రచికిత్స చేయించాల్సి ఉన్నందున దాతలు మానవతా దృక్పథంతో ముందుకొచ్చి ఆర్థిక సహాయం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

**సహాయం చేయదలచిన దాతలు:** ఖాతాదారు పేరు: అంజలి. అకౌంట్ నంబర్: 110219877070 IFSC: CNRదీ0008686, బ్యాంక్: కెనరా బ్యాంక్, గౌతమ్‌నగర్ బ్రాంచ్ PhonePe: 9701866581 (అంజలి), మరిన్ని వివరాలకు: 9553404555 (అనిల్), అమృత చికిత్స కోసం తమకు తోచినంత సాయం అందించి చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు సహకరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## సీతారాం ఏచూరి ఆదర్శాలను ముందుకు తీసుకెళ్దాం

**ముషీరాబాద్, సెప్టెంబర్ 12 (జనం సాక్షి):** కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాలు, ఆదర్శాలను ముందుకు తీసుకెళ్లాలని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ సూచించారు. శనివారం ఎంబీ భవన్‌లో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు టి.జ్యోతి అధ్యక్షతన సీతారాం ఏచూరి రెండో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ.. సీతారాం ఏచూరి జీవితం శ్రామిక వర్గానికి, ప్రజా ఉద్యమాలకు మార్గదర్శకమన్నారు. రాజ్యసభలో ప్రజల గొంతుకగా నిలిచి కార్మికులు, పేదల హక్కుల కోసం పోరాడారని గుర్తుచేశారు. దేశంలో మతతత్వం, కార్పొరేట్ దోపిడీ పెరుగుతున్న నేపథ్యంలో లౌకిక, ప్రజాస్వామ్య శక్తుల ఐక్యత కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఐక్యంగా పోరాడుతూ సోషలిస్టు సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. దేశ లౌకిక, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఏచూరి చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని అన్నారు. మతోన్మాద శక్తుల విధానాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో ఎండగట్టిన గొప్ప నేతగా ఏచూరిని కొనియాడారు. కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, జాతీయ నాయకులు బి.వెంకట్, రాష్ట్ర కమిటీ సభ్యులు జె.బాబూరావు, బి.ప్రసాద్ పాల్గొన్నారు.

## కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం కావాలి

- కేసీఆర్ డైరెక్షన్‌తోనే దళితుల మీద అనుచిత వ్యాఖ్యలు మాట్లాడుతున్నారు
- అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ



**మహేశ్వరం, సెప్టెంబర్12(జనం సాక్షి):** మాజీ సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం కావాలని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీ కృష్ణ అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ లో కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఎస్సీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, స్టేట్ అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత మళ్లీ అధికారంలోకి ఎలా రావాలో అని కేసీఆర్ కుట్రలు చేశారన్నారు. కేసీఆర్ డైరెక్షన్ లోనే దళితుల మీద అనుచితంగా మాట్లాడడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ పార్టీ అన్నారు. అనంతరం మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేఎల్ఆర్ మాట్లాడుతూ...సీఎం రేవంత్ రెడ్డి కొత్త నగరం నిర్మిస్తున్నారన్నారు. మహేశ్వరం ప్రజలు బాగుపడతారని స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి భయం పట్టుకుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి డిపాజిట్లు కూడా దక్కాయన్నారు. 22ఏ తెచ్చింది బీఆర్ఎస్ నేతల కోసం అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన భూ కుంభకోణాలను బయటకు తీసేందుకు 22ఏ తెచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పి చైర్ పర్సన్ తీగల అనిత హరినాథ్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు ఏనుగు జంగారెడ్డి, దేప భాస్కర్ రెడ్డి, మల్లేష్ యాదవ్, ఢిల్లీ శ్రీధర్, రాణా ప్రతాప్ రెడ్డి, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కష్టకాలంలో పార్టీకి ఏచూరి సేవలు విలువైనవి

## సీతారాం ఏచూరి రెండో వర్ధంతి సందర్భంగా నివాళులు

**సిద్ధాంతపరమైన అంశాలపై స్పష్టమైన అవగాహన**

- కార్మిక, సామాజిక సమస్యలపై ప్రత్యేక దృష్టి : సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జె.వెంకటేష్
- జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు




**కాప్రా, సెప్టెంబర్ 12 (జనంసాక్షి):** భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు సీతారాం ఏచూరి చేసిన కృషి ఎంతో విలువైందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జె.వెంకటేష్ అన్నారు. సీపీఎం మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో ఈసీఎల్‌లోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం సీతారాం ఏచూరి రెండో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జె.వెంకటేష్ ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏచూరి సీనియర్ నాయకులతో కలిసి సిద్ధాంతపరమైన అంశాలపై చర్చించేవారని, మార్క్సిస్టు సిద్ధాంతాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండేవారని తెలిపారు. రివిజనిజం విషయంలో పార్టీ అప్రమత్తంగా ఉండాలని సూచించేవారని చెప్పారు. చిన్న వయసులోనే సీనియర్ నాయకులతో కలిసి పనిచేసిన ఆయనకు కార్మిక రంగంలో సమస్యలపై అవగాహన ఉండేదన్నారు. సామాజిక అంశాలతోపాటు నూతన ఆర్థిక విధానాలను కూడా అధ్యయనం చేశారని పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోమటి రవి మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణం సీపీఎంకు తీరని లోటని అన్నారు. విద్యార్థి దశ నుంచే చురుకుగా పనిచేసిన ఏచూరి జేఎన్‌యూలో రెండుసార్లు ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడిగా పనిచేశారని తెలిపారు. అనంతరం సీపీఎం కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరోలో కీలక బాధ్యతలు నిర్వహించి జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారని చెప్పారు. 2004లో యూపీఏ ప్రభుత్వ ఏర్పాటులో, పలు విధానాల రూపకల్పనలో ఏచూరి కీలక పాత్ర పోషించారని అన్నారు. రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా పనిచేసిన ఆయన పార్లమెంట్‌లో సమర్థవంతమైన వాణిని వినిపించారని తెలిపారు. అంతర్జాతీయ రాజకీయాలపై కూడా ఆయనకు మంచి అవగాహన ఉండేదన్నారు. ఇండియా కూటమి ఏర్పాటులోనూ ఏచూరి కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎర్ర అశోక్ వందన సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.వినోద, ఎన్.శ్రీనివాస్, ఎన్.సబిత, చ.యాదయ్య, సృజన, శ్రీమన్నారాయణ, యాదగిరిరావు, చల్లా లీలావతి, పి.గణేష్, ఎం.శ్రీనివాసరావు, సిహెచ్.ప్రసాద్, శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజన్ల కోసం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

**ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి కళ్లెం నవజీవన్ రెడ్డి**

**హయత్‌నగర్, సెప్టెంబర్ 12 (జనం సాక్షి) :** సీనియర్ సిటిజన్ల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా హయత్ నగర్ డివిజన్ పరిధిలోని భూలక్ష్మీనగర్ కాలనీ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సౌజన్యం, ఎం.ఎన్.జే ఇనిస్టూట్ ఆఫ్ అకాలజీ, ప్రాంతీయ క్యాన్సర్ కేంద్రం ఆధ్వర్యం లో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో తెలంగాణ రోడ్స్ అండ్ బిల్డింగ్స్ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి లు పాల్గొని వైద్య పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. క్యాన్సర్ వంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.
మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ల కోసం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేయడం మంచి కార్యక్రమమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో క్యాన్సర్ వంటి వ్యాధులను తొలిదశలోనే గుర్తించి తగిన వైద్యం అందించుకోవడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్లు కుటుంబానికి, సమాజానికి ఎంతో విలువైన వారని, వారి ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే ముందుగానే ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక సమస్యలను గుర్తించి నివారించవచ్చని తెలిపారు.
భూలక్ష్మీనగర్ కాలనీ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరం స్థానిక ప్రజలకు, ముఖ్యంగా వృద్ధులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, జిల్లా కార్యదర్శి సురేష్, పార్టీ అధికార ప్రతినిధి హరికిషన్ తో పాటు కమలానగర్, ద్వారకామైనగర్, శారదానగర్, సుభద్రానగర్, హైకోర్టు కాలనీ, రాజప్పనగర్ తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు, సీనియర్ సిటిజన్ సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఒధ్యారం గ్రామంలో గుర్తు తెలియని మృతదేహం

**గంగాధర:** మండలంలోని ఒధ్యారం గ్రామ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తించబడిందని గంగాధర ఎస్ఐ బి వంశీకృష్ణ తెలిపారు మృతుడి వయస్సు సుమారుగా 40 సంవత్సరాలు ఉంటుందని మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని మృతుడి వివరాలు మరియు ఆచూకీ కోసం విచారణ చేపట్టి మృతుడిని గుర్తించే ప్రయత్నం చేస్తున్నామని మృతుడి గురించి ఏవైనా వివరాలు తెలిసిన వారు లేదా తమ కుటుంబ సభ్యులు బంధువులు ఎవరైనా కనిపించకుండా పోయినట్లయితే గంగాధర పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని లేదా సెల్ నెంబర్‌కు 8712670768 సమాచారం అందించాలని ఎస్ఐ తెలిపారు.

# రియల్ ఎస్టేట్ రంగంలో మందగమనం

**మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా బిల్డర్లు అప్రమత్తంగా ఉండాలి**

- 22ఏ సమస్యతో కొనుగోళ్లపై ప్రభావం
- ప్రభుత్వమే సమస్యలను పరిష్కరించాలి
- సమష్టిగా సమస్యలపై పోరాడాలి




**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 12 (జనంసాక్షి):** రాష్ట్రవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగం ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో బిల్డర్లు అప్రమత్తంగా, సంయమనంతో ముందుకు సాగాలని గ్రేటర్ వెస్ట్ సిటీ బిల్డర్స్ అసోసియేషన్ సూచించింది. కొండాపూర్‌లోని శుభం గ్రాండ్ హోటల్‌లో శనివారం అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్మన్ మిరియాల రాఘవరావు మాట్లాడుతూ ప్రస్తుత ప్రతికూల మార్కెట్ పరిస్థితులను తట్టుకునేలా బిల్డర్లు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న స్థలాలను సేకరించుకుంటే రానున్న ఒకటి, రెండు సంవత్సరాల్లో మార్కెట్ పుంజుకునే అవకాశం ఉందని తెలిపారు. 22ఏ సమస్య కారణంగా వినియోగదారులు ఇళ్లు, ప్లాట్లు కొనుగోలు చేసేందుకు వెనుకాడుతున్నారని, దీంతో బిల్డర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.
అసోసియేషన్ అధ్యక్షుడు కె.రాజారెడ్డి మాట్లాడుతూ 22ఏ అంశంపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించి బిల్డర్లు, గృహ యజమానుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి పి.బి.ఎస్.విశ్వనాథ్ మాట్లాడుతూ బిల్డర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు ప్రాతినిధ్యాలు అందిస్తూ పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతులు పొందిన లేఅవుట్లలోనూ 22ఏ కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ద్వారా వివరించినట్లు చెప్పారు. నిర్మాణ రంగం నిర్వీర్యం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సమావేశం కోరింది. ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ స్వప్న శ్రీనివాస్ మాట్లాడుతూ బిల్డర్లు పరస్పరం సమస్యలను పంచుకుని పరిష్కారాల కోసం సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి బాణాల రామ్‌రెడ్డి మృతికి సంతాపంగా సభ్యులు మౌనం పాటించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రియల్ ఎస్టేట్ రంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశానికి సుమారు 125 మంది బిల్డర్లు హాజరయ్యారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

**అంజయ్యనగర్, హైటెక్‌సిటీ డివిజన్లలో పనులు**

- రూ.1.53 కోట్లతో స్మశానవాటిక అభివృద్ధి.. రూ.27 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 12 (జనంసాక్షి):** శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ సర్కిల్ పరిధిలోని అంజయ్యనగర్, హైటెక్‌సిటీ డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ శనివారం శంకుస్థాపన చేశారు. కొండాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్‌తో కలిసి ఆయన పనులను ప్రారంభించారు. అంజయ్య నగర్ కాలనీలో హిందూ స్మశానవాటిక అభివృద్ధి పనులను రూ.1.53 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే హైటెక్‌సిటీ డివిజన్ పరిధిలోని మాదాపూర్ డాక్టర్స్ కాలనీలో రూ.27 లక్షలతో నూతన సీసీ రోడ్లు, వరదనీటి కాలువ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రహదారులు, డ్రైనేజీ, వరదనీటి కాలువలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని అరికెపూడి గాంధీ తెలిపారు. పనులను దశలవారీగా పూర్తి చేస్తామని చెప్పారు. మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ మాట్లాడుతూ కాలనీల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.





## ఇద్దరు యువతులు వేర్వేరుగా అదృశ్యం


**శంషాబాద్, సెప్టెంబర్12(జనంసాక్షి) :**
శంషాబాద్, సిద్ధాంతి ప్రాంతాలకు చెందిన ఇద్దరు యువతులు శంషాబాద్ ఆర్జిఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరుగా అదృశ్యమయ్యారు. ఇన్స్పెక్టర్ వి. సంజీవ్ తెలిపిన ప్రకారం సిద్ధాంతికి చెందిన జహెరా ఖెనాహ్ (19) ఈ నెల 11న ఉదయం 8 గంటలకు బ్లింకిట్‌లో ఉద్యోగం కోసం అత్తాపూర్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అలాగే శంషాబాద్ సిద్ధేశ్వర్ కాలనీకి చెందిన కేతావత్ శివలీల (23) ఈ నెల 12న మధ్యాహ్నం 12 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదులతో పోలీసులు మిస్సింగ్ కేసులు నమోదు చేసి ఇద్దరి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

# రాజీ మార్గంలో సమస్యలకు శాశ్వత పరిష్కారం

- వివాదాలు మానసిక, శారీరక ఆరోగ్యానికి మంచివి కావు
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్ 12 (జనం సాక్షి);** ప్రజలు చిన్నచిన్న వివాదాలను పెద్దవిగా చేసుకొని శారీరకంగా, ఆర్థికంగా, మానసికంగా నష్టపోకుండా, పరస్పర అవగాహనతో సమస్యలను పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు పి.నీరజ అన్నారు.శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ప్రారంభ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు.సుప్రీంకోర్టు మరియు హైకోర్టు ఆదేశాల మేరకు జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామని, ప్రజలకు సత్వర న్యాయం అందించడంతో పాటు, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న రాజీ చేయదగిన కేసులు మరియు ప్రీ-లిటిగేషన్ కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించేందుకు లోక్ అదాలత్ ఒక మంచి వేదికగా నిలుస్తుందని తెలిపారు. సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు,మానసిక ప్రశాంతతను కోల్పోవడం కంటే,ఇరుపక్షాలు పరస్పర చర్చల ద్వారా రాజీకి రావడం ఉత్తమమైన మార్గమని పేర్కొన్నారు. భార్యాభర్తలు చిన్నచిన్న విభేదాల కారణంగా విడిపోకుండా,ఒకరినొకరు అర్థం చేసుకొని కలిసి జీవించాలని సూచించారు. అదే విధంగా అన్నదమ్ములు ఆస్తులు,భూమి వంటి విషయాల్లో తగాదాలకు వెళ్లకుండా,కుటుంబ ఐక్యతను కాపాడుకోవాలని కోరారు.కలిసి ఉంటే కలదు సుఖం అనే మాటను గుర్తు చేశారు.అన్నదమ్ముల మధ్య ఉన్న ఆస్తి విభజన దావాలు మరియు భూ వివాదాలు వంటి వివాదాలను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఇటీవల నిర్వహించిన సమావేశం లో బార్ అసోసియేషన్ సభ్యులు అందించిన ప్రోత్సాహం మరియు సహకారం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు.అదేవిధంగా లోక్ అదాల త్ కార్యక్రమాల గురించి ప్రజలకు విస్తృతంగా సమాచారం అందిస్తూ,న్యాయ సేవాధికార సంస్థ కార్యక్రమాలకు నిరంతరం సహకరిస్తున్న మీడియా ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల్లో న్యాయ అవగాహన పెంపొందించడంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.ఈ సమావేశంలో పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్,సీనియర్ సివిల్ జడ్జి కార్యదర్శి డిఎల్ఎస్ఏ పి.లక్ష్మణాచారి,బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆవునూరి రమాకాంతరావు, సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, న్యాయవాదులు మరియు కక్షిదారులు పాల్గొన్నారు.



# నవాబ్‌పేటలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చెల్లా నర్సింహా రెడ్డి
- వెంకట్‌రెడ్డికి మండల అధ్యక్షులుగా నియామక పత్రం అందజేత

**నవాబ్ పేట్ సెప్టెంబర్ 12 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీని నవాబ్ పేట్ మండలంలో మరింత బలోపేతం చేసేందుకు నూతన మండల అధ్యక్షుడు కృషి చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య,రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చెల్లా నర్సింహ రెడ్డి సూచించారు.నవాబుపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రావుగారి వెంకట్ రెడ్డి గత నెల నియమితులైన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా అధ్యక్షులు నర్సింహ రెడ్డి చేతుల మీదుగా శనివారం చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రావుగారి వెంకట్ రెడ్డి నియామక పత్రాన్ని అందుకున్నారు.ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా అధ్యక్షులు నర్సింహ రెడ్డి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకోవాలని తెలిపారు.ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని పేర్కొన్నారు.మండల అధ్యక్షుడిగా వెంకట్ రెడ్డి విజయవంతంగా బాధ్యతలు నిర్వహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం అధ్యక్షులు రావుగారి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని వెంకట్ రెడ్డి తెలిపారు.తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా అధ్యక్షులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు వెంకట్ రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల మండల అధ్యక్షులు,తదితరులు పాల్గొన్నారు.



## ఆర్థిక ఇబ్బందులతో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ మృతి

**అమీర్‌పేట్/బోరబండ, (జనం సాక్షి):** బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందిరా నగర్‌లో శనివారం తెల్లవారుజామున విషాద ఘటన చోటుచేసుకుంది. గద్దె పవన్‌కుమార్ (30) అనే సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ తన నివాసంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల సమాచారం ప్రకారం.. వ్యక్తిగత అవసరాల కోసం తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లించలేక కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురవుతున్నట్లు తెలిపారు. శనివారం తెల్లవారుజామున సుమారు 1.30 గంటల సమయంలో భార్య ఇంట్లో ఉండగా, పవన్‌కుమార్ బాత్‌రూమ్ లోకి వెళ్లి ఎంతసేపటికీ బయటకు రాకపోవ డంతో కుటుంబ సభ్యులు పరిశీలించారు. తలుపు తెరిచి చూడగా ఆయన మృతి చెంది కనిపించడంతో వెంటనే పోలీసులకు సమా చారం అందించారు. ఘటనా స్థలానికి చేరు కున్న బోరబండ పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మట్టి గణపతితో పర్యావరణ పరిరక్షణ

**భక్తితో పాటు బాధ్యతాయుతంగా వినాయక చవితి జరుపుకోవాలి: డాక్టర్ కోట నీలిమ**

**అమీర్‌పేట్, సెప్టెంబర్ 12 (జనం సాక్షి);** పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాలు ఎంతో మేలు చేస్తాయని పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమ అన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని అమీర్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో సత్యం థియేటర్ సర్కిల్ వద్ద శుక్రవారం మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కోట నీలిమ స్థానికులకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించడం ద్వారా పర్యావరణానికి హాని కలగకుండా పండగను ఆనందంగా జరుపుకోవచ్చన్నారు

## కుడికాల్వకు నీరు విడుదల చేయాలి

- ఎండిపోతున్న పంటలను కాపాడాలి
- వంతడుపుల-కరీంనగర్ రహదారిపై రాస్తారోకో

ఇల్లంతకుంట : మధ్యమానేరు కుడికాల్వ ద్వారా వెంటనే సాగునీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ రైతులు శనివారం రాస్తారోకో నిర్వహించారు. వంతడుపుల-కరీంనగర్ ప్రధాన రహదారిపై వంతడుపుల, వల్లంపట్ల, రంగంపేట, పాండలపురం గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కుడికాల్వకు తక్షణమే నీటిని విడుదల చేసి పంటలను యుద్ధప్రాతిపదికన కాపాడాలని డిమాండ్ చేశారు. నీరందక పంటలు ఎండిపోతున్నాయని, నెలల తరబడి శ్రమించి పెట్టిన పెట్టుబడులు వృథా అయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కుడికాల్వ సమీపంలోని పొలాలకే సాగునీరు అందకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నీరందక పంట నష్టపోయిన రైతులను గుర్తించి తగిన పరిహారం చెల్లించాలని కోరారు. రైతుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వారి సాగునీటి సమస్యను పట్టించుకోకపో వడం బాధాకరమన్నారు. రైతు సంక్షేమంపై ప్రకటనలకు పరిమితం కాకుండా తక్షణమే చర్యలు తీసుకుని కుడికాల్వకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## బస్సు ఢీకొని మహిళ మృతి, బైక్ రైడర్‌కు తీవ్ర గాయాలు

**పంజాగుట్ట/అమీర్‌పేట్, జనం సాక్షి);** శ్రీనగర్ కాలనీలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వి. హేమ (తూర్పుగోదావరి జిల్లా) మృతి చెందారు. బోరబండ నుంచి మెహిదీపట్నం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు (ం+ 10 ం 7336) ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ప్రమాదంలో ఉబర్ బైక్ రైడర్ హేమాంచల్ పాత్రో తీవ్రంగా గాయపడ్డారు. ఒడిశాకు చెందిన ఆయన ప్రస్తుతం బాలాపూర్‌లో నివసిస్తున్నారు. చికిత్స కోసం మెడిటెక్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సు కూకట్‌పల్లి డిపోకు చెందినదిగా పోలీసులు గుర్తించారు. ఘటనపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ కొనసాగుతోంది.

# వ్యవసాయ మార్కెట్‌కు రూ.2.96 కోట్ల నిధులు

- గోదాం నిర్మాణానికి రూ.2.26 కోట్లు.. డ్రైనేజీకి రూ.55 లక్షలు
- టాయిలెట్ బ్లాక్ నిర్మాణానికి రూ.14.50 లక్షలు
- సీఎం, మంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



**కథలాపూర్, సెప్టెంబర్ 12 (జనం సాక్షి) :** కథలాపూర్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2.96 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులు విడుదల కావడంతో మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మార్కెట్ యార్డులో సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పుంద్ర నారాయణరెడ్డి, వైస్ చైర్మన్ పులి శిరీష హరిప్రసాద్, కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మాట్లాడుతూ మార్కెట్ అభివృద్ధి కోసం మంజూరైన నిధులతో గోదాం నిర్మాణానికి రూ.2.26 కోట్లు, డ్రైనేజీ నిర్మాణానికి రూ.55 లక్షలు, టాయిలెట్ బ్లాక్ నిర్మాణానికి రూ.14.50 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. గోదాం నిర్మాణంతో రైతులు తీసుకొచ్చే వ్యవసాయ ఉత్పత్తులను భద్రపరిచేందుకు అదనపు నిల్వ సదుపాయం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. డ్రైనేజీ, పారిశుద్ధ్య వసతులు మెరుగుపడటంతో మార్కెట్ యార్డులో పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. రైతులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడంతో పాటు మార్కెట్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో కథలాపూర్ మండలానికి వివిధ అభివృద్ధి పనులకు పెద్దఎత్తున నిధులు మంజూరవుతున్నాయని పేర్కొన్నారు. దేవాలయాల అభివృద్ధి, సూరమ్మ చెరువు ప్రాజెక్టు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సబ్‌స్టేషన్ వంటి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. మండల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు గమనించాలని, ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. కథలాపూర్ మండలానికి ప్రాధాన్యం ఇస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జగదీశ్వర్‌రావు, వాకిటి రాజారెడ్డి, కారపు గంగాధర్, అల్లం కొండ విజయ్, ఆకుల శంకర్, ఎండీ ఆఫీస్, రమేష్ నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి నాగరాజ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ అజీమ్, పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, జిల్లా కార్యదర్శి ధనుంజయరెడ్డి, మండల యువజన అధ్యక్షుడు అంబటి రాధాకృష్ణ, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు న్యావనంది శేఖర్, పలువురు సర్పంచులు, ఉప సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌లో 4,384 కేసుల పరిష్కారం

- రూ.3.27 కోట్ల పరిహారం మంజూరు



**కరీంనగర్ లీగల్, సెప్టెంబర్ 12 (జనం సాక్షి);** జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 4,384 కేసులు రాజీ మార్గంలో పరిష్కారమయ్యాయి. బాధితులకు రూ.3,27,43,000 పరిహారం మంజూరు చేశారు. ఇందులో 19 సివిల్, 4,241 క్రిమినల్, 59 మోటార్ వాహన, 15 సైబర్ క్రైమ్, 50 ప్రీ-లిటిగేషన్ కేసులు ఉన్నాయి. ట్రైనీ అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ పి. హరిప్రసాద్ అత్యధిక కేసులను పరిష్కరించారు. పెండింగ్ కేసులతో పాటు కోర్టుకు రాకముందే పరిష్కరించగల వివాదాలను రాజీ పద్ధతిలో ముగించడం ద్వారా ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించగలిగామని జిల్లా లీగల్ సర్వీసెస్ సెక్రటరీ యశ్వంత్ సింగ్ తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు, రవాణా, మున్సిపల్ తదితర శాఖల అధికారులు, కోర్టు సిబ్బంది సమన్వయంతో లోక్ అదాలత్ విజయవంతమైందన్నారు.

# చేవెళ్ల కాంగ్రెస్‌కు నూతన నాయకత్వం

***మూడు మున్సిపాలిటీలు, ఐదు మండలాలకు అధ్యక్షుల నియామకం***

- కొత్త అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేత
- పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి
- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



**మొయినాబాద్, సెప్టెంబర్ 12 (జనం సాక్షి);** చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు నూతన నాయకత్వాన్ని నియమించారు. ఇటీవల ఎంపికైన మూడు మున్సిపాలిటీల అధ్యక్షులు, ఐదు మండలాల అధ్యక్షులకు శనివారం డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య నియామక పత్రాలను అందజేశారు. చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడిగా బి. శ్రీనివాస్ గౌడ్, మొయినాబాద్ అధ్యక్షుడిగా విక్రమ్‌రెడ్డి, శంకర్‌పల్లి అధ్యక్షుడిగా చంద్రమౌళి, చేవెళ్ల మండల అధ్యక్షుడిగా గిరిధర్‌రెడ్డి, నవాబ్‌పేట్ మండల అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి, షాబాద్ మండల అధ్యక్షుడిగా పెంటారెడ్డి, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడిగా వెంకటరెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ కొత్తగా బాధ్యతలు చేపట్టిన అధ్యక్షులు తమ పరిధిలో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. గ్రామాలు, వార్డుల స్థాయిలో కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు కార్యకర్తలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానం, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తామని, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ సమతా వెంకటరెడ్డి, కౌన్సిలర్ శైలజ ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకటరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రాము గౌడ్, శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు యాదవ్, పలువురు మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# వ్యవసాయ మార్కెట్‌కు రూ.2.96 కోట్ల నిధులు

- గోదాం నిర్మాణానికి రూ.2.26 కోట్లు, డ్రైనేజీకి రూ.55 లక్షలు
- టాయిలెట్ బ్లాక్ నిర్మాణానికి రూ.14.50 లక్షలు
- సీఎం, మంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



**కథలాపూర్, సెప్టెంబర్ 12 (జనం సాక్షి);** కథలాపూర్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2.96 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులు విడుదల కావడంతో మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మార్కెట్ యార్డులో సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పుంద్ర నారాయణరెడ్డి, వైస్ చైర్మన్ పులి శిరీష హరిప్రసాద్, కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మాట్లాడుతూ మార్కెట్ అభివృద్ధి కోసం మంజూరైన నిధులతో గోదాం నిర్మాణానికి రూ.2.26 కోట్లు, డ్రైనేజీ నిర్మాణానికి రూ.55 లక్షలు, టాయిలె ట్ బ్లాక్ నిర్మాణానికి రూ.14.50 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. గోదాం నిర్మాణంతో రైతులు తీసుకొచ్చే వ్యవసాయ ఉత్పత్తులను భద్రపరిచేందుకు అదనపు నిల్వ సదుపాయం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. డ్రైనేజీ, పారిశుద్ధ్య వసతులు మెరుగుపడటంతో మార్కెట్ యార్డులో పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. రైతులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడంతో పాటు మార్కెట్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో కథలాపూర్ మండలానికి వివిధ అభివృద్ధి పనులకు పెద్దఎత్తున నిధులు మంజూరవు తున్నాయని పేర్కొన్నారు. దేవాలయాల అభివృద్ధి, సూరమ్మ చెరువు ప్రాజెక్టు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సబ్‌స్టేషన్ వంటి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. మండల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు గమనించాలని, ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. కథలాపూర్ మండలానికి ప్రాధాన్యం ఇస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జగదీశ్వర్‌రావు, వాకిటి రాజారెడ్డి, కారపు గంగాధర్, అల్లం కొండ విజయ్, ఆకుల శంకర్, ఎండీ ఆఫీస్, రమేష్ నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి నాగరాజ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ అజీమ్, పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, జిల్లా కార్యదర్శి ధనుంజయరెడ్డి, మండల యువజన అధ్యక్షుడు అంబటి రాధా కృష్ణ, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు న్యావనంది శేఖర్, పలువురు సర్పంచు లు, ఉప సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై అత్యాచార యత్నం కేసు నమోదు

**యాచారం, సెప్టెంబర్ 12 (జనం సాక్షి ):** యాచారం మండల పరిధిలోని తమ్ములోని గూడ గ్రామంలో తొమ్మిదేళ్ల మైనర్ బాలికపై అదే గ్రామానికి చెందిన లక్ష్మణ్ (30) అనే వ్యక్తి అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయంపై బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు యాచారం పోలీసులు నిందితుడిపై ఫోక్సో కేసు నమోదు చేశారు. ఈ మేరకు లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు యాచారం సీఐ నందీశ్వర్ రెడ్డి తెలిపారు.

## అనారోగ్యం ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

**మల్యాల సెప్టెంబర్ 12 (జనం సాక్షి) :** పోతారం గ్రామానికి చెందిన చుంచుల చిన్నారెడ్డి(53) సెప్టెంబర్ 11వ తేదీ శుక్రవారం సాయంత్రం సుమారు 6 గంటలకు ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతడి గురించి వెతుకుతున్న క్రమంలో శనివారం ఉదయం చెరువు కట్టకు వెళ్లే దారిలో విషపదార్థం సేవించి మృతి చెందిన స్థితిలో కనిపించాడని చిన్నారెడ్డి హార్వెస్టర్ వ్యాపారంలో భారీ నష్టాలు,అప్పులు,ఆరోగ్య మరియు కుటుంబ సమస్యల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై ఏదో క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి కొడుకు వెంకటేష్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

## గణేష్ మండప పనుల్లో యువకుడి మృతి

**తలకొండపల్లి, సెప్టెంబర్ 12 (జనంసాక్షి):** వినాయక మండపం ఏర్పాటు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కట్టర్ మిషన్ జారి తీవ్రంగా గాయపడి ఓ యువకుడు మృతి చెందాడు. తలకొండపల్లి ఇన్‌స్పెక్టర్ వి.జానకిరామ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వెల్జాల్ గ్రామానికి చెందిన కూరకుల రాఘవేందర్ (23) ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. వినాయక చవితి సందర్భంగా శనివారం మధ్యాహ్నం 12.40 గంటలకు తన ఇంటి ముందు ఉన్న హనుమాన్ ఆలయం వద్ద అన్న ఆంజనేయులు, బాబాయ్ లక్ష్మయ్య, మామ మల్లేష్‌తో కలిసి గణేష్ మండపం ఏర్పాటు పనులు చేపట్టాడు. మండపంపైకి ఎక్కి కట్టెలను కట్ చేస్తుండగా కట్టర్ మిషన్ ప్రమాదవశాత్తు జారి కుడి చేయి మోచేతి వద్ద తీవ్ర గాయమైంది.

దీంతో బ్యాలెన్స్ తప్పి కిందపడగా, కట్టర్ మిషన్ ఛాతిపై పడటంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి కూరకుల సావిత్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

# ప్రజల మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

- 42వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి - డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) :**

కరీంనగర్ నగరం, డివిజన్ అభివృద్ధిలో భాగంగా 42వ డివిజన్ లోని కాశ్మీర్ గడ్డ మునావర్ మసీదు వీధిలో నూతనంగా చేపడుతున్న సి.సి. రోడ్డు నిర్మాణ పనులకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్మాణ పనుల సమయంలో స్థానిక ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ... గతంలో 42వ డివిజన్ ఏ విధంగానైతే సమస్యలు లేని డివిజన్ గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందో, అదే విధంగా కొత్తగా డివిజన్‌లో కలిసిన అన్ని ప్రాంతాల్లోని సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. డివిజన్ లో కొత్తగా కలిసిన వివేకానంద స్కూల్ పరిసర ప్రాంతాల్లో, త్వరలోనే అభివృద్ధి పనులను ప్రారంభించి, స్థానిక సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లా పరిషత్ క్వార్టర్స్ వద్ద ఉన్న పార్కును త్వరలోనే అధునాతన రీతిలో అభివృద్ధి చేసి స్థానిక ప్రజలకు పునరంకితం చేయనున్నట్లు వెల్లడించారు. డివిజన్ వ్యాప్తంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పనులన్నీ పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి.చంద్రమౌళి శ్రీధర్, అశోక్, వినోద్ కుమార్, విజయ భాస్కర్, ఖాదర్ ఫారుకి, ఇబ్రహీం, తబ్రేజ్, షారుక్, మహమ్మద్ ఆబిద్ డివిజన్ పెద్దలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# యువతే దేశానికి భవిష్యత్ శక్తి

- ఉపాధి, ఉద్యోగ రంగాల్లో సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవాలి
- ప్రజా సమస్యలపై ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలి
- కాంగ్రెస్ హామీల అమలులో విఫలమైంది: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- కేసీఆర్ 3.0తో తెలంగాణ పునర్నిర్మాణం



**నవాబ్‌పేట్, సెప్టెంబరు 12 (జనంసాక్షి):** యువత దేశానికి, సమాజానికి భవిష్యత్ శక్తి అని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. నవాబ్‌పేట్ మండల కేంద్రంలోని లింగంపల్లి లక్ష్మారెడ్డి గార్డెన్‌లో బీఆర్ఎస్ అధికార ప్రతినిధి కడిచర్ల సుధాకర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన యువత ఆత్మీయ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. యువత విద్యతో పాటు సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని, ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారానికి బాధ్యతగా ముందుకు రావాలని సూచించారు. పోటీ ప్రపంచానికి అనుగుణంగా నైపుణ్యాలను మెరుగుపరుచుకుని ఉపాధి, ఉద్యోగ రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. 420 హామీలు ఇచ్చి వెయ్యి రోజుల పాలన దాటినా ప్రజలకు పూర్తి స్థాయిలో ఫలితాలు కనిపించడం లేదని విమర్శించారు. హామీలను విస్మరిస్తే ప్రజలు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతారని అన్నారు. కేసీఆర్‌ను అవమానించడం తెలంగాణ ఉద్యమకారులను అవమానించడమేనని పేర్కొన్నారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు సరికాదన్నారు. స్పీకర్‌ను కులం పేరుతో ప్రస్తావించడం అవమాన కరమని వ్యాఖ్యానించారు. కేసీఆర్ '3.0' కోసం వ్యూహరచన చేస్తున్నారని, రాబోయే ప్రభుత్వంలో తెలంగాణను పునర్నిర్మిస్తామని తెలిపారు. బీఆర్ఎస్‌లో 'అంతర్జాతీయ కార్యదర్శి' అనే పదవి లేదని, సంధ్యారావు పేరుతో అలాంటి హోదాను సృష్టించి సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, రాష్ట్ర నాయకులు, పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వినాయక చవితికి ప్రత్యేక బస్సులు

- భక్తులకు టీజీఎస్ ఆర్టీసీ శుభవార్త



హైదరాబాద్ (జనంసాక్షి) : వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్ నగరంలోని ప్రసిద్ధ ఖైరతాబాద్ మహా గణపతి, బాలాపూర్ గణేష్ మండపాలను దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) భారీ స్థాయిలో ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రకటించింది. ఈ ప్రత్యేక బస్సులు సెప్టెంబర్ 14వ తేదీ సోమవారం నుండి సెప్టెంబర్ 24వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని టీజీఎస్ ఆర్టీసీ వీసీ, ఎండీ వై. నాగిరెడ్డి వెల్లడించారు. నగరంలోని ప్రధాన బస్ స్టేషన్లయిన జేబీఎస్, ఎంజీబీఎస్ మీదుగా సాగే ఈ రవాణా సౌకర్యాన్ని భక్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ ప్రత్యేక బస్సులు జేబీఎస్ నుండి ప్రారంభమై ప్యాట్నీ, బాటా, బోట్ క్లబ్, ట్యాంక్ బండ్, ఐమాక్స్, ఖైరతాబాద్, లక్డీకాపూల్, గాంధీ భవన్, అఫ్జల్‌గంజ్, సీబీఎస్/ఎంజీబీఎస్, విమెన్స్ కాలేజ్, జె.గార్డెన్, గవర్నమెంట్ ప్రెస్, ఐ.ఎస్. సదన్, పిసల్‌బండ, మిధాని టి.షిప్, బాలాపూర్ ఎక్స్ రోడ్, శివాజీ చౌక్ల మీదుగా బాలాపూర్ గణేష్ మండపానికి చేరుకుంటాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా జేబీఎస్ వద్ద ఉదయం 6:00 గంటలకు మొదటి సర్వీస్ ప్రారంభమై రాత్రి 21:55 గంటల వరకు ప్రతి 40 నుండి 50 నిమిషాల వ్యవధితో నిరంతరాయంగా బస్సులు నడుస్తాయి. అలాగే బాలాపూర్ గణేష్ మండపం నుండి తిరుగు ప్రయాణ బస్సులు ఉదయం 7:55 గంటలకు ప్రారంభమై రాత్రి 23:50 గంటల వరకు అందుబాటులో ఉంటాయని ఆర్టీసీ యాజమాన్యం స్పష్టం చేసింది. ప్రతిష్టాత్మక హైదరాబాద్ గణేష్ ఉత్సవాల వేళ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సుఖవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎండీ నాగిరెడ్డి వివరించారు.

# నిమ్స్‌లో పీడియాట్రిక్ కార్డియాక్ సర్జరీ క్యాంప్ విజయవంతం

- ముఖ్యమంత్రికి వైద్యుల కృతజ్ఞతలు



హైదరాబాద్ (జనం సాక్షి) : నిమ్స్‌లో పీడియాట్రిక్ కార్డియాక్ సర్జరీ క్యాంప్ విజయ వంతంగా పూర్తయిన సందర్భంగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని వైద్యులు డి.రమణ ధన్నపునేని, ఎం. అమరేష్‌రావు మర్యాదపూ ర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నిమ్స్‌లో ఈ నెల 6 నుంచి 12 వరకు క్యాంపు ను నిర్వహించగా పుట్టుకతో గుండె జబ్బు లతో బాధపడుతున్న 19 మంది చిన్నారులకు క్యాంపులో శస్త్రచికిత్సలు చేశారు. ఇందులో కేవలం 2 కిలోల బరువున్న 2 నెలల పసికం దుకి విజయవంతంగా శస్త్రచికిత్స పూర్తి చేయడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైద్యులను అభినందించారు. ఈ కార్యక్ర మంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు.

# రాజకీయంగా మైనార్టీ స్థాయికి బీసీలు

- శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి
- బీసీలకు మూడు మంత్రి పదవులివ్వాలి
- బీసీ ఇంటెలెక్టువల్స్ ఫోరం చైర్మన్ టి. చిరంజీవులు



హైదరాబాద్, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) : రాజకీయంగా మైనార్టీ స్థాయికి బీసీలను దిగజార్చారని శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు. జనాభాలో మెజారిటీగా ఉన్న బీసీలకు రాజకీయ రంగంలో తగిన ప్రాతినిధ్యం కల్పించాలనే డిమాండ్‌తో '56 శాతం బీసీలు.. రాజకీయ రంగంలో వాటా ఎక్కడ?' అనే అంశంపై ఈరోజు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, బీసీ ఇంటెలెక్టువల్స్ ఫోరం చైర్మన్ టి. చిరంజీవులు అధ్యక్షత వహించారు. ఎన్జీవోలు, సామాజిక ఉద్యమకారులు, మేధావులు, వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, బీజేపీ నాయకుడు తాడూరి శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న మూడు మంత్రి పదవులను తక్షణమే బీసీలకు కేటాయించాలని రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా డిమాండ్ చేసింది. అలాగే త్వరలో ఖాళీ కానున్న 5 ఎంఎల్సీ స్థానాలను బీసీ ల కు కేటాయించాలని నిర్ణయించింది. జనాభా ప్రాతిపదికన ప్రభుత్వంలో బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా సామాజిక న్యాయాన్ని అమలు చేయాలని కోరింది. ఇప్పటి వరకు తగిన ప్రాతినిధ్యం లభించని వడ్డెర, కుమ్మరి, నాయీ బ్రాహ్మణ వంటి బీసీ కులాలకు అవకాశం కల్పించడంతో పాటు మిగిలిన స్థానాలను కూడా బీసీలకే కేటాయించాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. సమావేశంలో బీసీల రాజకీయ ప్రాతినిధ్యంపై టి. చిరంజీవులు గణాంకాలతో కూడిన ప్రజెంటేషన్ ఇచ్చారు. గత రెండు దశాబ్దాల్లో బీసీల రాజకీయ ప్రాతినిధ్యం క్రమంగా తగ్గిపోతున్న పరిస్థితిని ఆయన వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐదుగురు బీసీలు మంత్రులుగా ఉండగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో ఆ సంఖ్య నలుగురికి, 2018లో ముగ్గురికి, ప్రస్తుతం 2026లో ఇద్దరికి తగ్గిందని ఆయన పేర్కొన్నారు. 'ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో బీసీల మంత్రివర్గ ప్రాతినిధ్యం ఒకటికి, చివరకు శూన్యానికి చేరే ప్రమాదం ఉంది. జనాభాలో మెజారిటీగా ఉన్న బీసీలు పరిపాలనలో మైనారిటీగా మారడం ప్రజాస్వామ్యానికి, సామాజిక న్యాయానికి విరుద్ధం' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం, నల్గొండ, నిజామాబాద్ తదితర జిల్లాల్లో బీసీల రాజకీయ ప్రాతినిధ్యం తగ్గుతున్న తీరును కూడా గణాంకాలతో వివరించారు.

శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ జనాభాలో మెజారిటీగా ఉన్న బీసీలు రాజకీయ అధికారంలో మాత్రం మైనారిటీ స్థాయిలో ఉండటం బాధాకరమన్నారు. బీసీలకు న్యాయమైన వాటా లభించాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, బీసీలు ఐక్యంగా ఉంటేనే రాజకీయాధికారాన్ని సాధించగలరని అన్నారు. బీసీలంతా ఐక్యంగా తమ హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. జనగణనలో ప్రతి కులానికి యూనిక్ కోడ్ కేటాయించాల్సిన అవసరాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. బాలగోని బాలరాజుగౌడ్ మాట్లాడుతూ, బీసీల హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం కోసం జరుగుతున్న ఉద్యమానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ, శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు 'సామాజిక న్యాయం' గురించి మాట్లాడుతూనే, మరోవైపు దేశంలోని నాలుగు రాష్ట్రాల్లో అగ్రకులాలకు చెందిన వ్యక్తులను ముఖ్యమంత్రులుగా నియమించడం ద్వారా సామాజిక న్యాయం విషయంలో ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. జనాభాలో బీసీలు మెజారిటీగా ఉన్నప్పటికీ, రాజకీయ అధికారంలో వారికి తగిన వాటా దక్కడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'బీసీలకు కేవలం ఓటు హక్కు మాత్రమే కాదు–అధికారంలో కూడా జనాభా ప్రాతిపదికన వాటా కావాలి' అని ఆయన స్పష్టం చేశారు. బీసీల రాజకీయ ప్రాతినిధ్యం పెంచేందుకు అన్ని వర్గాల ప్రజాస్వామిక శక్తులు ఏకమై ఉద్యమించాల్సిన అవసరం ఉందని బాలరాజుగౌడ్ పిలుపునిచ్చారు. బీజేపీ నాయకుడు తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీ కులాలను విభజించి, వారి ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలు తమ రాజకీయ శక్తిని గుర్తించి ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కటకం నరసింహారావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం మాదిరిగానే బీసీ హక్కుల కోసం కూడా ఉవ్వెత్తున ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. గుజ్జ సత్యం మాట్లాడుతూ రాబోయే కాలం బీసీలదేనని, బీసీ రాజ్యాధికారం సాధ్యమేనని అన్నారు. వట్టే జనార్దన్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వంలో యాదవులపై వేధింపులు పెరుగుతున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న మూడు మంత్రి పదవుల్లో కనీసం ఒక పదవిని యాదవులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ విట్టల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీసీలకు రాజకీయంగా తీవ్రమైన అన్యాయం జరిగిందని అన్నారు. ఖమ్మం జిల్లాలో కూడా బీసీలకు తగిన ప్రాతినిధ్యం లేదని, మున్నూరు కాపు సమాజానికి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. సమావేశంలో బీసీ నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఎనిమిది దశాబ్దాలు గడిచినా జనాభాలో మెజారిటీగా ఉన్న బీసీలకు అధికారంలో తగిన వాటా ఎందుకు లభించలేదని ప్రశ్నించారు. రాజు అడ్వొకేట్ మాట్లాడుతూ, తెలంగాణలో తొలిసారిగా బార్ కౌన్సిల్ ఎన్నికల్లో బీసీలు విజయదుందుభి మోగించారని అన్నారు. బీసీ అడ్వొకేట్లలో పెరుగుతున్న చైతన్యం, ఐక్యతకు ఈ విజయం నిదర్శనమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో బార్ కౌన్సిల్ అధ్యక్ష పదవిని కూడా బీసీలు చేపట్టే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పొన్నం దేవరాజు మాట్లాడుతూ న్యాయవాదుల రంగంలో బీసీ చైతన్యం ఈరోజు వెల్లువెత్తుతోందని అన్నారు. బీసీ అడ్వొకేట్లు తమ హక్కులు, రాజకీయ మరియు సామాజిక ప్రాతినిధ్యం కోసం ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎర్ర సత్యనారాయణ, సూర్యనారాయణ రిటైర్డ్ డీఆర్వో ఇలి వెంకన్న, దుర్గయ్య గౌడ్, మెట్టు సూర్యప్రకాశ్, బైరి శేఖర్, కర్నాటి మనోహర్, చిన్నారాములు, ముదిరాజ్ చెన్న శ్రీకాంత్, బొంగు ప్రసాద్, నీరజ గౌడ్, లింగేశ్ చోళ రాజేశ్వర్,యాదవ్ తదితరులు పాల్గొన్నారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రాజకీయ వాటా దక్కే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని సమావేశం స్పష్టం చేసింది. ప్రస్తుతం ఖాళీగా ఉన్న మూడు మంత్రి పదవులను తక్షణమే బీసీలకు కేటాయించాలని, గవర్నర్ కోటాలో ఖాళీ కానున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని, వడ్డెర, కుమ్మరి, నాయీబ్రాహ్మణ తదితర ఇప్పటివరకు తగిన ప్రాతినిధ్యం పొందని బీసీ కులాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, జనగణనలో ప్రతి కులానికి ప్రత్యేకమైన యూనిక్ కోడ్ కేటాయించాలని, బీసీల రాజకీయ ప్రాతినిధ్యంపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృతమైన చర్చ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, బీసీలకు జరుగుతున్న రాజకీయ అన్యాయంపై గణాంకాలతో కూడిన ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలని బీసీ సమాజంలోని అన్ని కులాలు, సంఘాలు, మేధావులు ఐక్యంగా ముందుకు రావాలని సమావేశం తీర్మానించింది.

# ఓవర్ బర్డెన్ లక్ష్యాలను సాధించాలి

- రోజుకి ఆఫ్ లోడింగ్ ద్వారా 12.1 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగింపే లక్ష్యం
- అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లకు సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి దిశానిర్దేశం



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్ర విద్యుత్ అవసరాలకు తగినంత బొగ్గును అందించాల్సి ఉన్నందున దీని కోసం సవరించిన ఓవర్ బర్డెన్ లక్ష్యాలను రోజువారీగా సాధించాలని సింగరేణి సీఎండీ డా. బుద్ధప్రకాష్ జ్యోతి అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లకు దిశానిర్దేశం చేశారు. శనివారం ఆయన సింగరేణి వ్యాప్తంగా 15 ఓపెన్ కాస్ట్ గనుల్లో ఓవర్ బర్డెన్ తవ్వి తీసే పనులు నిర్వహిస్తున్న 19 ఆఫ్ లోడింగ్ సంస్థల పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోందని, దీనికి అనుగుణంగా సింగరేణి సంస్థ తన వంతుగా తగినంత బొగ్గును థర్మల్ విద్యుత్తు కేంద్రాలకు సరఫరా చేసేందుకు ప్రణాళికలు అమలు జరుపుతోందని, దీనికి అనుగుణంగా ఓపెన్ కాస్ట్ గనుల్లో సవరించిన ఓబీ తొలగింపు లక్ష్యాలను సాధించాల్సిన అవసరం ఉందని ఆయన కోరారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుండి ఆగస్టు నెల వరకు 1,205 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ ను తొలగించే లక్ష్యాన్ని నిర్దేశించగా 101 శాతంతో 1,221 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ ను తొలగించడం జరిగిందన్నారు. అయితే మొత్తం 19 ఆఫ్ లోడింగ్ సంస్థలలో ఆగస్టు నెలాఖరు వరకు 8 ఆఫ్ లోడింగ్ సంస్థల వారు మాత్రమే 100 శాతం ఓవర్ బర్డెన్ లక్ష్యాలు సాధించారని, మిగిలిన వారు లక్ష్యాలు సాధిస్తూ సహకరించాలన్నారు. కాగా సెప్టెంబర్ నెలలో నిర్దేశిత రోజువారీ ఓబీ తొలగింపు లక్ష్యం 7.28 లక్షల క్యూబిక్ మీటర్లుగా భావించినప్పటికీ పెరుగుతున్న బొగ్గు డిమాండ్ కు అనుగుణంగా రోజువారీ లక్ష్యాన్ని 12.1 లక్షల క్యూబిక్ మీటర్లుగా నిర్ణయించామని దీనికి అనుగుణంగా లక్ష్యాలు సాధించాలని కోరారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో ఓవర్ బర్డెన్ తొలగింపు లక్ష్యాలు ఖచ్చితంగా సాధించాలని ఆదేశించారు. జెవిఆర్ ఓసి, మణుగూరు ఓసి, జిడికె ఓసి, ఆర్జి ఓసి–3, ఆర్జి ఓసి–2, కెటికె ఓసి–2, శ్రీరాంపూర్ ఓసీలలో ఓబీ తొలగిస్తున్న కొన్ని ఆఫ్ లోడింగ్ సంస్థల వారు లక్ష్యాల సాధనలో కొంత వెనుకబడి ఉన్నారనీ, వెనుకబడిన లక్ష్యాల సాధనతో పాటు తాజాగా నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని కోరారు.

ఈ సందర్భంగా ప్రతీ ఆఫ్ లోడింగ్ సంస్థ ఎన్ని షవల్స్, ఎన్ని డంపర్లు వాడుతున్నాయి? లక్ష్యాల సాధనకు ఎన్ని వాడాల్సి ఉంది.....? అనే విషయాన్ని కూడా లోతుగా సమీక్షించారు, ఇంకా కొత్త ఓపెన్ కాస్ట్ గనులకు సంబంధించిన ఓబీ తొలగింపు ఆఫ్ లోడింగ్ టెండర్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను సంస్థ సీఎండీ ఆదేశించారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్య నారాయణ, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎం. తిరుమల రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్ మెంట్) బి. వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్ మరియు మార్కెటింగ్) టి. శ్రీనివాస్, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు, కార్పోరేట్ జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.


# దేశ సేవే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యం

- గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా
- గవర్నెన్స్ ఆఫ్ ది సెల్ఫ్ 75 లెస్సన్స్ ఇన్ లీడర్ షిప్, డిసిప్లేన్ అండ్ సర్వీస్ పుస్తకావిష్కరణ




హైదరాబాద్, సెప్టెంబరు 12 (జనంసాక్షి) : పదవి, అధికారం కంటే దేశ సేవకే ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పనిచేస్తున్నారని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. ఆయన నాయకత్వం, క్రమశిక్షణ, దేశం పట్ల నిబద్ధత యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. హైటెక్ సిటీలోని నోవాటెల్‌లో యువ న్యాయవాది అంబర్ అగర్వాల్ రచించిన గవర్నెన్స్ ఆఫ్ ది సెల్ఫ్ 75 లెస్సన్స్ ఇన్ లీడర్ షిప్, డిసిప్లేన్ అండ్ సర్వీస్ పేరుతో రచించిన పుస్తకాన్ని రాష్ట్ర గవర్నర్, ఇతర గెస్ట్ లతో కలిసి ఆవిష్కరించారు. రచయిత యువ న్యాయవాది అంబర్ అగర్వాల్ కు గవర్నర్ అభినందించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ నాయకత్వం ముందుగా మనల్ని మనం పాలించుకోవడంతోనే ప్రారంభమవుతుందని గవర్నర్ అన్నారు. పదవులు, అధికారాలు శాశ్వతం కావని.. ప్రజా జీవితంలో చేసిన సేవలే చిరస్థాయిగా నిలుస్తాయని అన్నారు. సింహాసనం అధిష్ఠించడమే లక్ష్యంగా కాకుండా దేశ ప్రయోజనాలే ధ్యేయంగా ప్రధాని మోదీ పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని మోదీకి పలు దేశాలు అత్యున్నత గౌరవాలు అందించిన విషయాన్ని గవర్నర్ ప్రస్తావించారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చి సేవాభావంతో పనిచేస్తే బలమైన, అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించగలమని శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ మహేంద్రనాథ్ పాండే, మాజీ డీజీపీ డాక్టర్ అరవింద్‌రావు, సామాజిక కార్యకర్త తేమ్సుతులా ఇమ్సోంగ్ లు తమ సందేశంలో యువతలో క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు అంబర్ అగర్వాల్ రచించిన గవర్నెన్స్ ఆఫ్ ది సెల్ఫ్ 75 లెస్సన్స్ ఇన్ లీడర్ షిప్, డిసిప్లేన్ అండ్ సర్వీస్ దోహదం చేస్తుందన్నారు. చిన్న వయస్సులో మంచి పుస్తకం రచించారని పేర్కొంటూ అంబర్ అగర్వాల్‌లు అభినందించారు. పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఎంపీలు ధర్మపురి అరవింద్, అరుణ, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రాకేష్ రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ తో పాటు పలువురు విద్యావేత్తలు, ప్రముఖులు, యువత, పుస్తక ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.










Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370